ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY




గురువారం 11 జూన్ 2026 | Thursday 11 June 2026 | హైదరాబాద్ | ➩ పేజీలు: 12+12 | ➩ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 71 | Vol.No 28 Issue No .71 | Hyderabad | www.visionandhra.in

## ప్రజాస్వామ్యంలో వరుస విజయాలు అరుదు

- ప్రజానేతగా గుర్తింపు పొందడం కూడా అరుదే
- వరుస విజయాలతో గుర్తింపు పొందిన మోడీ

### అత్యధిక కాలం ప్రధానిగా మోడీ రికార్డు

### నెహ్రూ రికార్డును తిరగరాసిని మోడీ



న్యూఢిల్లీ,జూన్10 :నరేంద్ర మోడీ భారత ప్రధానిగా పగ్గాలు చేపట్టి బుధవారంతో 12 ఏళ్లు పూర్తయ్యాయి. అలాగే అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన అరుదైన రికార్డును కూడా ఆయన సొంతం చేసుకోనున్నారు. ఇప్పటివరకు ఈ రికార్డు నెహ్రూ పేరు మీద ఉంది. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చాక జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచాక 1952 మే 13న ఆయన ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. 1964 మే 27న మరణించేదాకా 4,398 రోజులపాటు నిరంతరాయంగా ఆ పదవిలో కొనసాగారు. కాంగ్రెసేతర పార్టీ తరఫున రెండు సార్లు పూర్తికాలపు ప్రధానిగా పదేళ్లు పనిచేసి రికార్డు సాధించిన మోదీ.. ఎన్నికైన ప్రధానిగా నెహ్రూ రికార్డును అధిగమించనున్నారు.

మిగతా 2లో..

## ఫ్యూచర్ సిటీని రద్దుచేస్తామంటే బండకేసి కొడతారు

- టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీ
- ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అభివృద్ధిని అడ్డుకోవడమే బిజెపి, బిఆర్ఎస్ పని
- కడుపులో విషం పెట్టుకుని కుట్రలు చేస్తున్నారు
- నాలాల కబ్జాలతో హైదరాబాద్ మునిగి పోతోంది
- కబ్జాదారుల కోరలు పీకేందుకే హైడ్రా ఏర్పాటు
- బతుకమ్మకుంటను ఎడ్లకు రాసిచ్చిన కెసిఆర్
- ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థను ప్రారంభించిన సిఎం రేవంత్









హైదరాబాద్,జూన్ 10 : ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని కొందరు మాట్లాడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తు నగరాన్ని రద్దు చేస్తామంటే బండకేసి కొడతారని హెచ్చరించారు. బుధవారం భారత్ ఫ్యూచర్ సిటీలో.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ భవనాన్ని ప్రారంభించారు. అలాగే లోగో, వెబ్‌సైట్‌ను సీఎం ఆవిష్కరించారు. అలాంటి వారికి రాజకీయంగా భవిష్యత్ ఉండదని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్‌ను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. అభివృద్ధి జరగొద్దని కుట్రలు చేస్తున్నారని

మిగతా 2లో..

## ప్రధానిగా 12 ఏళ్ల పదవీకాలం పూర్తి

- మోడీకి అభినందనలు తెలిపిన రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ,జూన్10 : ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మోదీకి అభినందనలు తెలిపారు. మోదీ

మిగతా 2లో..

## ఉత్తర తెలంగాణ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత

- పూడికతీత చేపట్టి నిజాంసాగర్, శ్రీరాంసాగర్ నీటి నిలువ సామర్థ్యం పెంచుతాం
- కాలువ కట్టలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తికి తక్షణ చర్యలు
- మేడిగడ్డ పునరుద్ధరణకు కృషి
- రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి
- జాకోరా, చందూర్ ఎత్తిపోతల పథకాలకు ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి
- సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులు క్షేత్రస్థాయిలో పరిశీలన



నిజామాబాద్, జూన్ 10 ( విజన్ ఆంధ్ర) : ఉత్తర తెలంగాణ జిల్లాలలోని సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కార్ తదితరులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రిజర్వాయర్ కు సంబంధించిన వివరాలతో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ తిలకించారు. 106 కోట్ల రూపాయల వ్యయంతో 7,975 ఎకరాల ఆయకట్టుకు నీరందించే జాకోరా, చందూర్ ఎత్తిపోతల పథకాలను అట్టహాసంగా ప్రారంభించారు. హెలికాప్టర్ లో సిద్దాపూర్ చేరుకున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కర్, నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి, కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర, నిజామాబాద్ అదనపు డీసీపీ శుభం నగ్రాలే, డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్ తదితరులు హెలిప్యాడ్ వద్ద పుష్ప గుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జాకోరాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగానికి, పౌర సరఫరాలకు ఎనలేని ప్రాముఖ్యత ఇస్తోందని గుర్తు చేశారు. భూసేకరణ, అటవీ అనుమతులు, ఆర్ అండ్ ఆర్ తదితర వాటి కోసం ప్రభుత్వం రూ. 5వేల కోట్లు కేటాయిస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందించేలా చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఇందులో భాగంగానే లోయర్ మానేరు, మిడ్ మానేరు డ్యామ్ లు, కడెం ప్రాజెక్టులలో నీటి నిల్వ సామర్థ్యం

మిగతా 2లో..

## దర్శక దిగ్గజం భారతీరాజ కన్నుమూత

- తమిళ చిత్రపరిశ్రమ దిగ్భ్రాంతి



### భారతీరాజా మృతికి సిఎం రేవంత్ సంతాపం



చెన్నై,జూన్10 : తమిళ చలనచిత్ర చరిత్రలో గ్రామీణ కథలకు సరికొత్త దిశను చూపి, వెండితెరపై పల్లెటూరి అందాలను అత్యంత అద్భుతంగా ఆవిష్కరించిన సినీ

మిగతా 2లో..

## పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక

- గిరిజన హక్కుల పరిరక్షణకు చట్టం కీలకం
- పీసా చట్టంపై వర్క్‌షాపు ప్రారంభించిన మంత్రి సీతక్క



హైదరాబాద్,జూన్ 10 : పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక అని మంత్రి సీతక్క అన్నారు. గ్రామసభలను బలోపేతం చేసి గిరిజన హక్కులను

మిగతా 2లో..

## ఘనా పారిశ్రామికాభివృద్ధికి 'తెలంగాణ' మార్గనిర్దేశం

- 'ఫార్మా హబ్' ఏర్పాటుకు పూర్తిస్థాయి సహకారం
- ఘనా ఉన్నత స్థాయి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్,జూన్ 10 :రిపబ్లిక్ ఆఫ్ ఘనా పారిశ్రామికాభివృద్ధికి మార్గనిర్దేశం చేసేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని

మిగతా 2లో..

## ప్రగతి ఫలాలు భారతీయులకు చేరవేసిన ఘనుడు

### ప్రధాని మోడీకి చంద్రబాబు, లోకేశ్ శుభాకాంక్షలు



అమరావతి,జూన్10 : భారత ప్రధానిగా నరేంద్ర మోదీ పగ్గాలు చేపట్టి 12 ఏళ్లు పూర్తయ్యాయి. ఎన్నికైన ప్రధానిగా అత్యధిక కాలం కొనసాగిన అరుదైన రికార్డును సొంతం చేసుకోనున్న మోడీకి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా వేదికగా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కొందరు నాయకులు దేశాన్ని పరిపాలిస్తారని, కొద్దిమంది మాత్రమే దాని గమనాన్ని మారుస్తారని చంద్రబాబు అన్నారు. ప్రధాని మోదీ 4,399 రోజుల నిరంతర పదవీ కాలంతో భారతదేశాన్ని ప్రతి స్థాయిలో పరివర్తన చేశారని కొనియాడారు. ఆయన భారతదేశానికి అత్యధిక కాలం పనిచేసిన ప్రధానమంత్రిగా నిలిచారని, ఇది రికార్డు మాత్రమే కాదని ఆయన వ్యాఖ్యానించారు. నీటి కుళాయి నుంచి చంద్రయాన్ చంద్రుణ్ని చేరడం వరకు, పొలంలో రైతు ఆకాంక్షల నుంచి సరిహద్దులో సైనికుడి ధైర్యం వరకు ప్రతి రంగంలో దేశ విశ్వాసాన్ని, సామర్థ్యాలను బలోపేతం చేశారని చంద్రబాబు తెలిపారు. ప్రగతి ఫలాలు ప్రతి భారతీయుడికి చేరేలా చేశారని,

మిగతా 2లో..

## మీనాక్షి స్థానంలో మహేశ్ కేవత్

- అనూహ్యంగా బిజెపికి కలిసి వచ్చిన అవకాశం
- మీనాక్షిపై కేసు తెలంగాణ నేతలే ఉప్పందించారు
- బిజెపి మంత్రి సంచలన వ్యాఖ్యలు



భోపాల్,జూన్10 : మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో.. బీజేపీ విజయానికి మార్గం సుగమమైంది. ఆ రాష్ట్రంలో మూడో అభ్యర్థిగా మహేశ్ కేవత్‌కు అవకాశం కల్పించిన బీజేపీ.. ఏకగ్రీవంగా విజయం సాధించి మూడు రాజ్యసభ స్థానాల్లోనూ క్లీన్ స్వీప్ చేయడం దాదాపు ఖాయమైంది. మరో ఇద్దరు అభ్యర్థులైన తరుణ్ చుగ్, రజనీశ్ అగర్వాల్‌ల

మిగతా 2లో..

## మెట్రో స్టేషన్ల కింద లీజుకు ఎలా ఇస్తారు

- పాదచారులకు ఇబ్బంది కలిగించడంపై హైకోర్టు ఆగ్రహం



హైదరాబాద్,జూన్ 10 : మెట్రోస్టేషన్ల కింద పాదచారుల కోసం కేటాయించిన ఫుట్‌పాత్ ప్రాంతాల్లో స్టాళ్ల ఏర్పాటుపై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. పాదచారులు నడిచే ప్రాంతాలను లీజుకు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం కీలక

మిగతా 2లో..

## భద్రతా లోపాల వల్లే స్టీల్ ప్లాంట్ ప్రమాదం

- కార్మికులను తగ్గించడంతో పెరిగిన పనిభారం
- బాధిత కుటుంబాలకు జగన్ పరామర్శ
- ప్రభుత్వం నిర్లక్ష్యంపై మండిపాటు



విశాఖపట్టణం,జూన్10 : స్టీల్ ఫ్యాక్టరీలో ఇటీవల జరిగిన ప్రమాదానికి రా మెటీరియల్ లోపాలు, భద్రతా ప్రమాణాలు పాటించక పోవడమే కారణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు.

మిగతా 2లో..



## అమరావతిలో సీజీపీవోఏ ప్రాజెక్టు

### ప్రధాని మోడీకి చంద్రబాబు కృతజ్ఞతలు

అమరావతి,జూన్10 : అమరావతిలో సీజీపీవోఏ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఈ విషయంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

మిగతా 2లో..

## 25 నుంచి సర్ పక్రియ ప్రారంభం

### ఐటిని వినియోగించుకోవాలన్న కమిషనర్

హైదరాబాద్,జూన్ 10 : ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఐటి విరివిగా వాడుకోని ఓటరు నమోదు పక్రియలో పూర్తి పారదర్శకంగా ఎలాంటి తప్పులకు తావివకుండా ఎస్ఐఆర్ పక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ÷ఎధవారం ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా ఐటి వినియోగంపై జిల్లా, మండల స్థాయి మాస్టర్ ట్రైనర్స్, ఐటి సపోర్ట్ టీం, డేటా ఆపరేటర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా

మిగతా 2లో..

## జనసేన పుట్టిందే తెలంగాణ గడ్డమీద

- అక్కడి కి రావద్దంటే..మీ జాగీరా అనడంలో తప్పేముంది
- ఉత్తర,దక్షిణాది విభేదాలు దేశానికి ప్రమాదకరం
- మీడియాతో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



న్యూఢిల్లీ,జూన్ 10 : :జనసేన పార్టీ పెట్టిందే తెలంగాణలో అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో తమ పార్టీకి లీడర్స్ ఉన్నారని.. కేడర్ ఉందని పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీ వేదికగా నేషనల్ మీడియాతో పవన్ కల్యాణ్ మాట్లాడారు. తెలంగాణలో లక్షన్నర మంది సభ్యత్వం జనసేనకు ఉందని ప్రస్తావించారు. వాళ్లు ఉత్సాహంగా ఉన్నప్పుడు.. వారి కోసం పనిచేయొద్దా? అని ప్రశ్నించారు. కర్ణాటక, తమిళనాడులో ఉన్నవారి కోసం ఏమైనా చేయాలి కదా అని చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్ర విభజనకు కాదని.. విభజన జరిగిన తీరుకు తాను వ్యతిరేకమని స్పష్టం చేశారు. తెలంగాణలోకి తనను రావొద్దనడం

మిగతా 2లో..

## ప్రగతి ఫలాలు భారతీయులకు చేరవేసిన ఘనుడు

సంక్షేమం-అభివృద్ధి మధ్య సమతుల్యతను కాపాడారని ప్రశంసించారు. అత్యంత బలహీనులకు మద్దతు అందిస్తూనే అవకాశాలను విస్తరించి, ఆర్థిక పునాదులను బలోపేతం చేసే సంస్కరణలను మోదీ మేళవించారని చెప్పారు. కరుణ, ఆశయం రెండూ కలిసి సాగగలవని ఆయన నిరూపించారని వ్యాఖ్యానించారు. ఈ అద్భుతమైన మైలురాయిని చేరుకున్నందుకు ఏపీ ప్రజల తరఫున ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు అభినందనలు తెలియజేశారు. స్వర్ణాంధ్రను నిర్మించడానికి వికసిత్ భారత్ సాకారం కోసం కట్టుబడి ఉన్నామని సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు. ప్రధానిగా వరుసగా మూడుసార్లు ఎన్నికై, అత్యధిక కాలం దేశాన్ని పాలించిన రికార్డును సాధించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మంత్రి లోకేశ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'మన దేశ తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూను అధిగమించి మోదీ నెలకొల్పిన ఈ రికార్డు అనితరసాధ్యం. 12 ఏళ్ల పాలనలో నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం భారతదేశాన్ని ప్రపంచంలో అజేయశక్తిగా, సగర్వంగా నిలిపింది. ప్రజలకు అవకాశాలు, గౌరవం కల్పించడం, స్వావలంబన, సాధికారత దిశగా దేశాన్ని నడిపించిన మోదీ సమర్థ నాయకత్వానికి జేజేలు' అంటూ ఎక్స్‌లో లోకేశ్ కొనియాడారు.

## అమరావతిలో సీజీపీవోప ప్రాజెక్టు

మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ప్రభుత్వ సంస్థలను మరింత బలోపేతం చేస్తోందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఆయా విభాగాల మధ్య సమన్వయం పెరిగి, ప్రజలకు సేవలు మరింత సమర్థవంతంగా అందుతాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన ప్రోత్సాహకంగా నిలుస్తుందని చెప్పుకొచ్చారు. రాజధాని నగరానికి అవసరమైన పరిపాలనా మౌలిక సదుపాయాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని వివరించారు. కే చోట అనేక కేంద్ర కార్యాలయాలు ఉండటంతో పని తీరులో వేగం, సౌలభ్యం పెరుగుతుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. సుస్థిరమైన, ఆధునిక ప్రభుత్వ భవనాల ఏర్పాటుకు ఇది మరో కీలక మైలురాయి అని అభివర్ణించారు. ఏపీలో ప్రపంచ స్థాయి ప్రజా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం నుంచి అందుతున్న మద్దతుకు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు.

## 25 నుంచి సర్ పక్రియ ప్రారంభం

శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ పక్రియలో ఐటి అంశం అత్యంత కీలకమైనదని, దానిని సిబ్బంది విరివిగా వాడుకొని ఎస్ఐఆర్ పక్రియను వేగవంతం, సమర్థవంతంగా చేపట్టేందుకు దోహదపడుతుందని, అంతేకాకుండా ఓటరు జాబితా రూపొందించడంలో పారదర్శకత ఉంటుందని తెలిపారు. అలాగే ఓటర్లు ఆన్ లైన్ ద్వారా తమ పేరును ఎన్యుమరేషన్ చేసుకోవడానికి లనీబిస.।ఇతి.ఐనీల.తిని వెబ్ సైట్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భారత ఎన్నికల కమిషన్ ఐటికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చే విధంగా తెచ్చిందని, దీంతో ఎస్ఐఆర్ పక్రియ మరింత సులభతరం చేసేందుకు ఇందులో వివిధ టూల్స్ను పొందుపరిచిందని, వీటిని ఉపయోగించడంపై మాస్టర్ ట్రైనర్లు, ఐటి సపోర్ట్ టీమ్ లు క్షేత్రస్థాయిలో డేటా ఆపరేటర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఆన్ లైన్ ద్వారా ఓటర్లను ఎన్యుమరేషన్ చేసుకునేందకు సదుపాయం కల్పించినందున దీనిపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను సిఇఒ ఆదేశించారు. అనంతరం రాష్ట్ర శిక్షణ నోడల్ అధికారి బి. చెన్నయ్య, ఎస్ఐఆర్ పక్రియలోని వివిధ దశలను సవివరంగా వివరించారు.

## ప్రధానిగా 12 ఏళ్ల పదవీకాలం పూర్తి

నాయకత్వంపై దేశ ప్రజలకు ఉన్న అచంచలమైన నమ్మకానికి ఈ మైలురాయి నిదర్శనమని కొనియాడారు. ఆయన పాలనలో దేశం అన్నిరంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన విస్తృతమైన సంక్షేమ కార్యక్రమాలు అట్టడుగు స్థాయి ప్రజలకు కూడా అభివృద్ధి ప్రయోజనాలు సమానంగా అందించేలా చేశాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పీఎం-జన్మన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ లకు తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని ముర్ము వెల్లడించారు. ఆదివాసీల కోసం ఏర్పాటుచేసిన పథకాలు ఇవని తెలిపారు. మోదీ స్ఫూర్తిదాయక ప్రస్థానం భావితరాల్లో భారతదేశపు బలమైన ప్రజాస్వామ్య సంప్రదాయాలపై ఆశను.. నూతన విశ్వాసాన్ని నింపుతుందని రాష్ట్రపతి కొనియాడారు. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ దార్శనికతతో ప్రధాని దేశాన్ని మరింత ముందుకుతీసుకువెళ్తారని విశ్వాసం వ్యక్తంచేశారు.

## దర్శక దిగ్గజం భారతీరాజ కన్నుమూత

దిగ్గజం, 'దర్శక ఇమయం' భారతీరాజా కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో భారతీయ సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే అద్భుత చిత్రాలను అందించి, ప్రేక్షకులను అలరించిన ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటును మిగిల్చింది. 1941 జూలై 17న తమిళనాడులోని తేని జిల్లా అల్లినగరంలో జన్మించిన భారతీరాజా, 1977లో విడుదలైన 16 వయతినిలే' చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేసి అప్పట్లోనే పెద్ద సంచలనం సృష్టించారు. అప్పటివరకు స్టూడియోలకే పరిమితమైన సినిమాలను అవుట్‌డోర్‌కు తీసుకొచ్చి, తమిళ సినిమాల్లో గ్రామీణ జీవన విధానాన్ని , అక్కడి సహజత్వాన్ని కళ్లకు కట్టినట్లు చూపించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అందుకే ఆయనను అభిమానులు, పరిశ్రమ వర్గాలు ఎంతో గౌరవంగా 'దర్శక ఇమయం' అని పిలుచుకుంటారు. ఆయన కెరీర్‌లో సిగప్పు రోజక్కల్, కిజక్కే పోగుం రైల్, అలైగల్ ఓయ్వతి÷-లలై, ముదల్ మరియాద్రై, కరుత్తమ్మ వంటి ఎన్నో క్లాసిక్ చిత్రాలను తెరకెక్కించారు. ఆయన మృతికి సినీ, రాజకీయ పరిశ్రమకు చెందిన పలువురు సంతాపం తెలిపారు. సిఎం విజయ్ నివాళి అర్పించారు. నటుడు, దర్శకుడు పద్మశ్రీ భారతీరాజా మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేసిన భారతీరాజా దర్శకుడిగా, నటుడిగా విశేష ఖ్యాతి గడించారని ముఖ్యమంత్రి గారు గుర్తుచేసుకున్నారు. ఎన్నో వైవిధ్యభరితమైన, సందేశాత్మక చిత్రాలను వివిధ భాషల్లో తెరకెక్కించి భారతీయ చలనచిత్ర రంగానికి విశిష్ట సేవలందించారని పేర్కొన్నారు. భారతీరాజా మరణం చలనచిత్ర రంగానికి తీరని లోటని ముఖ్యమంత్రి అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు

## మెట్రో స్టేషన్ల కింద లీజుకు ఎలా ఇస్తారు

వ్యాఖ్యలు చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరాలు సమర్పించారు. మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల విషయంలో ఇప్పటికే జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అలాగే వీధి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్న జీహెచ్ఎంసీ, మెట్రోస్టేషన్ల కింద ఉన్న వాణిజ్య స్టాళ్ల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో హైకోర్టు ఫుట్‌పాత్ స్థలాన్ని లీజుకు లేదా అద్దెకు ఎలా ఇస్తారని ప్రశ్నించింది. పాదచారుల కోసం ఉద్దేశించిన ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలకు అనుమతి ఇవ్వడం ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తుందని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ అంశంపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యల వివరాలను సమర్పించాలని ఆదేశించింది. ఈ ఫిర్యాదుపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టారో పూర్తి నివేదికను సమర్పించాలని జీహెచ్ఎంసీ, హెచ్ఆర్ఎంఎల్‌లకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

**లీగల్ నోటీస్ / పబ్లిక్ నోటీస్**

ఈ ద్వారా సర్వసాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నేను కుమ్మరి అనసూయ, భర్త : దివంగత కుమ్మరి అంజయ్య, వయస్సు సుమారు 55 సంవత్సరాలు, నివాసం : హౌస్ నెం.1-26, కిష్టారెడ్డిపేట్, అమీన్‌పూర్ మండలం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం. నా భర్త దివంగత కుమ్మరి అంజయ్య గారికి చెందిన నివాస గృహం ఎముతీఅఅస్త్ర చీశీ.1-26, విస్తీర్ణం సుమారు 450 చదరపు గజాలు, కిష్టారెడ్డిపేట్ గ్రామం, అమీన్‌పూర్ మండలం, సంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న ఆస్తికి సంబంధించిన Gift Settlement Deed Document No.2854/1993, తేదీ : 09-09-1993, ఎస్.ఆర్.ఓ సంగారెడ్డి కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయబడిన అసలు పత్రం అనుకోకుండా తప్పిపోయినది.సదరు అసలు డాక్యుమెంట్ 20-01-2026 న గృహ మరమ్మత్తులు మరియు పెయింటింగ్ పనుల సమయంలో కనిపించకుండా పోయినది. ఎంత వెతికినా ఆ పత్రం ఇప్పటివరకు దొరకలేదు. పై డాక్యుమెంట్‌ను ఏ బ్యాంక్, ఫైనాన్షియల్ సంస్థ లేదా వ్యక్తి వద్ద తాకట్టు పెట్టలేదు మరియు ఎటువంటి లావాదేవీలు జరపలేదు.కాబట్టి, ఎవరైనా పై డాక్యుమెంట్‌ను కనుగొన్నా లేదా దాని ఆధారంగా ఏవైనా హక్కులు, లావాదేవీలు లేదా క్లెయిమ్‌లు చేయదలచిన పక్షంలో, ఈ నోటీస్ ప్రచురితమైన తేదీ నుండి 15 రోజుల లోపు క్రింది చిరునామాకు తెలియజేయవలెను. లేని పక్షంలో, ఆ డాక్యుమెంట్ శాశ్వతంగా తప్పిపోయినదిగా పరిగణించి, డూప్లికేట్ పత్రాల కోసం సంబంధిత అధికారులను సంప్రదించబడును.

**డిపోనెంట్ :**
**కుమ్మరి అనసూయ**
**హౌస్ నెం.1-26, కిష్టారెడ్డిపేట్,**
**అమీన్‌పూర్ మండలం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.**

## ఫ్యూచర్ సిటీని రద్దుచేస్తామంటే బండకేసి కొడతారు

ఆగ్రహించారు. ఇప్పుడు ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. శుక్రాచార్యుడు ఫామ్‌హౌస్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు. మారీచుడు, సుభాహు జనంలోకి వచ్చారని సెటైర్లు గుప్పించారు. వీళ్లంతా కలిసి తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. కడుపునిండా విషం నింపుకొని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఏడ్చేవాళ్లు ఏడవండి.. తాము అభివృద్ధి చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నిన్న 2 గంటల వర్షానికే హైదరాబాద్ వరదమయమైందని చెప్పుకొచ్చారు. ఇదేనా మీ పదేళ్ల అభివృద్ధి? అని ప్రశ్నించారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బతుకమ్మ కుంట ఏమైనా ఎడ్ల సుధాకర్ తాత ఆస్తినా అని ప్రశ్నించారు. అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మకుంటను ఎడ్ల సుధాకర్‌కు కేసీఆర్ రాసిచ్చారు. ఆనాటి నాయకులు ప్రభుత్వ భూముల్ని ఆక్రమించారు. అందుకే, హైడ్రాతో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నాం. చెరువులను పునరుద్ధరిస్తున్నాం. లేక్ ఎకానమీ సృష్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచదేశాలను ఇక్కడికి రప్పించాం. డిసెంబర్‌లోనూ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తాం' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కబ్జాకోరులు బాధపడినా పర్వాలేదు.. తమ ప్రయత్నం ఆగదని తేల్చిచెప్పారు. కబ్జాకోరుల కోరలు పీకుతాం.. తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. తెలంగాణకు 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని వ్యాఖ్యానించారు. ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం నిలుస్తుందని పేర్కొన్నారు. టోక్యో, సింగపూర్‌తో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా ఫ్యూచర్ సిటీ అని ఉద్ఘాటించారు. ప్రపంచ దేశాలను ఫ్యూచర్ సిటీకి తీసుకొస్తున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీలో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం మన కోసం మాత్రమే కాదు.. మొత్తం ప్రపంచానికని అన్నారు. 150 రోజుల్లోనే ఈ కార్యాలయ నిర్మాణం పూర్తి చేశామన్నారు. వచ్చే ఎనిమిదేళ్లలో న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తామని చెప్పారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీకి ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరాన్ని విస్తరించడం వల్లే ప్రపంచపటంలో ప్రత్యేక స్థానం లభించింది. బంగారం ధర కంటే రంగారెడ్డి భూముల ధరలే ఎక్కువ. ఆనాటి నిజాంలు, కులీకుతుబ్ షా హైదరాబాద్ నగరాన్ని అనేకసార్లు విస్తరించారు. హైటెక్‌సిటీ, ఓఆర్ఆర్, జీనోమ్ వ్యాలీని అడ్డుకోవాలని చాలా మంది కుట్రలు చేశారు. నగరాన్ని విస్తరించకపోతే 10లక్షల మంది ఐటీ నిపుణులు రాణించేవారా అని అన్నారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారు. బీఆర్ఎస్ రద్దయిన నోటు. ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారు. ఇలాగే ప్రవర్తిస్తే వచ్చేసారి ప్రతిపక్ష హోదా కూడా రాదని హెచ్చరించారు.

## ప్రజాస్వామ్యంలో వరుస విజయాలు అరుదు

రకంగా ప్రధానిగా వరుసగా అత్యధిక కాలం దేశాన్ని పాలించిన రికార్డును నేటితో మోదీ తన ఖాతాలో వేసుకున్నారు. దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూను అధిగమించి ఈ ఘనతను సొంతం చేసుకున్నారు. మోదీ 2014 మే 26న తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి పదవిలో వరుసగా మూడోసారి కొనసాగుతున్నారు. బుధవారం తో ఆయన ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. ఎన్నికైన ప్రధానమంత్రిగా నెహ్రూ 1952 మే 13 నుంచి 1964 మే 27 వరకు వరుసగా 4,398 రోజులు పని చేశారు. ఎన్నికైన తర్వాత వరుసగా అత్యధిక కాలం భారత ప్రధానిగా కొనసాగిన వారి జాబితాలో ఇందిరాగాంధీ మూడో స్థానంలో ఉన్నారు. ఆమె 1966 జనవరి 24 నుంచి 1977 మార్చి 24 వరకు వరుసగా 4,077 రోజులు పదవిలో ఉన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల్లో విజయం సాధించడం, ప్రజానేతగా గుర్తింపు పొందడం అరుదైన విషయం. ఏ పార్టీ అయినా.. ఏ నేత సామర్థ్యానికైనా ఇదే గీటురాయి. అందుకే గెలుపు కోసం రాజకీయ పార్టీలన్నీ నానా తిప్పలు పడుతుంటాయి. రాష్ట్రాల్లో విజయం సాధించటానికే అనేక ధక్కామొక్కీలు తినాలి. ఇక దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించడం ఆషామాషీ విషయం కానే కాదు. దేశ రాజకీయాల్లో రాణించడం, సమర్థ నాయకత్వం-సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఆషామాషీకాదు. ఒక్కసారి ఎలాగోలా గెలిచినా.. వరుసగా రెండోసారి గెలవడం అంత తేలిక కాదు. అలాంటిది వరుసగా మూడోసారి కూడా జయకేతనం ఎగరవేయటం అన్నది కేవలం మోడీకి మాత్రమే సాధ్యమయ్యింది. పుష్కరకాలంగా ప్రధానిగా కొనసాగిన తర్వాత కూడా.. ఇప్పటికీ దేశంలో అత్యంత ఆదరణ ఉన్న నేతగా మోడీ నిలిచారు. కొన్నాళ్ల క్రితమే అత్యధిక కాలం పదవిలో ఉన్న ప్రభుత్వాధినేతగా మోడీ రికార్డు సృష్టించారు. . ఇప్పుడు అత్యధిక కాలం పదవిలో ఉన్న ఎన్నికైన ప్రధానిగా కొత్త రికార్డును తన పేరున లిఖించుకున్నారు. కాంగ్రెసేతర ప్రధానుల రికార్డులన్నీ తన రెండో టర్మ్‌లోనే బద్దలు కొట్టిన మోడీ.. గతేడాది కాంగ్రెస్ ప్రధానుల రికార్డులు బద్దలు కొట్టే పని మొదలు పెట్టారు. మునుపటి ఏడాది ప్రధానిగా ఇందిర రికార్డు బ్రేక్ చేసిన మోడీ.. ఇప్పుడు నవ భారత నిర్మాత నెహ్రూ రికార్డును అధిగమించారు. నరేంద్ర మోదీ 2014 మే లో తొలిసారి, ఆ తర్వాత వరుస విజయాలతో నేరుగా ప్రజామోదం పొందారు. మోదీ సాధించిన ఈ ఘనతకు ఆయన నాయకత్వ పటిమ, దేశవ్యాప్తంగా ఆయనకు ఉన్న తిరుగులేని ప్రజాదరణెళి ప్రధాన కారణంగా చూడాలి. మోడీ హయాంలో దేశం దశాబ్దాల నాటి సంకీర్ణ రాజకీయాల అస్థిరత నుంచి బయటపడి పటిష్టమైన రాజకీయ సుస్థిరత వైపు అడుగులు వేసింది. ఈ సుస్థిరత వల్లే జీఎస్టీ లాంటి క్లిష్టమైన పన్ను సంస్కరణలు, డిజిటల్ ఇండియా విప్లవం, బ్యాంకింగ్ రంగ ప్రక్షాళన వంటి సంచలన నిర్ణయాలు సాధ్యమయ్యాయి. జాతీయ భద్రత విషయంలో రాజీలేని వైఖరిని ప్రదర్శిస్తూ ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు వంటి చరిత్రాత్మక నిర్ణయాలతో దేశ అంతర్గత రాజకీయ స్వరూపాన్ని మోడీ మార్చివేశారు. ఇపుడు ప్రధాన మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నరేంద్ర మోదీ 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి 2014 మే 21 వరకు ఆ పదవిలో కొనసాగారు. జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించే ముందు 13 సంవత్సరాలకు పైగా గుజరాత్ రాష్ట్రానికి నాయకత్వం వహించారు. 2014 మే 26న భారతదేశ 14వ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో లోక్‌సభలో పూర్తి మెజారిటీ సాధించిన తొలి కాంగ్రెసేతర నాయకుడిగా నరేంద్ర మోదీ నిలిచారు. ఆ తర్వాత, రెండు పూర్తి పదవీకాలాలు పూర్తి చేసి, వరుసగా మూడోసారి తిరిగి ప్రధానమంత్రి అయిన తొలి కాంగ్రెసేతర ప్రధానమంత్రిగా కూడా ఆయన చరిత్ర సృష్టించారు. 2014లో ఎన్డీఏ కూటమి ద్వారా కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నరేంద్రమోడీ.. 2019 ఎన్నికల్లో బీజేపీ భారీగా సీట్లు సాధించడంతో సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 2024 ఎన్నికల్లో బీజేపీ మెజారిటీకి అల్లంత దూరంలో ఆగిపోయింది. దీంతో మిత్ర పక్షాల అవసరం పడింది. చంద్రబాబు, నితీష్ కుమార్ సహకారంతో కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వం ఎలా ఏర్పాటైనా.. ప్రభుత్వాధినేతగా మోడీ పేరు కాకుండా మరో ప్రత్యామ్నాయం గురించి ఎవరూ ఆలోచించకపోవడం.. ఆయన నాయకత్వ పటిమకు నిదర్శనంగా చూడాలి. మోడీ నెహ్రూ రికార్డును అధిగమించిన ఈ తరుణంలో.. నాటి నేటి పరిస్థితుల్ని బేరీజు వేస్తే.. చాలా తేడా కనిపిస్తోంది. దేశ జనాభా దగ్గర్నుంచీ రాజకీయ చైతన్యం వరకు ఎంతో మార్పొచ్చింది. అప్పట్లో నెహ్రూ ఎదుర్కున్న సవాళ్లకు.. ఇప్పుడు మోడీ చూస్తున్న సమస్యలకు పొంతనే లేదు. అత్యంత తీవ్రమైన రాజకీయ పోటీ, ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం ఉన్న తరుణంలో మోడీ సమర్థ నేతగా ఎదిగారు. గుజరాత్ సీఎంగా వరుసగా మూడుసార్లు గెలిచారు. 2014లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏను ఓడించి బీజేపీకి స్పష్టమైన మెజారిటీ తెచ్చిపెట్టారు. అభివృద్ధి మంత్రం, హిందుత్వ సాంస్కృతిక జాతీయవాదంతో మోడీ దేశ రాజకీయాలను మార్చేశారు. ప్రస్తుతం మోడీకి కూడా కొన్ని సవాళ్లున్నాయి. రాజకీయ సవాళ్లతో పాటు ప్రధానిగా.. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం తీవ్రంగా ఉంది. పశ్చిమాసియా యుద్ధంతో దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగాయి. దేశంలో రాజకీయ పునరేకీకరణ సాధ్యం చేసిన మోడీ.. ప్రధానిగానూ.. తనకంటే ముందు పని చేసిన వారి వేసిన బాటను మరింత పటిష్ఠం చేసుకుంటూ వస్తున్నారు. ఎలాంటి పరిస్థితులైనా దేశమే ముందు అని చెబుతున్నారు. ముఖ్యంగా విదేశాంగ విధానం, దౌత్యం విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

## జనసేన పుట్టిందే తెలంగాణ గడ్డమీద

తన ప్రాథమిక హక్కుకి భంగం కలిగించినట్లేనని పేర్కొన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఏనాడూ ఇలా మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రాంతీయ విద్వేషాలు మొదలయ్యాయని విమర్శించారు. '13 నెలలుగా నన్ను పర్సనల్‌గా టార్గెట్ చేస్తే.. తెలంగాణ మీ అయ్య జాగీరా అని అనడం తప్పా?' అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఇకపోతే ఉత్తరాది, దక్షిణాది అనే భావన సరికాదని, అలా విభజన రేఖ గీయకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ భావన పెరిగితే దేశానికి ప్రమాదకరమని చెప్పారు. సమస్యలుంటే ఎక్కడైనా వాటిపై మాట్లాడొచ్చన్నారు. సీఎం హోదాలో ఉన్నవారు ఉత్తర, దక్షిణ ప్రాంతాలంటూ మాట్లాడకూడదని హితవు పలికారు. విభజనవాదం దేశానికి మంచిది కాదు. 570కి పైగా సంస్థానాలను కష్టపడి విలీనం చేస్తే దేశం ఇలా ఉంది. నేను హైదరాబాద్ రాకూడదని కొందరు నేతలు అన్నారు. అలా అయితే, రాహుల్ గాంధీకి దక్షిణాదితో సంబంధం లేదని చెప్పాల్సి ఉంటుంది. రాజకీయాలు మారాలని, ప్రాంతీయ వివక్ష, విధ్వంసకర ధోరణి ఉండకూడదని యువత కోరుకుంటోంది. చెప్పే మాటల్లో అర్థం, హేతుబద్ధత ఉండే నాయకులే యువతకు కావాలి. తమ సమస్యలు తెలుసుకొని, పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. తెలంగాణ అభివృద్ధి కావాలని కోరుకుంటున్నా. అక్కడ పోటీ చేయాలని మా పార్టీ నేతలు కోరారు. నేనెప్పుడు, ఎక్కడికి వెళ్లాలో ఇతర వ్యక్తులు చెప్పలేరు.

## ఉత్తర తెలంగాణ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత

పెంపొందించేందుకు పూడికతీత చేపడుతున్నామని తెలిపారు. అదే తరహాలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లా వరప్రదాయిని నిజాంసాగర్, ఉత్తర తెలంగాణ జిల్లాలకు అత్యంత కీలకమైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులలో కూడా పూడికతీత చేపట్టి రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం పెంపొందిస్తామని ప్రకటించారు. కాలువ కట్టలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజి లోపభూయిష్ట నిర్మాణం, డిజైన్ల వల్ల కొన్నాళ్ళకే కూలిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆక్షేపించారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పేరిట లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేశారని, అయినప్పటికీ రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో కట్టిన మేడిగడ్డ బ్యారేజి కొన్ని రోజులకే కూలిపోవడం జరిగిందని, కానీ నిజాం నవాబు నిర్మించిన నిజాంసాగర్, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించబడిన శ్రీరాంసాగర్, నాగార్జున సాగర్, జూరాల ప్రాజెక్టులు మాత్రం ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఎంతో గట్టిగా నిలబడి ఉన్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ అన్నారు. కాగా, సిద్దాపూర్ రిజర్వాయర్ పనుల పూర్తి కోసం సవరించిన ప్రతిపాదనల మేరకు అవసరమైన నిధులను తప్పక కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రైతాంగ ప్రయోజనాలు కాపాడడమే పరమావధిగా తమ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని తెలిపారు. దేశంలోనే మరెక్కడా లేని విధంగా తెలంగాణలో ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లు కలుపుకుని 295 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. అందులో ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాల ద్వారా 145 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, 48గంటల లోపే రైతుల

## పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక

కాపాడాలన్నారు. గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు పీసా చట్టం కీలకమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లో పీసా చట్టం అమలుపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించి... ప్రసంగించారు. పీసా చట్టంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పూర్తి అవగాహన అవసరమని తెలిపారు. పీసా కేవలం చట్టం కాదని.. ఆదివాసీల స్వయం నిర్ణయాధికారానికి రక్షణ కవచమని వెల్లడించారు. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని.. గ్రామసభలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని మంత్రి తెలిపారు. సహజ వనరులపై గ్రామసభల నిర్ణయాధికారాన్ని పీసా చట్టం కల్పించిందన్నారు. చట్టం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి కార్పొరేట్ల చేతుల్లోకి సహజ వనరులు వెళ్లకూడదన్నారు. పీసా చట్ట స్ఫూర్తిని అర్థం చేసుకుని అమలు చేసినప్పుడే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సర్పంచులు గ్రామాభివృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి గ్రామసభల బలోపేతంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. గిరిజన హక్కుల పరిరక్షణ తనకు ప్రత్యేక బాధ్యతగా చెప్పుకొచ్చారు. ఉన్నవారి కోసం కాదు.. లేని వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ అని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇంకా ప్రాథమిక సదుపాయాల కొరత ఉందని సీతక్క వెల్లడించారు. గుట్టలు కరిగిపోతున్నాయని.. సహజ వనరులు క్షీణిస్తున్నాయన్నారు.

ఖాతాలలో బిల్లులు జమ చేస్తూ రూ. 35 వేల కోట్లు చెల్లించామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో సైతం రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి భరోసా కల్పించారు. నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని 5లక్షల కుటుంబాలలోని 3.25 కోట్ల మందికి ఒక్కొక్కరికి ప్రతి నెల ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తు చేశారు. ప్రభుత్వ సలహాదారు, స్థానిక శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొట్టమొదటగా తన నియోజకవర్గంలో జాకోరా, చందూర్ ఎత్తిపోతల పోతకాలను ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణంలో బాన్సువాడ నియోజకవర్గ రైతులు పంటలు సాగు చేస్తూ, అధిక దిగుబడులు సాధిస్తున్నారని అన్నారు. మొత్తం లక్షా 48 వేల ఎకరాలలో పంటలు పండిస్తున్నారని, 95వేల ఎకరాల ఆయకట్టుకు నిజాంసాగర్ నీరు సమకూరుతోందని తెలిపారు. 30 వేల ఎకరాలకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు జలాలు అందిస్తున్నామని, నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో లేని మిగతా భూములకు కూడా సాగు జలాలు అందించాలనే కృత నిశ్చయంతో సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టామని అన్నారు. ఈ రిజర్వాయర్ పూర్తయితే నియోజకవర్గంలో సాగు నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సిద్దాపూర్ రిజర్వాయర్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్ రావు, ఇంజినీర్ ఇన్ చీఫ్ శ్రీనివాస్, సీ.ఈ శ్రీదేవి, బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, తహసిల్దార్ ప్రశాంత్, సర్పంచ్ సాయిలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## మీనాక్షి స్థానంలో మహేశ్ కేవత్

ఎన్నికను ఖరారు చేసేందుకు ఆ పార్టీకి శాసనసభలో తగినంత మద్దతు ఉంది. దీంతో రాష్ట్ర రాజ్యసభ ఎన్నికల్లో అధికార పార్టీ సంపూర్ణ విజయాన్ని కైవసం చేసుకోనుంది. ఈ నేపథ్యంలో మహేశ్ కేవత్ రాజకీయ నేపథ్యం ఏమిటో ఓసారి పరిశీలిస్తే.. ఆయనో సీనియర్ బీజేపీ నేత. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌తో పాటు బీజేపీ సంస్థాగత నెట్‌వర్క్‌తో ఆయనకు సుదీర్ఘ అనుబంధం ఉంది. చిన్నప్పటి నుంచే ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం కలిగి ఉన్న కేవత్.. అఖిల్ భారతీయ విద్యార్థి పరిషత్ , బీజేపీ యువజన విభాగంలో పలు బాధ్యతలు నిర్వర్తించారు. జిల్లా మంత్రిగానే కాకుండా సంఘ్ పరివార్‌లోనూ వివిధ హోదాల్లో పనిచేశారు. అంతేకాకుండా.. రాష్ట్ర మత్స్యకారుల సంక్షేమ బోర్డు ఛైర్మన్‌గానూ సేవలందించారు. ఆ రాష్ట్ర సీఎం మోహన్ యాదవ్, కేవత్ సామాజిక నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ.. హిందూ పురాణాలలో పూజ్య పురుషుడైన నిషాద్ రాజ్ వారసత్వ కొనసాగింపునకు ఆయన నామినేషన్ నిదర్శనమని పేర్కొన్నారు. నటరాజన్ నామినేషన్ పత్రాలలో అనేక లోపాలున్నాయని, కొన్ని వివరాలను ఆమె దాచిపెట్టారని బీజేపీ ఆరోపించింది. తెలంగాణలోని ఓ కోర్టులో ఆమెపై ఉన్న పెండింగ్ కేసు విషయాన్ని వెల్లడించలేదనేది ఆ పార్టీ లేవనెత్తిన కీలక అభ్యంతరాలలో ఒకటి. పరిశీలన పక్రియలో ఎన్నికల అధికారులు అభ్యంతరాలను స్వీకరించడంతో ఆమె నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో రాజ్యసభ పోటీలో కాంగ్రెస్ సవాలుకు దాదాపుగా తెరపడినట్టు సమాచారం. అయితే కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై మధ్యప్రదేశ్ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు కైలాష్ విజయ్ వర్గియా సంచలన వ్యాఖ్యలు చేశారు. మీనాక్షీనటరాజన్ మీద తెలంగాణలో కేసుల గురించి టీ కాంగ్రెస్ నేతలే తమకు సమాచారం ఇచ్చారని బాంబు పేల్చారు. ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. 'అసలు మీనాక్షీనటరాజన్ మీద తెలంగాణలో కేసు నమోదైనట్టు మాకు తెలియనే తెలియదు. తెలంగాణ కాంగ్రెస్ నుంచే ఆ సమాచారం మాకు వచ్చింది. అక్కడి కాంగ్రెస్ పార్టీ నేతలే మాకు ఈ సమాచారం ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది. అక్కడి నుంచే మాకు ఈ కేసు పత్రాలొచ్చాయి. దీనిని బట్టి కాంగ్రెస్‌లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోండి' అని వ్యాఖ్యానించారు. మొత్తంగా కైలాష్ విజయ్ వర్గియా వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో పెను ప్రకంపనలకు దారితీశాయి. మీనాక్షికి, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా, బీజేపీకి అనుకూలంగా కొందరు టీ కాంగ్రెస్ నేతలు కోవర్ట్ రాజకీయాలు నడుపుతున్నారని ఇప్పటికే కొన్ని వార్తలొచ్చాయి. కైలాష్ వర్గియా వ్యాఖ్యలు ఇందుకు మరింత బలాన్ని చేకూర్చాయని పలువురు కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడుతున్నారు.

## ఘనా పారిశ్రామికాభివృద్ధికి 'తెలంగాణ' మార్గనిర్దేశం

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అక్కడ ఏర్పాటు చేయనున్న 'ఫార్మా హబ్'కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ దేశ ప్రెసిడెన్షియల్ అడ్వైజర్ ఆగస్టస్ ఒబువాడుం టానో నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం సచివాలయంలో బుధవారం మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా 'తెలంగాణ-ఘనా' మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఘనా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 24 అవర్ ఎకానమీ అండ్ యాక్సలరేటెడ్ ఎక్స్ పోర్ట్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం, ఫార్మా హబ్ ఏర్పాటు తదితర అంశాలను ఆగస్టస్ ఒబువాడుం టానో వివరించారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఆనతికాలంలోనే పారిశ్రామికరంగంలో తెలంగాణ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగిందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ పాలసీ'లను ఆయన వివరించారు. ఫార్మాస్యూటికల్ మ్యానుఫ్యాక్చరింగ్, రీసెర్చ్, వ్యాక్సీన్ల తయారీ, గ్లోబల్ సప్లై చైన్ నిర్వహణ, లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణకున్న అంతర్జాతీయ నైపుణ్యాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఘనా ప్రతినిధులకు చెప్పారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనలో తెలంగాణ ఒక నమ్మకైన భాగస్వామిగా ఉంటుందని భరోసానిచ్చారు.

## భద్రతా లోపాల వల్లే స్టీల్ ప్లాంట్ ప్రమాదం

**విశాఖను సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. లిక్విడ్ స్టీల్ బ్లాస్ట్ కావడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. 14 నెలల క్రితం స్టీల్ ఎ÷-లాంట్‌లో ప్రాణాలు కోల్పోయిన మాస్టర్ టెక్నీషియన్ పెంటయ్య కుటుంబానికి ఇప్పటికీ పరిహారం అందలేదని జగన్ ఆరోపించారు. పరిహారం గురించి అడిగితే ఫైలు పోయిందని సమాధానం ఇచ్చారని విమర్శించారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ప్రమాదం నేపథ్యంలో జగన్‌మోహన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నించిన ఆయన, బాధిత కుటుంబాలకు తక్షణమే కోటి రూపాయల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని జగన్ గుర్తుచేశారు. ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్రానికి రెండు లేఖలు కూడా రాశామని అన్నారు. ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు, కార్మికుల పక్షాన నిలిచింది వైసీపీ ప్రభుత్వమేనని ఆయన పేర్కొన్నారు. విశాఖలో జరిగిన బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కూడా ఈ అంశంపై గట్టిగా కోరినట్లు వెల్లడించారు. స్టీల్ ప్లాంట్‌లో గత రెండేళ్లలో ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గిపోయిందని జగన్ ఆరోపించారు. ఒకప్పుడు 28 వేల మంది ఉద్యోగులు ఉండగా, ప్రస్తుతం సుమారు 10,500 మందిని తొలగించారని చెప్పారు. ప్రస్తుతం కాంట్రాక్ట్, రెగ్యులర్ కార్మికులు మాత్రమే మిగిలి ఉన్నారని పేర్కొన్నారు. స్టీల్ ఎ÷-లాంట్‌కు రూ.11,440 కోట్ల ప్యాకేజీ ఇచ్చామని కూటమి ప్రభుత్వ నేతలు చెబుతున్నారని, అయితే ఆ నిధులను స్వచ్ఛంద పదవీ విరమణ (÷ఎఖా), బ్యాంకు రుణాల చెల్లింపులకే వినియోగించారని విమర్శించారు. ప్లాంట్ నిర్వహణ, భద్రతా చర్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఎల్జీ పాలిమర్స్ ప్రమాద బాధితులకు తమ ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం ఇచ్చిందని గుర్తు చేసిన జగన్, అదే తరహాలో స్టీల్ ఎ÷-లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలకు కూడా ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.**

# సంపాదకీయం

## 370 రద్దుతో ..నెహ్రూ రికార్డును అధిగమించిన మోడీ !

భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే మున్నెన్నడూ చూడని ఒక అరుదైన మైలురాయి ఆవిష్కృతం అయ్యింది. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ పేరిట ఏడు దశాబ్దాలుగా చెక్కుచెదరకుండా ఉన్న అత్యధిక కాలం ఎన్నికైన ప్రధాని రికార్డును ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోడీ బద్దలు కొట్టారు. ఇక ప్రధానిగా మోడీ సాధించిన విజయాలు అనేకం ఉన్నాయి. ఇవన్నీ కూడా భారతదేశ చరిత్ర గతిని తిప్పేవని చెప్పుకోక తప్పదు. ప్రధానంగా నెహ్రూ 370 ఆర్టికల్ పెట్టి కశ్మీర్‌ను ఇండియాకు దూరం చేస్తే..అదే 370ని రద్దు చేయడం ద్వారా ప్రధాని మోడీ చారిత్రక నిర్ణయం తీసుకుని, కాశ్మీర్‌ను భారత్‌లో సంపూర్ణంగా విలీనం చేశారు. అలాగే కాశ్మీర్ ఇప్పుడు సంపూర్ణంగా విలీనం కావడంతో పాటు, అక్కడ వేర్పాటువాద, ఉగ్రవాద మూకలను క్రూకటి వేళ్లతో పెరివేశారు. మోడీ ధృఢ సంకాల్పినికి...చరిత్రాత్మక నిర్ణయానికి ఇది నిదర్శనంగా చూడాలి. పటేల్ తరహాలో దేశంలో ఐక్యత సాధించే యత్నాలను నేటికీ మోడీ కొనసాగించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. 2014 మే 26న ప్రమాణ స్వీకారం చేసిన మోడీ.. వరుసగా మూడు సార్లు అధికారంలోకి వచ్చి, సందిగ్ధ రాజకీయ పరిస్థితులను దాటుకుంటూ సగర్వంగా 4,399 రోజులు పూర్తి చేసుకోవడం చిన్న విషయం కాదు. తద్వారా దేశ రాజకీయాల్లో ఒకే ఒక్కడుగా కొత్త చరిత్ర సృష్టించారు. ఈ క్రమంలో భారత రాజకీయాల్లో జూన్ 10, 2026 ఒక సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా నిలిచిపోనుంది. ఆ రోజుతో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ చరిత్రలోనే అత్యధిక కాలం సేవలు అందించిన నేరుగా ప్రజలు ఎన్నుకున్న ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించారు. స్వతంత్ర భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న 12 ఏళ్ల 14 రోజుల రికార్డును ప్రధాని మోడీ అధిగమించారు. అంతేగాకుండా అందరికీ దూరంగా,అంటరాని పార్టీగా ఉన్న బిజెపిని ప్రజల్లోకి తీసుకెళ్లిన ఘనత కూడా మోడీదని చెప్పాలి. అందుకు ఆయనకు కుడిభుజంగా పనిచేస్తున్న అమిత్ షా వ్యూహాలను కూడా తక్కువ చేయలేం. ఈ ఇద్దరి జంట దేశంలో భారతీయ జనతాపార్టీ పునాదులను బలోపేతం చేసిందనడంలో సందేహం లేదు. ఇక మోడీ తీసుకున్న నిర్ణయాల్లో మరోటి అయోధ్య సమస్యకు చెక్ పెట్టడం. రావణ కాష్టంలా ఉన్న అయోధ్య సమస్యను సుప్రీం కోర్టు ముందుంచి పరిష్కరించగలగడం చారిత్రాత్మక విజయంగా చూడాలి. కోటానుకోట్ల హిందువుల గుండెల్లో ఇది చిరస్మరణీయ నిర్ణయంగా నిలిచిపోయింది. ట్రిపుల్ తల్లాక్ వంటి అనాగరిక చట్టాలను కూడా రద్దు చేయడం ద్వారా ముస్లిం మహిళలకు అండగా నిలబడ్డారు. ప్రధానంగా ఉమ్మడి పౌరస్మృతి కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తే.. భారత్‌లో విభజన రాజకీయాలకు చెక్ పడనుంది. అలాగే మహిళా బిల్లును గట్టెక్కించే ప్రయత్నంలో ఓ అడుగు పడింది. అంతేకాకుండా అంతర్జాతీయంగా యోగా దినోత్సవాన్ని జూన్ 21న నిర్వహించేలా ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానం మోడీ ప్రతిభకు నిదర్శనంగా చూడాలి. అలాగే అనేక దేశాల్లో పర్యటించి భారత్ ప్రతిభను చాటడమే గాకుండా ఆయా దేశాలతో సంబంధ బాధంవ్యాలను బలోపేతం చేయడంలో అద్భుత విజయం సాధించారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రధానిగా జవహార్‌లాల్ నెహ్రూ దేశంపై తనదైన ముద్ర వేశారు. ఆయన కూడా అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. తొలి ప్రధానిగా నెహ్రూపై దేశ పునర్నిర్మాణ బాధ్యత లు పడ్డాయి. అదే స్వతంత్ర భారతాన్ని పటిష్ఠమైన పునాదులతో పదిలంగా నిర్మించడం.. అంతేకాదు పేదరికంలో మగ్గిపోతున్న, శతాబ్దాల బానిసత్వంతో ఆత్మవిశ్వాసం కోల్పోయిన జాతిని సగర్వంగా తలెత్తుకు నిలిపేలా చేయడం. ఇవి మరే ప్రధానికీ ఎప్పుడూ ఎదురుకాని కఠిన సవాళ్లు అనడంలో సందేహం లేదు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్ని సమర్థంగా నిభాయించిన నెహ్రూ.. దేశంపై చెరిగిపోలేని ముద్ర వేశారు. అందుకు ఆనాటి ఉప ప్రధాని పటేల్ చేదోడువాదోడుగా నిలిచారు. సంస్థానాలను విలీనం చేసి దేశాన్ని ఐక్యంగా నిలబెట్టారు. అంతకుముందు స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన నెహ్రూ.. ఆ తర్వాత స్వతంత్ర భారత తొలి ప్రధానిగా.. అటు స్వయంత్ర సమరయోధుల ఆశయ సాధనకు, ఇటు దేశ ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట వేస్తూ.. పాలన సాగించారనడంలో సందేహం లేదు. అయితే పదవీకాలం ప్రకారం ఇన్నాళ్లుగా చెక్కుచెదరని చారిత్రక రికార్డు నెహ్రూ పేరిట ఉండగా ప్రధాని మోడీ ఇప్పుడు దానిని అధిగమించారు. ప్రజాస్వామ్య ఎన్నికల్లో నెహ్రూ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రజాప్రతినిధిగా ఎన్నికై దేశానికి ప్రధాన మంత్రిగా ప్రాతినిధ్యం వహించారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత నుంచి ఇప్పటిదాకా 15 మంది ప్రధాన మంత్రులు గా ప్రాతినిధ్యం వహించారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో బీజేపీ తరఫున నరేంద్రమోడీ సుదీర్ఘకాలం పనిచేసిన ప్రధానమంత్రిగా అరుదైన రికార్డును కొన్నేళ్ల క్రితమే సొంతం చేసుకున్నారు. ఇప్పుడు నెహ్రూ రికార్డును అధిగమించారు. అలాగే కోట్లాది మంది భారతీయులకు ఆరాధ్యనేతగా ఎదిగారు. ఇది ఆషామాషీ విషయం కాదు. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించడం మామూలు విషయం కాదు. ఇది దేశ చరిత్రలోనే ఓ అరుదైన మైలురాయిగా నిలిచిపోనుంది. 2014లో ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన నరేంద్రమోడీ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు ఆయనను ప్రజలకు చేరువ చేస్తున్నాయి. 370 రద్దు, ట్రిపుల తలాక్ రద్దు, అయోధ్య, మహిళా బిల్లు వంటివన్నీ మోడీకి జననీరాజనం పట్టేలా చేసినవే. దేశంలో రాష్ట్రప్రభుత్వ అధినేతగా.. దేశాధినేతగా నరేంద్రమోడీది ఎవరికీ సాధ్యంకాని రికార్డు నెలకొల్పారు. గుజరాత్ ముఖ్యమంత్రి గా నరేంద్ర మోడీ దేశానికి రోల్ మోడల్ అయ్యారు. అలాగే ముఖ్యమంత్రి మంత్రి పదవికి రాజీనామా చేసి దేశానికి ప్రధాన మంత్రి అయ్యారు. సమర్థ నాయకత్వం..సుస్థిర పాలనతో భారత రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక మైలురాయిని సాధించారు.

# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత
## మున్సిపల్ కమిషనర్ వినోద్ బాబు



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 10 (విజన్ ఆంధ్ర)మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 9 10 వార్డులలో ప్రజా పలన ప్రగతి పాలన సభ నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని వారు తెలిపారు . వానాకాలం సమయం ఆసన్నమైనది ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తడి చెత్త పొడి చెత్త వేరు వేరు డబ్బాలలో వేయాలని తెలిపారు.కాలువలు శుభ్రం చేయాలని ఇంటి పరిసర ప్రాంతాలలో ఎలాంటి అపరిశుభ్రత ఉండకుండా నీరు బయటికి వెళ్లే విధంగా ఉండాలని వారు తెలిపారు. నీరు బయటికి వెళ్ళని ఇంటి వద్ద ఇంకుడు గుంతలు తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో పోలీసు వారు పాల్గొని గంజాయి సేవించేవారు అయినా గంజాయి అమ్మేవారైనా దొరుకుతే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని వారి పేరు చెప్పిన వారికి ఐదు వేల పారితోషకం ఇస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జ్యోతి రమేష్ వార్డు ఆఫీసర్ నవీన్ వార్డు కౌన్సిలర్ బానోత్ పద్మ కందుకూరి సుధా మోహన్ మున్సిపల్ సిబ్బంది 9 ,10 వార్డుల ప్రజలు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# జీఎస్టీ కొత్త మార్గదర్శకాలతో ఇబ్బందులు
## –ఇస్యా సెంటర్ అధ్యయనంలో వెల్లడి



హైదరాబాద్, జూన్ 10 (విజన్ ఆంధ్ర) : సబ్స్క్రిప్షన్ ఆధారిత రైడ్–హెయిలింగ్ ప్లాట్‌ఫారమ్‌లపై సీజీఎస్టీ చట్టంలోని సెక్షన్ 9(5) కింద జీఎస్టీ విధించడం వల్ల డ్రైవర్ల ఆదాయం తగ్గడం, ప్రయాణికులపై అదనపు భారం పడడం, భద్రతా ప్రమాణాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఇస్యా సెంటర్ విడుదల చేసిన అధ్యయనంలో తేలిందని ఇస్యా సెంటర్ డైరెక్టర్ మేఘనా బాల్ బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈవై ట్యాక్స్ పార్ట్నర్ జయశ్రీ పార్థసారథి తోకలసి ఆయన మాట్లాడుతూ డిజిటల్ మొబిలిటీ రంగంలో కొత్త వ్యాపార నమూనాలకు అనుగుణంగా పన్ను విధానాలను పునః సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. సెక్షన్ 9(5) కింద జీఎస్టీని ప్లాట్‌ఫారమ్‌లు రైడ్ ధరలను నిర్ణయించే లేదా చెల్లింపులను నియంత్రించే సందర్భాల్లో మాత్రమే వర్తింపజేయాలని కోరారు. అలాగే భద్రత, వెరిఫికేషన్, పర్యవేక్షణ వంటి విధులను పన్ను ప్రయోజనాల కోసం లావాదేవీల నియంత్రణగా పరిగణించరాదని సూచించారు.

# సామిల్, టింబర్ డిపో అసోసియేషన్ నూతన కమిటీ



సూర్యాపేట జూన్ 10:(విజన్ ఆంధ్ర) ది సూర్యాపేట జిల్లా సామిల్, టింబర్ డిపో అసోసియేషన్ నూతన కమిటీని రాష్ట్ర నాయకులు గొల్లపల్లి అనిల్, గుడిపాటి కిరణ్ ఆధ్వర్యంలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తౌడోజ్ సలేంద్ర చారి, ప్రధాన కార్యదర్శిగా నరసింహ చారి, జిల్లా కోశాధికారిగా బైరోజ్ ఉపేంద్ర చారి ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. టింబర్, సామిల్ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పనిచేస్తామని, సభ్యుల హక్కుల పరిరక్షణకు ఎల్లప్పుడూ ముందుంటామని పేర్కొన్నారు.సంఘం బలోపేతానికి ప్రతి సభ్యుడి సహకారం అవసరమని, ప్రభుత్వ దృష్టికి రంగ సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో పర్వతం నాగచారి, ఉపేంద్ర చారి, కల్లూరి మురళీకృష్ణ, లింగయ్య, కల్లూరి వేణు, బాలకృష్ణ, శంకర్, శివ, కృష్ణ ఉపేంద్ర చారి, పమ్మి నాగ, ఉపేంద్ర చారి, రవీంద్ర చారి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి



సూర్యాపేట, జూన్ 10 (విజన్ ఆంధ్ర)భూగర్భ జలాల పరిరక్షణ కోసం ప్రతి ఇంట్లో ఒక ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విద్యానగర్ 46 వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పలు పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. ఉచిత గ్యాస్, సన్నబియ్యం, ఉచిత విద్యుత్ తో పాటు అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, 46వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ దంతాల సాయి నవీన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు
## –జిల్లా కలెక్టర్ కె.హరిత



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 10, విజన్ ఆంధ్రప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని 27వ వార్డులో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఏర్పాటుచేసిన వార్డు సభకు మున్సిపల్ కమిషనర్ తిరుపతి, చైర్ పర్సన్ షహీన్ సుల్తానా తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేదవారికి సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, ప్లాస్టిక్ సంచులు, బాటిళ్లను చెత్త కుండీలలో మాత్రమే వేయాలని తెలిపారు. చెత్త చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి వర్షాకాలంలో మురికి కాలువలలో నీటిని అడ్డుకుని ఇండ్లలోకి చేరి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని, ఈ విషయంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని తెలిపారు. అనంతరం పురపాలక సంఘం చైర్మన్, కౌన్సిలర్లతో కలిసి రెండు పడక గదుల ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

# దేశ చరిత్రలో మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం కొత్త దిశ నిర్దేశించింది
## – మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో). జూన్ 10:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా, వారిని ఆర్టీసీ బస్సుల యజమానులుగా తీర్చిదిద్దిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని మంత్రి పేర్కొన్నారు. మహిళా శక్తి పథకం కింద మండల మహిళా సమాఖ్యలు తమ సొంత నిధులైన రూ. 199.08 కోట్ల పెట్టుబడితో 553 ం+ూ=జ బస్సులను కొనుగోలు చేసి సంస్థకు అద్దెకు ఇవ్వడం మహిళల ఆర్థిక స్వావలంబనకు, సమిష్టి శక్తికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఒకప్పుడు రుణాల కోసం ఎదురుచూసిన స్వయం సహాయక సంఘాల మహిళలు నేడు ఆస్తుల యజమానులుగా, పెట్టుబడిదారులుగా ఎదగడం తెలంగాణ ప్రభుత్వ మహిళా సాధికారత విధానాలకు నిదర్శనమని మంత్రి తెలిపారు. ఒక్కో బస్సుకు నెలకు రూ. 69,468 అద్దె లభిస్తుండగా, మొత్తం 553 బస్సుల ద్వారా ప్రతి నెల రూ. 3.84 కోట్ల ఆదాయం మహిళా సమాఖ్యలకు అందుతోందన్నారు. ఇప్పటివరకు రూ. 20.34 కోట్ల అద్దె ఆదాయం మహిళా సంఘాలకు చేరడం ఈ పథకం విజయాన్ని స్పష్టంగా చాటుతోందని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు కేవలం లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములు, ఆస్తుల యజమానులు, ఆదాయ సృష్టికర్తలుగా మారుతున్నారని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కూడా ఈ పథకం ఎంతో దోహదపడుతోందన్నారు. అదేవిధంగా మహాలక్ష్మి పథకం విజయవంతమైన అమలులో ఈ బస్సులు కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఇప్పటివరకు 315 కోట్లకు పైగా మహిళా ప్రయాణికులు లబ్ధి పొందారని చెప్పారు. ఈ పథకం ద్వారా మహిళలు సుమారు రూ. 10,950 కోట్ల ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకోగలిగారని పేర్కొన్నారు. మహిళలు ఆదా చేసుకున్న ఈ మొత్తాన్ని కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, ఆరోగ్యం, స్వయం ఉపాధి మరియు చిన్న వ్యాపారాల కోసం వినియోగిస్తున్నారని మంత్రి వివరించారు. మహిళల చేతిలో మిగిలే ప్రతి రూపాయి కుటుంబ అభివృద్ధికి, సమాజ పురోగతికి దోహదపడుతుందని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మహిళా సమాఖ్యలకు మొత్తం 61 బస్సులు కేటాయించబడినట్లు మంత్రి తెలిపారు. ఇందులో కరీంనగర్ జిల్లాకు 16, రాజన్న సిరిసిల్ల జిల్లాకు 12, పెద్దపల్లి జిల్లాకు 15, జగిత్యాల జిల్లాకు 18 బస్సులు కేటాయించామని చెప్పారు. దీంతో ఆయా జిల్లాల్లో బస్సుల కొరత తగ్గి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందడంతో పాటు మహిళా సంఘాలు స్థిరమైన ఆదాయ వనరును పొందనున్నాయని మంత్రి పేర్కొన్నారు. మహిళలను లబ్ధిదారుల నుంచి యజమానులుగా, భాగస్వాములుగా తీర్చిదిద్దడం తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం. మహిళా శక్తి పథకం ఆ దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే విప్లవాత్మక కార్యక్రమం అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

# చట్టబద్ధంగా మాత్రమే దత్తత తీసుకోవాలి
## –జిల్లా కలెక్టర్ శ్రీమతి కె. హరిత



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 10 విజన్ ఆంధ్రపిల్లలు లేని దంపతులు ఎవరైనా పిల్లలను దత్తత తీసుకోవాలనుకుంటే తప్పనిసరిగా కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ (జూా=ూ) మార్గదర్శకాల ప్రకారం చట్టబద్ధమైన విధానంలోనే దత్తత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. చట్టబద్ధ ప్రక్రియలను పాటించకుండా మధ్యవర్తుల ద్వారా లేదా అనధికారికంగా దత్తత తీసుకోవడం చట్టరీత్యా నేరమని, అటువంటి చర్యల వల్ల భవిష్యత్తులో పిల్లలు మరియు కుటుంబ సభ్యులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని ఆమె హెచ్చరించారు. ఈ రోజు మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం (ఐజూఖ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాగజ్‌నగర్ మండలం చింతగూడ గ్రామానికి చెందిన దుర్గం లింగయ్య ' రేణుక దంపతులకు చట్టబద్ధమైన =వశ్రీఖ–అజవ ూాఃశీజ్‌అశీఅ ప్రక్రియ పూర్తయిన అనంతరం అడాప్షన్ ఆర్డర్ ప్రతిని జిల్లా కలెక్టర్ అధికారికంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి స్వరూపారాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి (ఐజూఖ) మహేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి సురక్షితమైన కుటుంబ వాతావరణంలో పెరిగే హక్కు ఉందని పేర్కొన్నారు. దత్తత ప్రక్రియ ద్వారా పిల్లలకు ప్రేమ, భద్రత, విద్య మరియు మంచి భవిష్యత్తు కల్పించే అవకాశం ఉంటుందని అన్నారు. దత్తత ప్రక్రియలో పారదర్శకత, చట్టబద్ధత మరియు పిల్లల సంక్షేమం ప్రధాన లక్ష్యాలని, అందువల్ల ప్రభుత్వం నిర్దేశించిన విధానాలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. అలాగే, చట్టబద్ధమైన దత్తత ద్వారా పిల్లల హక్కులు పూర్తిస్థాయిలో పరిరక్షించబడతాయని, వారసత్వ హక్కులు, గుర్తింపు, విద్య మరియు ఇతర సంక్షేమ ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అనధికారికంగా లేదా మధ్యవర్తుల ద్వారా జరిగే దత్తతలు పిల్లల అక్రమ రవాణా, దుర్వినియోగం వంటి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. దత్తత తీసుకోవాలనుకునే దంపతులు లేదా బంధువులు మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని జిల్లా బాలల సంరక్షణ విభాగాన్ని సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత అధికారులు దత్తతకు సంబంధించిన నిబంధనలు, అవసరమైన పత్రాలు మరియు చట్టబద్ధ ప్రక్రియలపై పూర్తి సమాచారం అందించి, దత్తత ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా సహకరిస్తారని తెలిపారు. జిల్లాలో పిల్లల హక్కుల పరిరక్షణ, బాలల సంక్షేమం మరియు సురక్షిత బాల్య నిర్మాణం కోసం జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని, ప్రజలు కూడా చట్టబద్ధమైన విధానాలను అనుసరించి ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి స్వరూపారాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్, ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది మరియు సంబంధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత తెలంగాణ మన అందరి ధ్యేయం అవగాహన సదస్సు
## పిల్లలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే, అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు.




నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జూన్ 10 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినటువంటి " లి99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఖూూ గారి ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ జిల్లా అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో సాయి గార్డెన్ నందు డ్రగ్స్ రహిత తెలంగాణ మన అందరి ధ్యేయంనాగర్ కర్నూల్ జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిల్లలను సంరక్షించుకునేటువంటి బాధ్యత ప్రధానంగా తల్లిదండ్రుల పైన ఉంటుందని ఆయన అన్నారు. చిన్న వయసులో యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితమంతా తమ చేతులారా తామే నాశనం చేసుకున్నట్టు అవుతుందని ఆయన అన్నారు. , పిల్లల భద్రత డ్రగ్స్ కి అడ్డుకట్ట అనే విషయం మీద ఈ డ్రగ్స్ రహిత కార్యక్రమం జరిగింది , ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ అడిషనల్ ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు పిల్లలకు డ్రక్స్ బారిన పడకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రులదే అని వారికి మంచి భవిష్యత్తును ఇవ్వాలని సమాజం పట్ల గౌరవం పెరిగే విధంగా పెంచాలని దిశ నిర్దేశాలు చేయడం జరిగింది ,మీకు డ్రగ్స్ ఎవరైన వాడుతున్నట్లు తెలిసిన, డ్రగ్స్ ఎవరైనా అమ్ముతున్నట్టు లేదా రవాణా చేస్తున్నట్లు అలాగే గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు తెలిసిన టోల్ ఫ్రీ నెంబర్ 1908 కి కాల్ చేసి సమాచారం తలపగలరు , తెలిపిన వారి యొక్క వివరాలు గోప్యంగా ఉంచబడతాయని , గ్రామ పట్టణ యువత డ్రగ్స్ రహిత నిర్మూలనలో ముందు వరుసలో ఉండాలని తెలిపారు ,ఈ కార్యక్రమంలో ం+చీూదీ డీఎస్పీ బుచ్చయ్య , నాగర్ కర్నూల్ డిఎస్పి శ్రీనివాస్ నాగర్ కర్నూల్ సిఐ అశోక్ రెడ్డి నాగర్కర్నూల్ ఎస్సై గోవర్ధన్ , నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఆర్ఎంఓ డాక్టర్ రవిశంకర్, సైకియాట్రిస్ట్ డాక్టర్ ఫణికాంత్ నాగర్ కర్నూల్ జిల్లా ఈగల్ టీమ్ ఎస్సై రామ్ లాల్ తో పాటు ఆటో డ్రైవర్స్ లారీ డ్రైవర్స్ పాన్ షాప్ ఓనర్స్ మెడికల్ షాప్ ఓనర్స్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగిందన్నారు.

# జగిత్యాల జిల్లాలో ఎక్కడా ధాన్యం కోతలు జరగలేదు

-ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలతో రైతులను తప్పుదోవ పట్టించొద్దు
- రైతుల సంక్షేమమే లక్ష్యంగా రికార్డు స్థాయిలో వరి, మొక్కజొన్న కొనుగోళ్లు
-48 నుంచి 72 గంటల్లోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమ
-హమాలీల, గన్నీ బ్యాగుల కొరత ఉన్నప్పటికీ రికార్డు స్థాయిలో కొనుగోళ్లు పూర్తి
-జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి ధాన్యం కొనుగోళ్లపై మీడియా సమావేశంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




జగిత్యాల, జూన్ 10 (విజన్ ఆంధ్ర జిల్లా బ్యూరో):జగిత్యాల జిల్లాలో ఎక్కడా ధాన్యం కోతలు జరగలేదని, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రికార్డు స్థాయిలో వరి, మొక్కజొన్న కొనుగోళ్లు చేపడుతోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.మంగళవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు.రబీ 2025-26 సీజన్‌లో జిల్లాలో 5.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 5.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వచ్చిందన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 436 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటికే 5.08 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు.ధాన్యం కొనుగోళ ప్రారంభమైనప్పటి నుంచి ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ ధాన్యంలో కోతలు జరుగుతున్నాయని, కొనుగోళ్లు సక్రమంగా లేవని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి విమర్శించారు. ఈ ఆరోపణలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని అన్నారు.మిల్లర్ల వద్ద స్థల సమస్యలు ఎదురైన నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు జిల్లాను సందర్శించారని, మిల్లర్లు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. ప్రతి మూడు రోజులకు ఒకసారి క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించామని చెప్పారు. మొత్తం 81,954 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, రైతులకు చెల్లించాల్సిన మొత్తంలో ఇప్పటికే రూ.1,075 కోట్లు విడుదల చేశామని, దాదాపు 90 శాతం చెల్లింపులు పూర్తయ్యాయని తెలిపారు. రైతుల ఖాతాల్లో 48 నుంచి 72 గంటల్లోనే నగదు జమ అవుతోందని పేర్కొన్నారు.హమాలీల కొరత, గన్నీ బ్యాగుల కొరత వంటి అనేక ఇబ్బందులు ఎదురైనప్పటికీ జిల్లాలో రికార్డు స్థాయిలో ఐదు లక్షల మెట్రిక్ టన్నుల వరి, 47 వేల టన్నుల మొక్కజొన్న కొనుగోళ్లు నిర్వహించగలిగామని మంత్రి వెల్లడించారు.మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి ధాన్యంలో 10 కిలోల కోత విధించారని చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని మంత్రి పేర్కొన్నారు. ఆయనకు సంబంధించిన ట్రక్ షీట్‌ను మీడియా ముందు ఉంచుతున్నామని, మొత్తం 190 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసి పూర్తి చెల్లింపులు కూడా చేసినట్లు స్పష్టం చేశారు.దేశంలో ఇంత పెద్ద ఎత్తున రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం మరొకటి లేదని మంత్రి తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం వరి కొనుగోళ్లతో పాటు ఇతర పంటల కొనుగోళ్లను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తోందన్నారు. ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేయకుండా ప్రజలకు ఉపయోగపడే సూచనలు చేయాలని కోరారు.ఈ సందర్భంగా లిజగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ,లి యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో వరి, మొక్కజొన్న దిగుబడులు మార్కెట్‌కు వచ్చాయని తెలిపారు. జిల్లాలో సుమారు ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.1,100 కోట్లకు పైగా జమ చేసినట్లు చెప్పారు.ఈ సీజన్‌లో సుమారు 47 వేల టన్నుల మొక్కజొన్నను కూడా కొనుగోలు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం కనీస మద్దతు ధర ప్రకటించగా, తెలంగాణ ప్రభుత్వం రైతుల వద్ద నుంచి అన్ని పంటలను కొనుగోలు చేస్తోందన్నారు.ఆంధ్రప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో మొక్కజొన్న కొనుగోళ్లు జరగలేదని, తెలంగాణలో మాత్రం ముఖ్యమంత్రి, మంత్రులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో భారీ స్థాయిలో కొనుగోళ్లు నిర్వహించామని పేర్కొన్నారు. రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం పట్ల రైతులు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు.జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు, మీడియా ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

## వంద బేరియాట్రిక్ శస్త్రచికిత్సలు పూర్తి చేసిన కేర్ హాస్పిటల్స్



హైదరాబాద్, జూన్ 10 (విజన్ ఆంధ్ర) : కేర్ హాస్పిటల్స్ గత ఐదున్నరేళ్లలో బీఎంఐ 60కి పైగా ఉన్న సూపర్-సూపర్ ఊబకాయం రోగులపై 100 హై-రిస్క్ బేరియాట్రిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసిందని కేర్ హాస్పిటల్స్ బంజారాహిల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అభినవ్ జోషి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 165 కిలోల బరువు, 63 బీఎంఐ కలిగిన 23 ఏళ్ల యువతికి శస్త్రచికిత్స నిర్వహించడం ద్వారా ఈ మైలురాయిని చేరుకుందని తెలిపారు. జనరల్ అండ్ బేరియాట్రిక్ సర్జరీ విభాగాధిపతి డా.వేణుగోపాల్ పరీక్ నేతృత్వంలోని వైద్య బృందం ఈ శస్త్రచికిత్సలను నిర్వహించిందని తెలిపారు. ఈ ఘనత సంస్థ వైద్య నైపుణ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. అత్యాధునిక లాపరోస్కోపిక్ పద్ధతులతో రోగులు వేగంగా కోలుకునేలా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. డా.వేణుగోపాల్ పరేక్ మాట్లాడుతూ యువతలో తీవ్రమైన ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, స్లీప్ అప్నియా వంటి సమస్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బేరియాట్రిక్ శస్త్రచికిత్సలు బరువు తగ్గించడమే కాకుండా అనుబంధ వ్యాధుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయని తెలిపారు.

# ఎం ఎస్ ఆర్ స్కూల్ పై దాడి కాదు... పాఠశాల విద్యార్థుల,తల్లిదండ్రులపై దాడి

-సాధారణమైన ఫీజులో నాణ్యమైన విద్యనుఅందించడమే ఎమ్మెస్సార్ యాజమాన్యం చేసిన తప్పా..???
-పాఠశాలపై అవస్తవమైన ఆరోపణలను తల్లిదండ్రులుగా మేము ఖండిస్తున్నాం
-నిజ నిజాలు తెలుసుకోకుండా పాఠశాలపై అవాస్తవాలను ప్రచారం చేసిన వారిపై సైబర్ క్రైమ్ కు రిపోర్టు చేస్తాం
-ఎం ఎస్ ఆర్ పాఠశాలపై వచ్చిన ఆరోపణలను తీవ్రంగా ఖండించిన పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు




సూర్యాపేట జూన్ 10:(విజన్ ఆంధ్ర)సాధారణమైన ఫీజుతో అందరికీ అందుబాటులో నాణ్యమైన విద్యను అందిస్తున్న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంఎస్ఆర్ పాఠశాలపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని నిజాలు తెలుసుకోకుండా అవాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళుతున్న వారిపై సైబర్ క్రైమ్ రిపోర్ట్ చేయనున్నట్లు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎం ఎస్ ఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. బుధవారం ఎం.ఎస్.ఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో పలువురు తల్లిదండ్రులు ఎం ఎస్ ఆర్ పాఠశాలపై వచ్చిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు చెరుకుపల్లి లక్ష్మణ్, శంకర్ నాయక్, డాక్టర్ ప్రసన్నలు మాట్లాడుతూ బయట పాఠశాలలో అత్యధికంగా ఫీజులు వసూలు చేస్తూ నాణ్యమైన విద్యను అందించడం లేదని గత కొన్నేళ్లు గా ఎమ్మెస్సార్ పాఠశాలలో చదువుతున్న తమ పిల్లలకు విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందన్నారు. భవిష్యత్తులో పిల్లలు అన్ని రంగాల్లో రాణించేందుకు అవసరమైన అన్ని కార్యక్రమాలు పాఠశాలలో చేయడం జరుగుతుందని తామంతా గమనిస్తూనే ఉన్నామన్నారు. ఫీజుల విషయానికి వస్తే సాధారణమైన ఫీజులని సంవత్సరం మొత్తం నోటీసు బోర్డుపైనే ఫీజులు ఉంటాయన్నారు. ఫీజు కట్టమని పిల్లలను ఎలాంటి ఇబ్బందులు పెట్టరని కనీసం తల్లిదండ్రులను కూడా అడగరని తల్లిదండ్రుల సమయానుకూలంగా ఫీజు చెల్లిస్తారని తెలిపారు. ఎమ్మెస్సార్ పాఠశాలపై వాస్తవాలు లేని ఆరోపణలు చేయడం తల్లిదండ్రులను విద్యార్థులను భయాందోళనకు గురి చేస్తుందని ఈ దాడి ఎమ్మెస్సార్ పాఠశాలపై కాదని ఆ పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రుల పైనే అన్నారు. పాఠశాలలో ఏవైనా లోపాలు ఉంటే తల్లిదండ్రులు చెప్పాలని కానీ ఎవరో బయట వ్యక్తులు నిజాలు తెలుసుకోకుండా అవాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. నిరుపేదల పిల్లలు ఉంటే వారు అడగకముందే వారికి ఉచితంగా విద్యను అందిస్తున్నారని ఫీజు మొత్తం ఒకేసారి కట్టిన వారికి ఐదు శాతం రాయితీ కూడా ఇస్తున్నారని తెలిపారు. పిల్లల ఆహారం విషయంలో సైతం అనేక జాగ్రత్తలు తీసుకుంటారని మెనూ అందరికీ ఒకే విధంగా ఉంటుందని దీంతో పిల్లలకు సమతుల్య ఆహారం అంది అది వారి జ్ఞాపకశక్తికి దోహదపడుతుందన్నారు. పూర్తిగా అవగాహన లేకుండా ఇలాంటి ఆరోపణలు చేసిన వారిపై సైబర్ క్రైమ్ కు రిపోర్ట్ చేయడంతో పాటు పరువు నష్టం దావా వేస్తామని ఎంఎస్ఆర్ పాఠశాలపై ఇకముందు ఎలాంటి ఆరోపణలు చేసిన విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ప్రతిదాడి ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఏం ఎస్ ఆర్ పాఠశాల నిర్వాహకులు శ్రీనివాస్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నవారు నిజానిజాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. తమ పాఠశాలలో ఎలాంటి తప్పులు ఉన్న అధికారులకు ఫిర్యాదు చేయాలని తనపై ప్రతి ఏడాది 10 ఆర్టిఏలు వస్తున్నాయని వాటికి తాను సమాధానం చెబుతూనే ఉన్నానన్నారు. ఇటీవల ఓ వ్యక్తి సోషల్ మీడియాలో తమ పాఠశాలపై చేసినా ఆరోపణలో ఏ ఒక్కటి వాస్తవం కాదన్నారు. తమ పాఠశాల ఫీజు ఎప్పుడు నోటీసు బోర్డుపైనే ఉంటుందని, తాము పాఠశాలలో ఎలాంటి యూనిఫాంలు పుస్తకాలు విక్రయించమని అన్నారు. మితమైన విద్యార్థులతో నాణ్యమైన విద్యను అందించేందుకు అడ్మిషన్స్ లిమిటెడ్ గా తీసుకుంటామని అందుకు పేదలకు అడ్మిషన్ ఇవ్వడం లేదనడం సరికాదు అన్నారు. విద్యార్థుల రక్షణకు పాఠశాలకు గేటు పెట్టడం కూడా తప్పే అని వారు చెప్పడం ఇలాంటి ఆరోపణలతో తమ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు మనోధైర్యం కోల్పోతున్నారని సామాజిక బాధ్యత ఉంటే తప్పు చేస్తే తమపై అధికారులకు ఫిర్యాదు చేయాలని మీకు మీరే లేని పోని ఆరోపణలు చేస్తే తాము ఏ విధంగా సమాధానం ఇవ్వాలని ప్రశ్నించారు. తమ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు మాత్రమే కృషి చేస్తుందని ఇప్పటికైనా తమ పాఠశాలపై లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## రుద్రంగిలో రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ పనులకు వేగం పెంపు



రుద్రంగి, జూన్ 10 (రాజన్న సిరిసిల్ల బ్యూరో)రుద్రంగి మండలం గైదిగుట్ట తండాలోని ట్రైబల్ వెల్‌ఫేర్ అప్‌గ్రేడెడ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (గర్ల్స్) భవన నిర్మాణ పనుల్లో వేగాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ తరగతి గదులు, హాస్టల్ భవనం మరియు ఇతర నిర్మాణ ప్రాంతాలను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు ఇచ్చి, పని గడువులో పూర్తి చేయవలసిందిగా, త్వరితగతిన విద్యాలయాన్ని వినియోగంలోకి తీసుకోవాలని సూచించారు.పరిశీలన కార్యక్రమంలో రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సంగీత్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసాచారి, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్ పాల్గొన్నారు. చివరగా, జిల్లా కలెక్టర్ మరియు అధికారులు విద్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు

## రోడ్డు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి



కొత్తగూడెం బ్యూరో జూన్ 11(విజన్ ఆంధ్ర)కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామవరం 15వ డివిజన్, కొత్తూరు రాజాం బస్తి పోచమ్మ గుడి ప్రాంతం నుంచి విజయవాడ - జగదల్పూర్ జాతీయ రహదారి వరకు నూతనంగా రహదారి ఏర్పాటు చేయాలని బస్తీ వాసులు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొత్తగూడెం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న మార్గం సక్రమంగా లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ రాకపోకలు కూడా ఇబ్బందిగా మారాయని తెలిపారు. సుమారు 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పోచమ్మ తల్లి దేవాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు రహదారి నిర్మాణం చేపట్టి బస్తీ ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా అందించాలని కోరారు.రోడ్డు నిర్మాణానికి అనుకూలమైన స్థలం ఉందా అని ఎమ్మెల్యే ప్రశ్నించగా, ముదిరాజ్ భవనం పక్కన అవసరమైన స్థలం అందుబాటులో ఉందని స్థానికులు వివరించారు. అందులో కొంత భాగాన్ని అంబులెన్స్ రాకపోకలకు అనుకూలంగా రహదారి కోసం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కొత్తూరి మదనయ్య, రామవరం పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ముస్తఫా, కొత్తూరి రవికుమార్, సంపత్ కుమార్, చుక్కయ్య, పెరక కిరణ్, కొమ్ము శివ, దాసారపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు దైవ సమానులు

- విజయవంతమైన ఉచిత మెగా వైద్య శిబిరం



నారాయణపేట, జూన్ 10 (విజన్ ఆంధ్ర) సమాజంలో సాటి మానవులకు మెరుగైన వైద్యం అందిస్తున్న వైద్యులు దైవ సమానులని, లయన్స్ క్లబ్ గీత మల్టి స్పెషాలిటి హాస్పిటల్ క్యాన్సర్ హాస్పిటల్ మహబూబ్ నగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమానికి వైద్యులు డాక్టర్ రాజ్ కుమార్ గీత విశ్వనాథ్ మానవత దృపదంతో అందించిన సహకారం అభినంద నియామని మార్కెట్ చేర్మెన్ సదాశివారెడ్డి లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్ అన్నారు పట్టణంలో గీత మల్టి స్పెషాలిటిహాస్పిటల్ లొ బుధవారం లయన్స్ క్లబ్ గీత మల్టి స్పెషాలిటి హాస్పిటల్ మహబూబ్ నగర్ క్యాన్సర్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రినింగ్ తోపాటు గైన కాలాజీ మరియు శస్త్ర చికిత్స శిబిరంలో 278 మంది పాల్గొన్నారు ఈ ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంబించి ఈసందర్బంగా వారు మాట్లాడుతు ప్రాణాపాయ స్థితుల్లో సాటి మానవులకు వైద్యులు అందించె సేవాలు మరోజన్మకు నిదర్శనమని గత 40 సంవత్సరాలనుండి సమాజంలోపేద ప్రజలకు అన్నివిధాలా సేవాలను అందింస్తున్నకల్పతరువు లయన్స్ క్లబ్ అని అన్నారు అనంతరం శిభిరం లొ పాల్గొన్న ప్రజలకు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సరిత హరి నారాయణ్ బట్టడ్ దంపతుల నేతృత్వంలో అన్నదానం నిర్వహించారు ఈ కార్యక్రమంలొ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వై మల్లికార్జున్ లయన్స్ క్లబ్ కార్యదర్శి సాయినాథ్ కోశాధికారి రాధ సుదానంద్ చారి జనార్ధన్ ఆత్మరామ్ ఏడికె శ్రీనివాస్ లాహోటి రవి గౌడ్ డాక్టర్ ఘౌసిప్ మల్లేష్ మేనేజర్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్ నిర్మాణ పనులు ప్రారంభం



అల్వాల్, జూన్ 10,(విజన్ ఆంధ్ర):మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని మంగాపురం కాలనీలో 10 లక్షల రూపాయల ఖర్చుతో నూతనంగా చేపట్టబోయే ఓపెన్ జిమ్ నిర్మాణ పనులను బుధవారం మాజీ కార్పొరేటర్ రాజు జితేంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వ్యాయామం చేయడం ద్వారా ప్రతి ఒక్కరూ శారీరక ధారుడ్యంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు.ఓపెన్ జిమ్ లను ప్రతి ఒక్కరూ సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ రాకేష్ రావు, హనుమంతరావు, వెంకట్రావు, రాఘవరావు, ఆనందరావు, రాజు, డాక్టర్ ఆనందమూర్తి, శేఖర్, రాజలింగం, సుధీర్ రెడ్డి, ఆనందరావు, గౌతమ్ రావు, కాంగ్రెస్ నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్ గౌడ్, సంపత్ యాదవ్, రాజేందర్, దేవేందర్, లడ్డురెడ్డి, వెంకటేష్,కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ శిక్షణ

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




సూర్యాపేట జూన్ 10:(విజన్ ఆంధ్ర)కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా ప్రభుత్వ పాఠశాల పిల్లలకు కూడా అత్యాధునిక సాంకేతిక అవకాశాలు దక్కాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను భవిష్యత్తు సాంకేతికత వైపు నడిపించేందుకు సూర్యాపేట జిల్లా అధికారులు డిజిటల్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్య ద్వారా విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దేందుకు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. టీ-ఫైబర్, సూపర్ టీచర్ ఎడ్యు రిఫార్మ్స్ సంస్థల సహకారంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న నెల రోజుల ఏఐ శిక్షణా కార్యక్రమం పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆవిష్కరించారు. ఈ శిక్షణా కార్యక్రమం 2026 జూన్ 15 నుండి జూలై 11 వరకు నెల రోజుల పాటు కొనసాగనుంది. మొదటి విడతగా జిల్లాలోని నాలుగు పాఠశాలల్లో దీనిని నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో రాణించడానికి ఏఐ అక్షరాస్యత ఎంతో కీలకమని, ఇది విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి భారతదేశ డిజిటల్ పరివర్తన ప్రయాణంలో వారిని భాగస్వాములను చేస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎమర్జింగ్ టెక్నాలజీస్ మరియు డిజిటల్ సాధనాలను బాధ్యతాయుతంగా ఎలా వాడుకోవాలో నేర్పడం ద్వారా వారి ఉపాధి అవకాశాలను మెరుగయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు.**పైలెట్ ప్రాజెక్టు గా సూర్యాపేట**ఈ పైలట్ ప్రాజెక్ట్ ద్వారా సూర్యాపేట జిల్లాలోని వందలాది మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నేరుగా లబ్ధి పొందనున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయితే, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను విస్తరించడానికి ఇదొక రోల్ మోడల్‌గా నిలుస్తుందని విద్యాశాఖ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అశోక్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ గఫ్ఫార్, మరియు టీ-ఫైబర్, సూపర్ టీచర్ ఎడ్యు రిఫార్మ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్యంపై దాడినారాయణపేట కాంగ్రెస్ నాయకులు

నారాయణపేట, జూన్ 10 ( విజన్ ఆంధ్ర) టీపీసీసీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ దేశ ప్రజాస్వామ్య చరిత్రలో మరో బ్లాక్ డే నని నారాయణపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండిం చారు. ఈ సందర్బంగా బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రం లోని సివిఆర్ భవన్ లో వారు మాట్లాడు తూ ప్రతిపక్ష పార్టీ లను పోటీ చేయనీయకుండా ఎన్నికల బరిలోనే అడ్డుకునే ధోరణి అవలంభించడం ప్రజాస్వా మ్య విలువలకు విరుద్ధమ న్నారు.మాజీ డీసీసీ అధ్య క్షులు కుంభం శివకుమార్ రెడ్డి పై 2022లో తప్పుడు ఆరోపణలతో నమోదైన కేసును, మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు కారణంగా చూపిస్తూ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం, దురుద్దేశపూర్వకమైనదన్నారు. కుంభం శివకుమార్ రెడ్డి పై నమోదైన కేసులో దర్యా ప్తు అనంతరం కోర్టుకు పోలీ సులు సమర్పించిన ఫైనల్ రిపోర్టులో ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని పేర్కొన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఆ మహి ళ ఈ కేసును అడ్డం పెట్టుకొ నికుంభం.శివకుమార్ రెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ పరిహారం ఇప్పించాలని కోరుతూ మీనాక్షి నటరాజన్, ఇతరులను ప్రతివాదులుగా చేర్చారన్నారు. ఈ కేసులో మీనాక్షి నటరాజన్ కోర్టు కు వివరణ కూడా ఇచ్చారన్నా రు. ఈ కేసును అడ్డం పెట్టు కుని మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ చేయడం, బిజెపి నాయకు లు సమర్థించే ప్రయత్నం చేయడం వాస్తవాలను వక్రీకరించడమేనన్నారు.కేవలం కోర్టు ప్రక్రియలో ఒక రెస్పాండెంట్‌గా మీనాక్షి నటరాజన్ ఉన్నారని, దాని ని క్రిమినల్ కేసు ఉన్నట్లుగా చిత్రీకరించడం చట్టపరంగా సరైనది కాదన్నారు. మీనాక్షి నటరాజన్ పై అసలు ఎటు వంటి క్రిమినల్ కేసే లేదన్నా రు. అయినప్పటికీ ఆమెకు పూర్తి వివరణ ఇచ్చే అవకా శం కల్పించకుండా, సహజ న్యాయ సూత్రాలను పక్క నబెట్టి నామినేషన్‌ను తిర స్కరించడం అనేక సందేహాల కు తావిస్తోందన్నారు.నామినేషన్ తిరస్కరణ చర్య ప్రతిపక్ష స్వరాన్ని అణిచివే యాలనే విష రాజకీయ సంస్కృతికి నిదర్శనమన్నా రు.ఎన్నికలు పోటీ ద్వారా గెలవాలి గానీ, పరిపాలనా వ్యవస్థలను ఉ పయోగించి ప్రత్యర్థులను పోటీ నుంచే తప్పించే ప్రయత్నాలు ప్రజా స్వామ్యాన్ని బలహీన పరు స్తాయన్నారు.ఈనాడు దినపత్రిక,పలు ఛానెళ్లలో ప్రచురితమైన కథనంలో మీనాక్షి నటరాజన్ నామినే షన్ తిరస్కరణకు కుంభం శివకుమార్ రెడ్డి కేసే కారణ మని పేర్కొనడం పూర్తిగా నిరాధారమైనది, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయ త్నంగా మేము భావిస్తున్నా మన్నారు. వాస్తవాలను ధృవీకరించకుండా ఇటు వంటి కథనాలు ప్రచురించ డం బాధ్యతాయుత జర్నలి జానికి విరుద్ధమని, ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన మీడియా సంస్థలు ఊహాగా నాలు, అసత్య ప్రచారాలు చేయడం పై సంబంధిత కథనంపై ఈనాడు యాజమా న్యం,మిగతా టీవీ ఛానెల్స్ యాజమాన్యాలు వెంటనే వివరణ ఇవ్వాలని వాస్తవాల ను ప్రచురించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ నాయకుడి ప్రతిష్టకు జరిగిన నష్టంపై పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, పట్ట ణ అధ్యక్షులు ఎండి. సలీం, సీనియర్ నాయకులు ఎండి.గౌస్,కోట్ల.రవీందర్ రెడ్డి,మనోహర్ గౌడ్,సతీష్ గౌడ్,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కోట్ల. మధుసూ దన్ రెడ్డి,మున్సిపల్ కౌన్సిల ర్లు,రాజేష్ ఘూట్, రవితేజ, వెంకు గౌడ్,ఆర్టివో బోర్డ్ డైరె క్టర్ పోషల్ రాజేష్,మార్కెట్ డైరెక్టర్ బోయ శరణప్ప,సర్పంచులు వెంక టరెడ్డి,లక్ష్మణ్ నాయక్, నర్సింహా, చిట్టెం. దామోదర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి,జనార్దన్ గౌడ్,అనంద్,పల్ల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యే విజయానికి పునాది



సూర్యాపేట జూన్ 10:(విజన్ ఆంధ్ర )విద్య ద్వారానే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఆదిత్య స్కూల్ డైరెక్టర్ చింతమళ్ల రమేష్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య స్కూల్‌ను చైర్మన్ చింతమళ్ల సుజాతనిర్మల్ కుమార్‌లతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణను అందించడమే ఆదిత్య స్కూల్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆధునిక విద్యా విధానాలతో పాటు విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలను పాఠశాలలో కల్పిస్తున్నామని చెప్పారు. నర్సరీ నుంచి 7 వ తరగతి వరకు అడ్మిషన్లు అందుబాటులో ఉన్నాయని, చిన్నారుల కోసం ప్లే గ్రూప్, డే కేర్ సౌకర్యాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల మేధో వికాసంతో పాటు నైతిక విలువలు పెంపొందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విద్యను అందించే పాఠశాలలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కట్కోజు విద్య భారతి, కరస్పాండెంట్ కట్కోజు భరత్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## చెత్తను వేరు చేసి పారిశుధ్య వాహనాలకు అందించాలి

### -జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
### -సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటాం
### -పంటల మార్పిడి, ఆయిల్ పామ్ సాగుపై రైతులకు కలెక్టర్ సూచనలు



రుద్రంగి, జూన్ 10 (రాజన్న సిరిసిల్ల బ్యూరో):ప్రతి ఇంటిలో ఉత్పత్తి అయ్యే చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి గ్రామ పంచాయతీ పారిశుధ్య వాహనాలకు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం రుద్రంగి మండలం మానాల గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. గ్రామసభలో వర్షాకాల సన్నద్ధత, పంటల మార్పిడి, ఘన వ్యర్థాల నిర్వహణ, బడిబాట, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, రోడ్డు భద్రత, వనమహోత్సవం, గిరిజన సంక్షేమ పథకాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల్లో డ్రైనేజీలను వర్షాకాలానికి ముందే శుభ్రం చేయాలని, ప్లాస్టిక్ వ్యర్థాలు మరియు చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయరాదని సూచించారు. తడి, పొడి, సానిటరీ, ప్రత్యేక చెత్తగా వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ రంగంపై మాట్లాడుతూ, రైతులు పంటల సాగుకు ముందు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్, పప్పుధాన్యాలు, కూరగాయలు వంటి లాభదాయక పంటల సాగుపై దృష్టి పెట్టాలని, పంటల మార్పిడి ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరిన కలెక్టర్, బీఎల్ఓలు ఇంటింటికి వచ్చి వివరాలు సేకరించే సమయంలో అవసరమైన పత్రాలను చూపించి సహకరించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని కోరారు.

రోడ్డు భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఆమె, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వనమహోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరగడం ఆనందకరమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి, విద్య, పర్యావరణ పరిరక్షణకు సహకారం అందిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అసాధ్యం అనడానికి ప్రత్యేక నిదర్శనం

### -నర్సాపురం తుమ్మల వాగు పరిస్థితి.
### -పాలకులు పట్టించకపోవడమా?
### -అధికారులు స్పందించకపోవడమా?
### -అయోమయంలో ప్రజల



జూలూరుపాడు జూన్ 11 విజన్ ఆంధ్ర జూలూరుపాడు పడమట నర్సాపురం బేతాళపాడు గ్రామాల మధ్య ఉన్న తుమ్మలవాగు లో వున్నా ప్లాస్టిక్ ఇతరత్ర వ్యర్థ పదార్థాలు దర్శనమిస్తున్న వైనం చూస్తుంటే ఇక పర్యావరణ పరిరక్షణ ఎలా సాధ్య పడుతుంది అని రెండు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఆ చెత్తలో నుండి వచ్చిన దుర్వాసన కు రవాణ సౌకర్యాల వెసులుబాటుకు అవకాశం లేకుండా పోయింది అనే ఆరోపణలు ప్రజల్లో బలంగా కనిపిస్తుంది. ఇదువరకే ఈ కథానాన్ని (విజన్ ఆంధ్ర ) ప్రచురించిన ఫలితం లేకపోయింది సంబంధిత అధికారులు కాని నర్సాపురం గ్రామ పాలకులు ప్రజాప్రతినిధులు స్పందించక పోవడం గమనర్హం పర్యావరణ పరిరక్షణ అవగాహనా కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించడం రోడ్డు ప్రక్కనే చెత్తను తొలిగించక పోవడం చూస్తే మనకు మనమే వాతావరణ పర్యావరణ ప్లాస్టిక్ నిరోధక వంటి పనులు సాధించలేము అనే భావన ప్రజల్లో బలంగా వుంది అని రెండు గ్రామాల ప్రజల్లో మాటల ద్వారా వారి ఆవేదన వ్యక్తమౌతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆ చెత్తాచెదారానికి కారకులైన వారికి అధికారులు హెచ్చరికలు జారీ చేసి చెత్త ను తొలిగించాలి అని ప్రజభిప్రాయాలు వెళువేత్తున్నాయి అని లేని యడల పై అధికారుల దృష్టికి వెళ్ళడానికైనా సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది.

## గ్రామాలు ప్రశాంతంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం

### -నారాయణపేట డీఎస్పీ లింగయ్య



నారాయణపేట, జూన్ 10 (విజన్ ఆంధ్ర) గ్రామాలు ప్రశాంతంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం అని నారాయణపేట డీఎస్పీ. ఎన్.లింగయ్య అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నారాయణపేట మండలం సింగారం గ్రామంలోని మహి ళా సమైక్య భవనంలో నిర్వ హించిన గ్రామసభకు డీఎస్పీ నల్లపు లింగయ్య ముఖ్య అతిథిగా హాజరై అరయవ్,ఆలలైవ్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు రోడ్డు భద్రత, మత్తు పదార్థాల నిర్మూలన, మహి ళల భద్రత, గ్రామ శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో శాంతి భద్రతలు సక్రమంగా ఉన్న పుడే ఆ గ్రామం వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. గ్రామ ప్రజలందరూ పరస్పర సహకారంతో, చట్టా లను గౌరవిస్తూ ప్రశాంత వాతావరణాన్ని కొనసాగిం చాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలపై అవ గాహన కల్పించిన ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, నారాయ ణపేట జిల్లాలో కూడా వంద కు పైగా ప్రాణనష్టాలు సంభ విస్తున్నాయని తెలిపారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వినియోగించడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం వంటి జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదా లను గణనీయంగా తగ్గించ వచ్చున్నారు. మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం అత్యంత ప్రమాదకరమని పేర్కొన్న డీఎస్పీ, అటువంటి ఘటనల్లో తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు బాధ్య తగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు మరింత చేరువగా పోలీసు సేవలు అందించేం దుకు త్వరలో “మన గ్రామం - మన పోలీస్” కార్య క్రమాన్ని పెద్ద ఎత్తున ప్రారం భించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాల యాల వద్ద పోలీస్ వాల్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇందులో గ్రామా నికి సంబంధించిన నేర సమాచారం, అత్యవసర పోలీసు ఫోన్ నంబర్లు, ఫిర్యాదుల పెట్టె, క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా ఫిర్యాదులు అందించే సౌక ర్యం కల్పించనున్నట్లు వివ రించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు వాల్‌ను డీఎస్పీ నల్లపు లింగయ్య, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీని వాస్‌తో కలిసి పరిశీలించా రు. మత్తు పదార్థాల నిర్మూ లనపై మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలు సమాజాన్ని నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవ రైనా గంజాయి మొక్కలు పెంచినా లేదా మత్తు పదార్థాల వ్యాపారంలో పాల్గొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. అలాంటి వ్యక్తు లకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిలిపివేయబడే అవకాశం ఉందని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, అభివృ ద్ధి వైపు దృష్టి సారించాలని సూచించారు. మహిళల భద్రతకు ప్రభుత్వం, పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని డీఎస్పీ పేర్కొ న్నారు. మహిళలు, బాలి కలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మైనర్లపై లైంగిక వేధింపులు లేదా అత్యాచారాలకు పాల్పడిన వారిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఇలాం టి ఘటనలను దాచిపె ట్టేందుకు లేదా రాజీ చేసేం దుకు ప్రయత్నించే వారిపైనా చట్టపరమైన చర్యలు ఉంటా యని హెచ్చరించారు. ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాల ని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా బాసర ట్రిపుల్ ఐటీలో ఉచిత సీటు సాధిం చిన విద్యార్థిని కళ్యాణిని, ఆమె తల్లిదండ్రులు అంశా వతి, కుమార్లను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామంలోని విద్యార్థులంద రూ ఆమెను ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో చదువుకుని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళా సమైక్య భవనం ఆవరణలో మొక్కలు నాటి, వాటిని సంరక్షించి పెద్ద చెట్లు గా పెంచే బాధ్యత గ్రామ ప్రజలందరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పెద్దలు, మహిళా సమైక్య సంఘం సభ్యులు, యువత మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మైనర్ బాలికను నీమ్స్ లో పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కందాల



ఖమ్మం జిల్లా బ్యూరో, జూన్ 10(విజన్ ఆంధ్ర): ఇటీవల లైంగిక దాడికి గురై హైదరాబాద్ నీమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మైనర్ బాలికను బుధవారం నాడు పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా అసుపత్రి వైద్యులను బాలిక ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాలిక త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాలిక కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమం లో ఖమ్మం మాజీ కార్పొరేటర్ జక్కుల లక్ష్మయ్య , రోజుకు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్‌లో ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన

### జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జూన్ 10నాగర్ కర్నూల్ పట్టణంలోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, భద్రత మరియు నిబంధనల అమలును నిర్ధారించే ఉద్దేశంతో ఈ తనిఖీ నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. తనిఖీ సందర్భంగా గోడౌన్‌లో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు), బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాలు మరియు ఇతర ఎన్నికల సామగ్రి నిల్వ గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి గదిలో భద్రతా ఏర్పాట్లు, నిల్వ విధానం, రికార్డుల నిర్వహణ, సీల్‌ల పరిస్థితి తదితర అంశాలను పరిశీలిస్తూ సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోడౌన్ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. సీసీ కెమెరాలు ఇరవై నాలుగు గంటలూ నిరంతరాయంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, వాటి పనితీరును క్రమం తప్పకుండా పరిశీలించాలని అధికారులకు సూచించారు. అలాగే ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు మరియు ఇతర ఎన్నికల సామగ్రికి తేమ, దుమ్ము, సాంకేతిక లోపాలు లేదా ఇతర కారణాల వల్ల ఎలాంటి నష్టం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల సామగ్రి నిర్వహణకు సంబంధించిన అన్ని ప్రక్రియలను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా అమలు చేయాలని, భద్రతా ప్రమాణాలు ఎల్లప్పుడూ పాటించడంతో పాటు, గోడౌన్ నిర్వహణలో పారదర్శకతను కొనసాగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల శాఖ అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రహదారి భద్రత ప్రతిఒక్కరి బాధ్యత

### - ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలి
### - రోడ్డు ప్రమాదంలో ఏ ఒక్కరు ప్రణాలు
### -కొల్పోకుండా అధికారులు సంకల్పంతో పని చేయాలి
### -జిల్లా కలక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ



సూర్యాపేట జూన్ 10:(విజన్ ఆంధ్ర)ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈరోజు అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించి జిల్లా కేంద్రంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి త్రివేణి ఫంక్షన్ హాల్ వరకు సూర్యాపేట పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు, పౌరులు లతో కలిసి అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత ర్యాలీ నిర్వహించడం జరిగినది, అనంతరం త్రివేణి ఫంక్షన్ హాల్ నందు పౌరులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ అవగాహన ర్యాలీ, అవగాహన సదస్సుకు జిల్లా కలక్టర్ తేజస్ నంద లాల్ పవార్, ఎస్పీ నరసింహ, హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. పౌరులతో కలసి ర్యాలీ నందు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి, జిల్లా రక్షణ గురించి మాట్లాడినట్లయితే పౌరుల రక్షణ ముఖ్యమైనది, పౌరుల భద్రత రక్షణలో పోలీసు శాఖ అనుక్షణం పని చేస్తుంది అని కలక్టర్ తెలిపినారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అనేక రకాల అవగాహన కార్యక్రమాలు, గ్రామ సభలు నిర్వహిస్తున్నాం ప్రజలను చైతన్య పరుస్తున్నాం అన్నారు. ఈరోజు కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు ఆధ్వర్యంలో ఎస్పీ నరసింహ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. రోడ్డు ప్రమాదాల నివారణలో, రోడ్డు ప్రమాద మరణాలు సంభవించకుండా అధికారులు సంకల్పంతో పని చేయాలి పోలీస్, రోడ్డు ట్రాన్స్పోర్ట్, ఆర్టీసీ, ఇతర శాఖలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులను కాపాడి సహాయసహకారాలు అందిస్తే రహవీర్ గా గుర్తింపు వస్తుంది అన్నారు, రహదారి భద్రత ప్రతి ఒక్కరి భద్రత అన్నారు. **అనంతరం జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ** రోడ్డు భద్రత అంటే రోడ్డు పై ప్రయాణం చేసేసమాజంలో ప్రజలు, వాహనదారులు సురక్షితంగా గమ్యం చేరడం. ప్రతి సంవత్సరంకాలంలో తెలంగాణ వ్యాప్తంగా 7500 కు పైగా ప్రాణాలు కోల్పోతున్నారు అన్నారు, మన జిల్లాలో సగటున సంవత్సరానికి 250 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. అధిక ప్రమాదాలు నిర్లక్ష్యం, అజాగ్రత్త వల్లనే సంభవిస్తున్నాయి, తప్పుదు మార్గంలో వాహనాలు నడపడం, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, పిల్లలు వాహనాలు నడపడం, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపడం, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి వీటిని నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరు జాగ్రతగా అవగాహనలో వాహనాలు నడపాలి, రోడ్లపై ప్రయాణ సమాజంలో చైతన్యం మార్పు రావాలి అన్నారు. పోలీసు శాఖ అనుక్షణం అవగాహన కల్పిస్తూ ఎన్ఫోర్స్మెంట్ నిర్వహిస్తున్నది అన్నారు. అర్వపల్లి, మోతే, చివ్వేంల, మునగాల, తుంగతుర్తి పోలీసు స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాద సంఘటనలు వివరించారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు ఎన్ని బాధలు పడుతున్నాయి అనేది వివరించారు. డిఫెన్సిఫ్ డ్రైవింగ్ చేయాలి, అన్ని అనుమతి పత్రాలు కలిగి ఉండాలి అన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు ఎక్కువ మంది హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకోక పోవడం వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారు అని గంకాలు చెప్తున్నాయి అన్నారు. విద్యాసంస్థలు ప్రారంభం అవుతున్నాయి విద్యార్థులను బస్సులు, ఇతర వాహనాలు కండిషన్ లేకుంటే సీజ్ చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. ఆశా కార్యకర్తలకు హెల్మెట్ అందించారు, రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేశారు. పోలీసు కళాబృందం వారు పాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్, ఎంవిఐ ఆదిత్య, సూర్యాపేట పట్టణ, రూరల్ సిఐ లు రాజశేఖర్, వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఆర్టీసీ ఇన్స్పెక్టర్ సైదులు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు ప్రవీణ్ కుమార్, జానయ్య, పట్టణ ఫైర్ స్టేషన్ అధికారి జానయ్య, అసిస్టెంట్ మోటార్ ట్రాన్స్పోర్ట్ అధికారి సతీష్, ఎస్ఐ లు ఏడుకొండలు, మహేందర్ నాథ్, సాయిరాం, ఆర్ఎస్ఐ లు అశోక్, రాజశేఖర్, అన్వర్, షి టీమ్ సిబ్బంది, టెక్నికల్ టీం సిబ్బంది, రోడ్డు సేఫ్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల ఆకాంక్ష మెరకే గ్రామ పంచాయతీ నిధులు ఖర్చు చేయాలి

### గ్రామ సభలోజిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,



నాగర్‌కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జూన్ 10 నియోజకవర్గ పరిధిలోని తిమ్మాజీపేట మండలం బావాజీపల్లిగ్రామపంచాయతీ కార్యాలయంవద్దనిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ముఖ్యఅతిథిగాహాజరయ్యారు. గ్రామ ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ సమావేశంలో గ్రామాభివృద్ధి, వ్యవసాయ రంగ పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....., ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు సంప్రదాయ వరి సాగుపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా జొన్న, రాగి వంటి చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్ల తోటలు మరియు ఇతర లాభదాయక పంటలను సాగు చేయడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు ఏర్పడవచ్చు అని భారత వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో నీటి వనరులు పరిమితంగా ఉన్న నేపథ్యంలో తక్కువ నీటితో అధిక దిగుబడులు ఇచ్చే పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ రైతులను కోరారు. చిరుధాన్యాల వినియోగందేశవ్యాప్తంగాపెరుగుతున్నందున వాటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, రైతులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల సాగు చేపడితే ఆర్థికంగా మరింత లాభపడగలరని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడంతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు అందించే సూచనలు, సలహాలను పాటించాలని సూచించారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, వ్యవసాయ అనుబంధ రంగాలైన పశుపోషణ, ఉద్యానవనం, చేపల పెంపకం వంటి రంగాలపై కూడా రైతులు దృష్టి పెట్టాలని కలెక్టర్ తెలిపారు. రైతుల ఆదాయ వృద్ధికి అవసరమైన అన్ని విధాల సహకారాన్ని జిల్లా యంత్రాంగం అందిస్తుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో కొనసాగనున్న ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు అర్హులైన ఓటర్లు ఉండేలా, అనర్హులైన ఓటర్లను తొలగించే కార్యక్రమం చేపడుతుందని గ్రామంలోని ప్రతి ఒక్కరు సర్ కార్యక్రమం పై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. అనంతరం గ్రామంలో అమలవుతున్న అభివృద్ధి పనులు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రహదారులు తదితర అంశాలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. గ్రామాభివృద్ధికి ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. మండల స్థాయి అధికారులుసమయపాలనపాటించకుండా ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి, మండల అధికారులు,గ్రామపంచాయతీ సభ్యులు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించండి



నెల్లికుదురు. జూన్ 10, విజన్ ఆంధ్ర:ప్రభుత్వ జూనియర్ కళాశాల నెల్లికుదురు ఇన్చార్జి ప్రిన్సిపాల్ ముక్కెర ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో మండలంలోని రాజుల కొత్తపల్లిలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని ఈ విద్యా సంవత్సరం నుండి అల్పాహారం మధ్యాహ్నం భోజనం కూడా కల్పిస్తున్నదని ప్రభుత్వం ఉచిత పాఠ్యపుస్తకాలు స్కాలర్షిప్ విశాలమైన తరగతి గదులు ఎన్ఎస్ఎస్ యూనిట్స్ లైబ్రరీ విశాలమైన తరగతి గదులు అధునాతనమైన ల్యాబులు ఉన్నాయని ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నామని తప్పకుండా ప్రభుత్వ కళాశాలలోనే విద్యార్థులను చేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కందికొండ బాబు, కవిరాజు, సుభాష్ ,మహేందర్ పాల్గొన్నారు.

# మొక్కలు నాటి డ్రగ్స్ కు వ్యతిరేకంగా సందేశం ఇచ్చిన ఈగల్ ఫోర్స్

నారాయణపేట, జూన్ 10 (విజన్ ఆంధ్ర) ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈగల్ ఫోర్స్ టీం, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అటవీ శాఖ మరియు వైద్య ఆరోగ్య శాఖల సంయుక్త అధికారు లు, విద్యార్థులు కలిసి నారా యణపేట జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవర ణలో బుధవారం మొక్కలు నాటే ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.డ్రగ్స్ ,మత్తు పదార్థాల బారిన పడి అనంతరం డి-అడిక్షన్ సెంటర్ ద్వారా చికిత్స పొంది సాధారణ జీవితంలోకి తిరిగి వచ్చిన సుమారు 20 మంది యువ కులతో కలిసి అధికారులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణతో పాటు మత్తు పదార్థాల నివారణపై అవ గాహన కల్పించారు.ఈ సందర్భంగా డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తు అని, అలాంటి యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఆరోగ్యక రమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచిం చారు. డ్రగ్స్ నియంత్రణను తెలంగాణ ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా తీసుకొని ఎన్ఫో ర్స్మెంట్ అవగాహనతో డ్రగ్స్ ను నియంత్రించడం జరుగు తుందని తెలిపారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవి తానికే కాకుండా కుటుంబం, సమాజం ,దేశ అభివృద్ధికి కూడా తీవ్ర నష్టం కలిగిస్తుంద ని



తెలిపారు.డి-అడిక్షన్ సెంటర్ ద్వారా చికిత్స పొంది తిరిగి సాధారణ జీవితంలోకి వచ్చిన యువకులు సమాజా నికి ఆదర్శంగా నిలవాలని, వారి అనుభవాలను ఇతరు లతో పంచుకుని డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహ కరించాలని పిలుపు నిచ్చారు.మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిర క్షణతో పాటు మంచి అలవాట్లను పెంపొందిం చుకోవాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అందించినట్లు తెలిపారు. యువత తమ శక్తి, సామర్థ్యా లను విద్య, ఉపాధి, క్రీడలు, సమాజ సేవ వంటి సానుకూ ల కార్యక్రమాల వైపు మళ్లిం చాలని సూచించారు.డ్రగ్స్కు సంబంధించిన సమా చారం తెలిసినా, ఎవరైనా మత్తు పదార్థాల విక్రయాలు లేదా వినియోగంలో పాల్గొం టున్నట్లు గమనించినా వెంటనే టోల్ ఫ్రీ 1908 లేదా డయల్ 100 కి లేదా లోకల్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉ ంచబ డతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐ లు రామ్ లాల్, భగవంత్ రెడ్డి, సైదులు,ఆర్ ఐ విజయ్ భాస్కర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా. సంపద కుమార్ సింగ్, డాక్టర్ కిరణ్ ప్రకాష్,ఆర్ ఎం ఓ రాఘవేంద ర్, ఎస్ఐ లు వెంకటేశ్వర్లు, నరేష్, ఆంజనేయులు, శివ శంకర్, శిరీష, ఈగల్ ఫోర్స్ టీం, అటవీ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, డి-అడిక్షన్ సెంటర్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు

# పశువుల వ్యాధుల నివారణకు ఉచిత టీకాలు తప్పనిసరి,

### పశువుల ఆరోగ్యమే రైతుల ఆర్థికాభివృద్ధికి బలం,
### పశువులవ్యాధుల నివారణకు రైతులు
### తప్పనిసరిగా ఉచిత టీకాలు వేయించాలి,
### జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,



నాగర్కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జూన్ 10 నియోజకవర్గ పరిధిలోని బావాజీపల్లి గ్రామంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత పశు టీకాల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ హాజరై రైతులకు అవగాహన కల్పించారు. పశు సంపదను అంటువ్యాధుల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఉచిత టీకాల కార్యక్రమాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా గ్రామంలో పాడి పశువులు, గేదెలకు లంపీ స్కిన్ వ్యాధి (గాణ), గొంతువాపు వ్యాధి (గూ), జబ్బవాపు వ్యాధి (దీూ) నివారణకు ఉచిత టీకాలు వేశారు. అదేవిధంగా గొర్రెలు, మేకలలో ప్రాణాంతకంగా మారే చిటుక రోగం (జు) నివారణకు ప్రత్యేక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. పశువైద్య అధికారులు గ్రామంలోని పశువులను పరిశీలించి టీకాలు అందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....., పశుసంపద రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఆధారమని, పశువుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటేనే పాల ఉత్పత్తి పెరగడంతో పాటు రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని అన్నారు. లంపీ స్కిన్ వంటి వైరల్ వ్యాధులు పశువుల ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు ఆర్థిక నష్టాలకు దారితీస్తాయని వివరించారు. అందువల్ల ప్రభుత్వం అందిస్తున్న ఉచిత టీకాలను ప్రతి పశువుకు తప్పనిసరిగా వేయించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో పశువులకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో టీకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పశువులకు ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప పశు వైద్య అధికారులకు సమాచారం అందించాలని రైతులకు సూచించారు. వ్యాధుల నివారణలో రైతుల సహకారం అత్యంత అవసరమని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పశుసంపదను సంరక్షించవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ అధికారులు టీకాల ప్రాముఖ్యత, వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో పశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి. జ్ఞాన శేఖర్ , మండల పశువైద్యాధికారి డాక్టర్ ఉదయ్ కుమార్ రెడ్డి, పశు వైద్య సిబ్బంది తిరుపతయ్య(గాూ), ఖాదర్(వాూ), యాదగిరి(గా), శాంతయ్య(గా), గోపాలమిత్రులు జగ్జీవన్, స్వామి గ్రామ పెద్దలు, పాడి రైతులు, గొర్రెల కాపర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం రైల్వే ప్లాట్ ఫామ్ వద్ద 22 కేజీల ఎండు గంజాయి పట్టివేత

ఖమ్మం జిల్లా బ్యూరో , జూన్ 10( విజన్ ఆంధ్ర): ఖమ్మం ఎన్ఫోర్స్మెంట్ సీఐ సిహెచ్.శ్రీనివాస్ మరియు సిబ్బంది కలిసి బుధవారం నాడు ఖమ్మం రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ 2 సమీపంలో అక్రమ ఎండు గంజాయి పట్టుకున్నారు . గంజాయి రవాణా జరుగుతున్నదనే విశ్వసనీయ సమాచారం మేరకు ప్లాంట్ ఫాం సమీపంలో తనిఖీలు నిర్వహించగా అక్కడ ఒడిశా కు చెందిన సెబాస్టికా బీబర్ అనే వ్యక్తి వద్ద గల ప్లాస్టిక్ సంచిలో 22.450 కేజీల ఎండు గంజాయి లభ్యమైంది. అనంతరం అతనిపై ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసారు . తదుపరి విచారణ నిమిత్తం సీజ్ చేసిన ఒక సెల్ ఫోన్ ను ,ఎండు గంజాయిని ఖమ్మం-2 ఎక్సైజ్ స్టేషన్ లో అప్పగించారు. ఈ తనిఖీల లో హెడ్ కానిస్టేబుల్ జమాల్ షరీఫ్, కానిస్టేబుల్స్ వీరబాబు, నాగమణి, స్రవంతి, డ్రైవర్ రాజు లు పాల్గొన్నారు. ఏదైనా మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఉ



న్నచో టోల్ ఫ్రీ నెంబర్ 18004252523 కు సమాచారం అందించాలని సిఐ శ్రీనివాస్ తెలిపారు.

## టెక్స్టైల్ పార్క్ అభివృద్ధికి చర్యలు వేగవంతం చేయాలి -జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్




రాజన్న సిరిసిల్ల, జూన్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో):సిరిసిల్ల టెక్స్టైల్ పార్క్ అభివృద్ధికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో చేనేత, జౌళి, పరిశ్రమలు, ఇరిగేషన్, మిషన్ భగీరథ శాఖల అధికారులు, టెక్స్టైల్ పార్క్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పలు కీలక అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా టెక్స్టైల్ పార్క్లో ప్లాట్ల బదిలీకి సంబంధించిన ఎన్ఓసీల జారీ, నీటి సరఫరా, కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్ (సీఈటీపీ) వినియోగం, కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్సీ) ఏర్పాటు వంటి అంశాల పురోగతిని సమీక్షించారు.అర్హత కలిగిన దరఖాస్తులకు సంబంధించిన ఎన్ఓసీలను త్వరితగతిన రాష్ట్ర స్థాయి కమిటీ పరిశీలనకు పంపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. టెక్స్టైల్ పార్క్కు నిరంతర నీటి సరఫరా కోసం ప్రత్యామ్నాయ వనరులను గుర్తించాలని ఇరిగేషన్, మిషన్ భగీరథ శాఖ అధికారులకు సూచించారు.పార్క్లో ఏర్పాటు చేసిన సీఈటీపీని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంతో పాటు, భవిష్యత్తులో డైయింగ్, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటైనప్పుడు సమర్థవంతంగా ఉపయోగపడేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అలాగే కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు.సమావేశంలో చేనేత, జౌళి సహాయ సంచాలకులు సంతోష్ కుమార్, మిషన్ భగీరథ ఈఈ ముజాహిబ్ అన్వర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ హన్మంతు, టెక్స్టైల్ పార్క్ అసోసియేషన్ సభ్యులు, యూనిట్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్టీయూ ధ్యేయం

## ప్రభుత్వం వెంటనే పి.ఆర్.సి డిఏలు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

### జిల్లా అధ్యక్షుడు యాదగిరి జనార్దన్ రెడ్డి



నారాయణపేట, జూన్ 10 (విజన్ ఆంధ్ర) ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయడం పీఆర్టీయూలక్ష్యమని పిఆర్టియు సంఘం నారాయణపేట జిల్లా అధ్యక్షుడు యాదగిరి జనార్దన్ రెడ్డి అన్నారు. బుధవారం ఇటీవల మహబూబ్నగర్ జిల్లా గండీడ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 2024 డీఎస్సీకి చెందిన యువ ఉపాధ్యాయుడు సాయికిరణ్ కుటుంబ సభ్యులను కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలోని వారి నివాసంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాదగిరి జనార్దన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి. వెంకట్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పీఆర్టీయూ సంక్షేమ నిధి నుంచి రూ.1 లక్ష విలువైన చెక్కును సాయికిరణ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ఆలోచనతో ఏర్పాటైన సంక్షేమ నిధి ద్వారా ఆపదలో ఉన్న ఉపాధ్యాయ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు.ఈ ఏడాది నారాయణపేట జిల్లాలో అకాల మరణం చెందిన ఆరుగురు ఉపాధ్యాయుల కుటుంబాలకు సంక్షేమ నిధి ద్వారా రూ.6 లక్షలు అందజేస్తున్నామన్నారు.ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇవ్వడంతో జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణను కొంతకాలం వాయిదా వేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం చేయడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో అసంతృప్తి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ, డీఏలు, పెండింగ్ బిల్లులు, హెల్త్ కార్డుల అమలు విధివిధానాలపై స్పష్టత ఇవ్వాలని, అలాగే సర్వీస్ రూల్స్ రూపొందించి అన్ని రకాల ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు మానసికంగా ప్రశాంతంగా ఉన్నప్పుడే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు సాకారం అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మద్దూర్ మండల విద్యాధికారి జి. జనార్దన్ రెడ్డి, జెడ్పీహెచ్ఎస్ బహార్పేట్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, జిల్లా మాజీ అధ్యక్షుడు పి. నర్సింహారెడ్డి, మద్దూర్ మండల అధ్యక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాశ్, నారాయణపేట మండల అధ్యక్షుడు ఎం. రఘువీర్, దామరగిద్ద మండల అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, కోస్గి మండల అధ్యక్షుడు రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఊట్కూర్ మండల ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, గుండుమాల్ మండల అధ్యక్షుడు ప్రకాష్ గౌడ్, రాష్ట్ర, జిల్లా నాయకులు బి. మధుసూదన్, బాలకృష్ణ, రవిప్రకాశ్, కె. శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, మోనే రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే 2024 డీఎస్సీకి చెందిన యువ ఉపాధ్యాయులు భరత్, బస్వంత్, రమేష్, హరికృష్ణ, వంశీ, హరిసుధన్ రెడ్డి, పవన్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు వెంటనే అక్రిడేషన్ కార్డులు ఇవ్వాల్సిందే!

### -ఇంటి స్థలాల పాలసీని,
### హెల్త్ కార్డును ప్రకటించాలి
### -ఈ నెలాఖరులో జిల్లా యూనియన్ మహాసభ
### -టీయూడబ్ల్యూజే(ఐజేయు) తీర్మానం



సంగారెడ్డి బ్యూరో, జూన్:10( విజన్ ఆంధ్ర )సంగారెడ్డి జిల్లా లో మిగిలిన జర్నలిస్టులందరికీ తక్షణమే అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే-ఐజేయు) సంగారెడ్డి జిల్లా శాఖ డిమాండ్ చేసింది. బుధవారం నాడు సంగారెడ్డిలో యూనియన్ జిల్లా కార్యవర్గ అత్యవసర సమావేశం జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కె ఫైజల్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు సిద్ధన్న పాటిల్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా విభాగం అధ్యక్షుడు అనిల్ కుమార్, రాష్ట్ర నాయకులు బాసిత్ అన్వర్ హుస్సేన్, యాదగిరి, భూమయ్య ఈ సమావేశానికి హాజరయ్యారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇంటి స్థలాల సమస్యపై, హెల్త్ కార్డుల అంశంపై చర్చించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం కేటాయించాలని తీర్మానించారు. అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరిగా హెల్త్ కార్డును ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 252 ప్రకారం అక్రిడిటేషన్ కార్డుల జారీలో చాలా ఆలస్యం అవుతుందని పలువురు జర్నలిస్టులు పేర్కొన్నారు. అయినప్పటికీ తమ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ప్రధాన కార్యదర్శి రామనారాయణ,రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైసల్ అహ్మద్ ఆధ్వర్యంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ని కలిసి అనేకసార్లు విన్నవించడం జరిగిందని చెప్పారు.దీని ఫలితంగానే అనేక సవరణలు వచ్చాయని, దానివల్లనే చాలామందికి అక్రిడేషన్ కార్డులు జారీ అయ్యాయని వివరించారు. మిగిలిన వారికి కూడా ఎలాంటి కొర్రీలు వేయకుండా తక్షణమే కార్డు మంజూరు చేయాలని ఈ సమావేశంలో డిమాండ్ చేశారు. తమ సంఘానికి పోరాటం కొత్త కాదని, జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం గా టీయూడబ్ల్యూజే ఉన్నదని ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఎవరు ఉన్నప్పటికీ జర్నలిస్టుల సంక్షేమమే తమ సంఘం ధ్యేయమని ఆయన చెప్పారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన అన్నారు.

# ప్రతి హామీని అమలు చేస్తున్నాం - మంత్రి తుమ్మల

### మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సహా
### సంక్షేమ పథకాలు అమలు
### మున్నేరు వరద సమస్యలకు శాశ్వత
### పరిష్కారంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం
### పారిశుధ్యం, పచ్చదనం పెంపుతో ఆరోగ్యకరమైన
### సమాజ నిర్మాణానికి కృషి
### స్థానిక ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనుల
### నాణ్యతను పర్యవేక్షించాలి



ఖమ్మం జిల్లా బ్యూరో, జూన్ 10 (విజన్ ఆంధ్ర) :ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఎఫ్సీఐ గోదాం నుంచి బైపాస్ రోడ్డు వరకు రూ.3 కోట్ల 5 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, పేద విద్యార్థుల కోసం యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇంట్లో కూడా అన్ని పనులను ఒకేసారి చేయలేమని, అదే విధంగా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు కొత్త ఇళ్ల మంజూరుకు తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు.గతంలో మూడు రోజులకోసారి తాగునీరు సరఫరా జరిగేదని, ప్రస్తుతం ప్రతిరోజూ తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్నేరు వరదల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో ఉన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించి పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు.డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని, రోడ్లు, డ్రెయిన్ల నాణ్యతపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోతే ప్రజల ఆదాయం ఆసుపత్రులకే వెచ్చించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉ ంచడంతో పాటు మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తరహాలో ఖమ్మం నగరం లోనూ వేగంగా అభివృద్ధి జరుగుతోందని, రోడ్ల విస్తరణ, జాతీయ రహదారుల నిర్మాణంతో వ్యాపార అవకాశాలు పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ , ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీవో శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆఫ్బీట్ హాస్పిటాలిటీకి టార్జన్ నేచర్ రిట్రీట్ కొత్త ప్రమాణాలు



హైదరాబాద్, జూన్ 10 (విజన్ ఆంధ్ర) : ఈబీజీ గ్రూప్కు చెందిన టార్జన్ నేచర్ రిట్రీట్ దేశంలోని అసంఘటిత ఆఫ్బీట్ హాస్పిటాలిటీ రంగాన్ని బ్రాండెడ్, విశ్వసనీయ ప్రకృతి-ఆధారిత గమ్యస్థానాలుగా తీర్చిదిద్దేందుకు టార్జన్ లైసెన్సింగ్/ప్రాపర్టీ అప్గ్రేడ్ మోడల్ను ప్రారంభించినట్లు ఈబీజీ గ్రూప్ చైర్మన్ ఇర్ఫాన్ ఖాన్ బుధవారం నగరరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ఫామ్స్టేలు, ఈకో-స్టేలు, నేచర్ క్యాంపులు, బుటిక్ రిసార్టులు, స్వతంత్ర రిట్రీట్లకు బ్రాండ్ లైసెన్సింగ్, ఎస్ఓపీలు, సిబ్బంది శిక్షణ, డిజిటల్ మార్కెటింగ్, అతిథి అనుభవ ప్రమాణాలు, ఆస్తి అప్గ్రేడ్లను అందించనున్నట్లు చెప్పారు. 2026 చివరి నాటికి దేశ వ్యాప్తంగా 1,000కు పైగా అర్హత కలిగిన ప్రకృతి ఆధారిత ఆస్తులను అభివృద్ధి చేయడమే లక్ష్యమని తెలిపారు. ప్రయాణికులకు భద్రత, పరిశుభ్రత, నాణ్యమైన సేవలతో కూడిన విశ్వసనీయ ఆఫ్బీట్ స్టేలను అందించడంతో పాటు, ఆస్తి యజమానులకు ఆదాయ వృద్ధి అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు.

## నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్,ఐపీఎస్

భూపాలపల్లి జిల్లా : 10 జూన్ ( విజన్ ఆంధ్ర ) భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, నేరాల నియంత్రణ చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించి ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టాలని సూచించారు. సి.సి.టి.ఎన్.ఎస్. (2.0)లో ప్రతి కేసును సకాలంలో నమోదు చేసి, వివరాలను నిరంతరం అప్డేట్ చేయాలని తెలిపారు. వ్యవస్థలో అందుబాటులో ఉన్న అన్ని ఫీచర్లను సమర్థవంతంగా వినియోగించి పారదర్శకత, సమాచార సమన్వయం మరియు సేవల నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, సైబర్ మోసాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, గ్రామ స్థాయి వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే గంజాయి రవాణా, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల వ్యవస్థను విస్తరించి, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్స్ గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ స్థాయి పోలీసింగ్ను మరింత బలోపేతం చేస్తూ, విలేజ్ పోలీస్ అధికారులు ప్రజలతో మమేకమై ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీలు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు మరియు ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# పాఠశాల భవనానికి మౌలిక వసతుల కల్పన

## -జిల్లా కలెక్టర్ కె. హరిత



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 10,విజన్ ఆంధ్రగత 10 సంవత్సరాలుగా మూతపడిన ప్రభుత్వ పాఠశాల భవనానికి మరమ్మత్తులు చేసి మౌలిక వసతులు కల్పించి తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు సాధ్యసాధ్యాలు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని 13వ వార్డు కాపు వాడలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం మూతపడి ఉన్న విషయాన్ని తెలుసుకొని విద్యాశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో గత 10 సంవత్సరాలుగా మూతపడి ఉన్న పాఠశాలను పునరుద్ధరించేందుకు గల సాధ్యాసాధ్యాలను విద్యాశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించి పున ప్రారంభించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకూ 1వ తేదీనే వేతనాలు చెల్లించాలి

## ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

## వేతనం ఎప్పుడు వస్తుందో తెలియని ఆశా వర్కర్ల జీవితం



కామ్రే /జూన్ 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి)ప్రజారోగ్య వ్యవస్థకు వెన్నెముకలా పనిచేస్తున్న ఆశా వర్కర్లు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని చంద్రశేఖర్ తెలిపారు. అయితే వారు చేసిన పనికి సంబంధించిన ప్రోత్సాహకాలు, వేతనాలు నెలల తరబడి ఆలస్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనం ఏ తేదీన వస్తుందో స్పష్టత లేక చాలామంది ఆశా వర్కర్లు తీసుకున్న రుణాలకు ఈఎంఐలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పిల్లల చదువులు, ఇంటి అద్దె, కుటుంబ ఖర్చుల నిర్వహణ భారంగా మారుతోందన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందించిన ఆశా వర్కర్లకు కనీస ఆర్థిక భద్రత కూడా లేకపోవడం బాధాకరమన్నారు. అంగన్‌వాడీ కార్మికులపై పెరుగుతున్న భారంఅంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్య అందించడంతో పాటు గర్భిణులు, బాలింతల సంక్షేమ బాధ్యతలను నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కూడా వేతనాల జాప్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న తరుణంలో వేతనాలు ఆలస్యమవడం కుటుంబాలపై అదనపు భారం మోపుతోందన్నారు. ఇంటి ఖర్చులు, పిల్లల విద్య, వైద్య అవసరాల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి గౌరవప్రదమైన వేతనాలు, సామాజిక భద్రత కల్పించాలని కోరారు. సొంత డబ్బుతో భోజనం పెట్టి బిల్లుల కోసం ఎదురుచూపులుపాఠశాల విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన భోజనం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని జె.చంద్రశేఖర్ అన్నారు. సరుకుల కొనుగోలు, వంట గ్యాస్, ఇతర అవసరాల కోసం చాలాసార్లు సొంత డబ్బులు ఖర్చు చేస్తూ భోజనం సిద్ధం చేస్తున్నారని తెలిపారు.అయితే బిల్లులు, వేతనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు కష్టపడుతున్న కార్మికులు తమ కుటుంబాల అవసరాలు తీర్చుకోలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. వారి సేవలను గుర్తించి కనీస వేతనం అమలు చేయడంతో పాటు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.శ్రమకు గౌరవం దక్కాలిప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రాక్టు ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని, అదే న్యాయం ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్మికులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకూ జరగాలని చంద్రశేఖర్ అన్నారు. సమాజానికి అత్యంత అవసరమైన సేవలు అందిస్తున్న ఈ మూడు వర్గాల కార్మికుల శ్రమను గుర్తించి ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఆకతాయిల అటకట్టించి మహిళలకు రక్షణ కల్పించేది షీ టీమ్

## షీ టీమ్ ఎస్సై హైమ



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 10(విజన్ ఆంధ్ర)ఆకతాయిల ఆట కట్టించి మహిళలకు రక్షణ కల్పించేదే షీ టీమ్ అని షీ టీమ్ ఎస్ఐ. హైమ అన్నారు. బుధవారం పట్టణంలోని 60 వ డివిజన్ లోగల షాదీఖానా మైనార్టీ ఫంక్షన్ హాల్ లో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రామగుండం కమిషనర్ ఆదేశాల మేరకు వార్డు సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఎస్ఐ. హైమా మాట్లాడుతూ మహిళల పట్ల ఎవరైన వేధింపులకు పాల్పడిన, అసభ్యకరంగా ప్రవర్తించిన వెంటనే షీ టీమ్ కు సమాచారం అందించాలని అన్నారు. సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు. ప్రభుత్వం మహిళల రక్షణ కోసం అనేక చట్టాలను తీసుకొచ్చిందన్నారు.ప్రతి రోజు బస్టాండ్,ప్రధాన చౌరస్తా ల్లో, కళాశాలలు, పాఠశాలలు, వివిధ జన సమూహంగా ఉన్న ప్రాంతాల్లో షీ టీమ్ బృందాలు నిరంతరం పర్యవేక్షణలో ఉంటారని తెలిపారు.మహిళలపై ఎక్కడైన వేధింపులకు గురి చేస్తే నిర్భయంగా షీ టీమ్ కు తెలియజేయాలనీ, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గొప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. షీ టీమ్ కార్యకలాపాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ తో పాటు మైనారిటీ కోఆప్షన్ సభ్యులు మీనాజ్, మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ అధికారి శ్రీనివాస్ రెడ్డి, వార్డు ఆఫీసర్ గంగన్న, షీ టీం సిబ్బంది శ్రవణ్, వనిత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది

### హాస్టల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి




విజన్ ఆంధ్ర దుబ్బాక రిపోర్టర్ దుబ్బాక పట్టణ కేంద్రంలోని కోమటిరెడ్డి రజినీకాంత్ రెడ్డి స్కూల్ లో నూతనంగా ఏర్పాటు చేసిన హాస్టల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారుఈ సందర్భంగా హాస్టల్‌ను ప్రారంభించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు కల్పించడం సమాజ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ఇటువంటి హాస్టళ్లు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాన్ని అభినందిస్తూ, విద్యా రంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు తదితరులు పాల్గొన్నారు..

# ఆరేపల్లి గ్రామ సర్పంచ్ చెట్టి శ్రీనివాస్ను పరామర్శించిన దుబ్బాక కాంగ్రెస్ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి





విజన్ ఆంధ్ర దుబ్బాక రిపోర్టర్ దుబ్బాక మండలం ఆరేపల్లి గ్రామ సర్పంచ్ చేట్టి శ్రీనివాస్ కి ఇటీవల హార్ట్ సర్జరీ జరగడంతో,ఈరోజు వారి స్వగృహానికి వెళ్లిన లిదుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిలి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా చెట్టి శ్రీనివాస్ ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారుఈ కార్యక్రమంలో దుబ్బాక మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కదుదురి నరేందర్ రెడ్డి, మట్ట కిషన్ రెడ్డి, నాయకులు అనంతుల శ్రీనివాస్, కోమటిరెడ్డి పద్మా రెడ్డి, సోలిపేట ప్రసాద్ రెడ్డి, ఉషయ్య గారి రాజిరెడ్డి,పోతారం గ్రామ మాజీ సర్పంచ్ గడిల జనార్దన్ రెడ్డి, మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ శ్రీరామ్ నరేందర్, మచ్చ శ్రీనివాస్, ఐరేని సాయి తేజ గౌడ్ తదితరులు పాల్గొన్నారు...

# అవకాశాలను అందిపుచ్చుకోవాలి

## జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మదిరే అశోక్





అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 10, విజన్ ఆంధ్ర జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మదిరే అశోక్ అన్నారు. బుధవారం జిల్లాలోని కాగజ్ నగర్ లో గల సిర్పూర్ పేపర్ మిల్ క్లబ్ నందు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, పరిశ్రమల నిర్వాహకులకు ఏర్పాటుచేసిన కార్యశాల కార్యక్రమానికి డి పి ఐ ఐ టి ప్రతినిధి అన్షుల్ గౌతమ్, ఓడిఓపి ప్రతినిధి హర్మన్ ప్రీత్ సింగ్, తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ప్రతినిధి ప్రణయ్, రిచ్ ప్రతినిధి కిషోర్ కుమార్, గ్రీన్ టెక్ సోలార్ సంస్థ ప్రతినిధి జగన్ మోహన్, ఎ బి బి ప్రతినిధి యోగేశ్వరన్, స్కిల్ ఎక్స్ప్రెస్ సంస్థ ప్రతినిధి చంద్రకాంత్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ జిల్లాలో రైస్ మిల్లులు, జిన్నింగ్ మిల్లులు, సిమెంట్ ఇటుకల తయారీదారులు, స్టార్టప్ సంస్థల ఔత్సాహికులకు కార్యశాల కార్యక్రమం ఉపయోగకరమైనదని తెలిపారు. స్టార్టప్ ఇండియా పథకంలో కార్యాచరణ, నిధుల కల్పన, స్థానిక ఉపాధి, ఆర్థిక అభివృద్ధి అంశాలపై వివరించారు. జిల్లాలో గుర్తించబడిన వివిధ ఉత్పత్తులకు మార్కెట్ లభ్యత, నిధుల సదుపాయం, ప్రభుత్వం అందిస్తున్న టీ వర్క్ సదుపాయాలు, సంబంధిత పథకాల వివరాలు తెలుసుకోవాలని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపన, ఆర్థిక అభివృద్ధిపై ఔత్సాహికులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సోలార్ వ్యవస్థల ఏర్పాటు, పవర్ ఫ్యాక్టర్ సమస్యలు, ఉత్పత్తుల నాణ్యత వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అందిస్తున్న పథకాలు, రాయితీలను వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాక ప్రజలకు శుభవార్త కోర్టు తరలింపుపై స్థల పరిశీలన చేసిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి



విజన్ ఆంధ్ర దుబ్బాక రిపోర్టర్ దుబ్బాక పట్టణ ప్రజలకు శుభవార్త. దుబ్బాక కోర్టు భవనాన్ని పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలంలో ఏర్పాటు చేయడం అనుకూలంగా ఉందని భావిస్తూ, ఆ విషయాన్ని రాష్ట్ర మంత్రి వివేక్ దృష్టికి తీసుకెళ్తానని లిదుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిలి తెలిపారు. ఈ మేరకు ఆయన పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వర్గీయ మాజీ మంత్రివర్యులు చెరుకు ముత్యం రెడ్డి దూరదృష్టితో దుబ్బాకకు కోర్టును తీసుకువచ్చారని, అయితే గత ప్రభుత్వ పాలకులు కోర్టు అభివృద్ధి మరియు శాశ్వత భవన ఏర్పాటుపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. దుబ్బాక కోర్టును ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోయే ప్రసక్తే లేదని, ప్రజలకు అందుబాటులో ఉండేలా పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలంలో కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కోర్టు సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకురావడానికి అన్ని స్థాయిల్లో ప్రయత్నాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో దుబ్బాక మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి, 14వ వార్డు కౌన్సిలర్ తునికి సురేష్, అనంతల శ్రీనివాస్,ఐరేని సాయితేజ గౌడ్, మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ శ్రీరామ్ నరేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మట్ట కిషన్ రెడ్డి, కదుదురి నరేందర్ రెడ్డి, పోతారం గ్రామ మాజీ సర్పంచ్ గడిల జనార్దన్ రెడ్డి,మచ్చ శ్రీనివాస్, ఉషయ్య గారి రాజిరెడ్డి, కీసర శ్రీనివాస్, వెంకట చారి, పిట్ల స్వామి, సోలిపేట ప్రసాద్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మా రెడ్డి, సద్ది రాజిరెడ్డి, తదితరులు ఉన్నారు..

# విద్యుత్ షాక్ తో బాలుని మృతి

## మిషన్ ఆంధ్ర దుబ్బాక రిపోర్టర్



సెలవుల్లో సరదాగా గడిపేందుకు అమ్మమ్మ ఇంటికి వచ్చిన బాలుడు విద్యుత్ షాక్ కు గురై మృతి చెందిన ఘటన దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్ఐ కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం.నారా యణరావుపేట మండలం మల్యాలకు చెందిన శంకర్ గౌడ్ కు భార్య నిర్మల, కుమారుడు చరణ్ తేజ (11), కుమార్తె ప్రవీణ ఉన్నారు. చరణ్ తేజ తన అక్కతో కలిసి సెలవులను గడిపేందుకు దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి మంగళవారం సాయంత్రం వచ్చారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం అక్కతో కలిసి బాలుడు రహదారి పక్క నుంచి నడుచుకుంటూ వెళుతుండగా, పక్కనే ఉన్న విద్యుత్ స్తంభంపై ఉన్న సింగిల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ యొక్క ఎర్తింగ్ తీగ బాలుడి కుడి చేతికి తగిలి విద్యుత్ షాక్ కొట్టింది. దీంతో వెంటనే కిందపడి అపస్మారక స్థితికి చేరిన బాలుడిని కుటుంబ సభ్యులు హుటాహుటిన సిద్దిపేట జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ వైద్యులు పరీక్షించి బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని మేనమామ భానుచందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేశారు.

# అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

## - కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్




కామారెడ్డి బ్యూరో జున్ 10(విజన్ఆంధ్ర)అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు.గ్రామ సభలో హెల్మెట్ లను అందించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అడిషనల్ ఎస్పీ నర్సింహా రెడ్డి బిక్నూర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామసభలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం బిక్నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామసభలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థుల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలు తీరును గ్రామస్థులతో కలిసి సమీక్షించారు. గ్రామ ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులు వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో నాలుగు దఫాలుగా నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రామసభల ద్వారా గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.గ్రామంలో ఉన్న పూరి గుడిసెలను గుర్తించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో 10 పూరి గుడిసెలను గుర్తించినట్లు తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తూ, 18 సంవత్సరాలు నిండిన అర్హులైన వారిని ఓటరు జాబితాలో నమోదు చేయడం, డబుల్ ఓటర్ల పేర్లను తొలగించడం జరుగుతోందని పేర్కొన్నారు.జన సంరక్షణ · మన సంరక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 36 వేల కందకాలను తవ్వడం జరిగిందని తెలిపారు.గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అదేవిధంగా, రైతులకు ఆయిల్ పామ్ సాగుపై విస్తృత అవగాహన కల్పించి, పంట విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, గ్రామసభల ద్వారా ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహించి, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేసి, ప్రతి ప్రయాణంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నర్సింహా రెడ్డి, అదనపు కలెక్టట్ గిరి, గ్రామ సర్పంచ్ బాల్యాల రేఖ సుదర్శన్, సంబంధిత జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ నూతన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా డా. ఆలే శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి , జూన్ 10,(విజన్ ఆంధ్ర) ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు (ఖూఐ&ఖీఔ), తెలంగాణ, హైదరాబాద్ ఉత్తర్వుల మేరకు నారాయణపేట జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సీఎస్ ఆర్ఎంఓగా విధులు నిర్వహిస్తున్న డా. ఆలే శ్రీనివాసులు మహబూబ్‌నగర్ జిల్లా నూతన జిల్లా వైద్య & ఆరోగ్య శాఖాధికారిగా (ఐవీ&ఝూ) నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (×ఋజ)లోని జిల్లా వైద్య & ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో రిపోర్ట్ చేసి ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ కార్యాలయంలో డా. శశికాంత్ (డిప్యూటీ డీఎం&హెచ్ఓ), డా. శైలజ (పీఓ-సీహెచ్ఐ), డా. రాజు (డీఎల్ఓ), డా. శివకాంత్, డా. పులి విద్య (ఏఓ), హెల్త్ ఎడ్యుకేటర్లు హన్మంతు, నర్సింహా, కార్యాలయ సిబ్బంది మరియు ఇతర అధికారులు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డా. ఆలే శ్రీనివాసులు ప్రోగ్రామ్ అధికారులు, కార్యాలయ సిబ్బంది మరియు ఇతర అధికారులతో సమావేశమై జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (ఘ్ఎఐజం) ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందిస్తూ వారి ఆరోగ్య స్థాయిని మెరుగుపరచేందుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. జిల్లాను ఆరోగ్య సేవల అమలులో రాష్ట్రంలో ఉత్తమ స్థానంలో నిలిపేందుకు ప్రతి అధికారి, ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన కోరారు.

# హిందుస్థాన్ పాకిస్తాన్ విభజన వెనుక కాంగ్రెస్ పాత్రను మర్చిపోవద్దు: ఎంపీ రఘునందన్ రావు

## దేశాన్ని అత్యధిక కాలం సేవలందించిన ప్రధానిగా నరేంద్ర మోదీ చరిత్ర సృష్టించారు

## ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసింది కాంగ్రెస్ పార్టీ



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 10: కొండపాక మండలంలోని ఓ ప్రైవేట్ రిసార్ట్‌లో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు అనుసరించాల్సిన విధానాలు, సంస్థాగత నిర్మాణం, ప్రజల్లో పనిచేసే తీరు గురించి వివరించారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతున్న కాంగ్రెస్ నాయకులు తమ పార్టీ చరిత్రను ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు.స్వాతంత్ర్యం అనంతరం మతం ఆధారంగా దేశాన్ని విభజించి హిందుస్థాన్, పాకిస్తాన్‌లుగా విడగొట్టిన చరిత్ర కాంగ్రెస్‌కే ఉందని విమర్శించారు. అలాంటి పార్టీ నేడు మత సామరస్యంపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని ఆరోపించారు.సమయానుకూలంగా పనిచేసే నాయకులకు బీజేపీలో అపార అవకాశాలు ఉన్నాయని, కార్యకర్త స్థాయి నుంచి అత్యున్నత పదవుల వరకు ఎదిగే అవకాశం ఈ పార్టీలోనే ఉందని పేర్కొన్నారు. సరైన నిర్ణయాలు తీసుకుంటే రాజకీయంగా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, తప్పు నిర్ణయాలు భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తాయని అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ దేశాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, దేశానికి అత్యధిక కాలం సేవలందించిన ప్రధానిగా చరిత్ర సృష్టించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ ఎదగడంలో ప్రతి కార్యకర్త పాత్ర కీలకమని పేర్కొన్నారుఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌తో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు గర్నెపల్లి కృష్ణమూర్తి, ఐలయ్య, తడుపునూరు వెంకటేశం, విద్యాసాగర్, లక్ష్మణ్ గౌడ్, మనోహర్ యాదవ్, వెంకట్ రెడ్డి, కుడికెల రాములు తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సభల ద్వారనే 54 వ డివిజన్ మరింత అభివృద్ధి
## డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 10,(విజన్ ఆంధ్ర)54 వ డివిజన్ అభివృద్ధికి వార్డు సభలు ఎంతగానో ఉపయోగ పడుతాయని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్ అన్నారు.బుధవారం 54 వ డివిజన్ లో వార్డు ఆఫీసర్ పవన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వార్డు సభకు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రమ్య మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరుగ్యారెంటీలు అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని అన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వార ఉచిత బస్సు ప్రయాణం, ఐదు వందల రూపాయలకే వంట గ్యాస్, ఇందిరమ్మ పథకం ద్వార గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు, రైతులకు రుణ మాఫీ, రెండువందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లాంటి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు.ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నియోజకవర్గం లో చేస్తున్న అభివృద్ధి గతంలో ఎవ్వరు చేయలేదని అన్నారు. మున్సిపల్ కమిషనర్ జి. అన్వేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి మీ ఇంటిముందుకు వచ్చిన చెత్తబండికి అందించాలని అన్నారు. చెత్త నాలుగు రకాలుగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం చెపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయాలనేది వార్డు సభ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. రానున్న వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్త లపై ప్రజలకు వివరించారు. ఏసీపీ ప్రకాష్ మాట్లాడుతూ మీపిల్లల భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని, చెడు మార్గంలో వెళ్లకుండా గమనిస్తూ ఉండాలని, గంజాయికి అలవాటు పడకుండా ఓ కంట కనిపెడుతుండాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంట్లో నుండి బయటకు వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ దరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. పలు సమస్యలపై ఫిర్యాదులను వార్డు ఆఫీసర్ కు అందించారు.అంతకు ముందు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సాంస్కృత సారథి కళాకారులు పాటల రూపంలో వివరించారు. ఈ కార్యక్రమం లో సిఐ ప్రమోద్ రావు, ఎస్సై, మధుసూదన్, విద్యుత్ శాఖ ఏ ఈ శ్రీనివాస్, మెప్మా పిడి చంద్రయ్య, హెల్త్ ఏద్యుకెటర్ అల్లాడి శ్రీనివాస్, హౌసింగ్ ఏ ఈ లు సలోని రాణి, చందు, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు తస్మియా బేగం, అన్నపూర్ణ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల ఆరోగ్యం అంటే అంత అలుసా

## భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిని ముఖ్యమంత్రి స్వయంగా సందర్శించాలి

**-పార్థివ దేహాన్ని భుజాలపై మోసిన స్పందించని మంత్రులు**
**-సిబ్బంది కొరతతో నిర్వీర్యం అయిపోతున్న ప్రభుత్వ వైద్యం**
**-సిపిఐ ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ.**
**-ఐటిడిఏ ల పై నిర్లక్ష్యం ప్రభుత్వ వైద్యంపై ప్రభావం**
**-సగం పైన వైద్య పోస్టుల ఖాళీలతో ఆదివాసీలకు దూరమవుతున్న ప్రభుత్వ వైద్యం**
**-సిపిఐఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్**
**- ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నీ సందర్శించిన సిపిఐ ఎం బృందం**
**-రోగులతో స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్న రాష్ట్ర కార్యదర్శి**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో (విజన్ ఆంధ్ర):ఆదివాసి ప్రజల ఆరోగ్యం అంటే ప్రభుత్వానికి ఇంత అలుసు ఎందుకని సిపిఐ ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రశ్నించారు. ఏజెన్సీ కేంద్రమైన భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఒక్కసారి ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి సందర్శించి ఇక్కడ అందుతున్న వైద్యాన్ని పరిశీలించాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తో పాటు కార్యవర్గ సభ్యులు బండారి కుమార్ తదితరుల బృందం భద్రాచలం ఏరియా ఆసుపత్రిని సందర్శించి పలువురు రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. అనంతరం ఇంచార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి తో మాట్లాడి పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రతిరోజు 400 నుండి 600 మంది రోగులు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వైద్యం కోసం వస్తున్నారని అందులో 80 నుండి 90 శాతం ఆదివాసి గిరిజన ప్రజలేనని అన్నారు. వందల సంఖ్యలో వస్తున్న రోగులకు వైద్య సేవలు అందించడానికి కేవలం 19 మంది డాక్టర్లు పనిచేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం 212 మంది వైద్య సిబ్బంది అవసరం కాగా కేవలం వందలోపు మాత్రమే విధుల్లో ఉన్నారంటే ఏజెన్సీ వైద్యంపై ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టమవుతుందని అన్నారు. ఆస్పత్రికి చెందిన అంబులెన్స్ మరమ్మతులు గురై రెండు సంవత్సరాలు కావస్తున్న కనీసం జిల్లా అధికారులు కూడా పట్టించుకోవడంలేదని ఆ ఫలితంగానే పార్థివ దేహాన్ని భుజాలపై మోసుకెళ్ళే దుస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్న భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పై కనీసం దృష్టి పెట్టడం లేదని అన్నారు. ఆస్పత్రి ఆవరణలోని మరుగుదొడ్లకు తలుపులు సైతం లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని అత్యాధునికమైన స్కానింగ్ ఎక్రే పరికరాలు ఉన్నప్పటికీ రేడియాలజిస్ట్ లేక పరీక్షల కోసం ప్రైవేట్ హాస్పటల్ కి వెళ్లాల్సి దుస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు. భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమస్యలపై త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి చర్చిస్తానని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ వైద్యశాలలో సమగ్ర సర్వే నిర్వహించి వచ్చిన సమస్యలపై ఆగస్టు మొదటి వారంలో హైదరాబాదులో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని అన్నారు. అప్పటికి ప్రభుత్వం దిగివచ్చి ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన సహాయ సౌకర్యాలు అందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

**రోగులను పరామర్శిస్తూ సమస్యలను ప్రస్తావిస్తూ**

ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యం తీసుకుంటున్న పలువురు రోగులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ స్వయంగా పలకరించి వారి ఆరోగ్య పరిస్థితిలను ఆరా తీశారు. వారికి అందుతున్న వైద్యం మందులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలోని మరుగుదొడ్లను సైతం స్వయంగా పరిశీలించిన జాన్ వెస్లీ ఆస్పటల్ నిర్వహణలో ఉన్న లోపాలను ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. కొన్ని మందులు బయట మందులు దుకాణాలకు రాస్తున్నారని రోగులు జాన్ వెస్లీకి ఫిర్యాదు చేయగా ఆ అంశాన్ని సైతం డాక్టర్ రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రానున్న వర్షాకాల సీజన్ నాటికి మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు.

**ఐటీడీఏ ల పై నిర్లక్ష్యం ప్రభుత్వ వైద్యంపై ప్రభావం**

రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్

ఐటిడిఏ ల పై ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యపరితంగానే ఏజెన్సీ ఏరియాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలపై ప్రభావం పడుతుందని సిపిఐ ఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్ ఆరోపించారు. భద్రాచలం ఐటిడిఏ పాలకమండలి జరగక మూడు సంవత్సరాలు గడుస్తున్న జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు. గతంలో ఐటీడీఏ నుండి వచ్చే నిధులతో హాస్పటల్లో అనేక మౌలిక సదుపాయాలు కల్పించారని గుర్తు చేశారు. నేడు కనీసం అంబులెన్స్ సౌకర్యం కూడా లేకుండా భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రి దిగజారిపోయిన ఐటిడిఏ అధికారులు జిల్లా కలెక్టర్ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. నాలుగు రాష్ట్రాలకు సరిహద్దు కేంద్రంగా ఉన్న భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో సగానికి పైన వైద్య పోస్టులు ఖాళీగా ఉంటే ఆదివాసి ప్రజలకు వైద్యం ఎలా అందుతుందని రవికుమార్ ప్రశ్నించారు. గతంలో ప్రజా ప్రతినిధులుగా పనిచేసిన వారి పోరాట ఫలితంగా 200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. ప్రస్తుత శాసనసభ్యులు వైద్యుడు అయినప్పటికీ ప్రభుత్వ ఆసుపత్రి పై ప్రేమ లేదని రవికుమార్ ఆరోపించారు. ఆసుపత్రి పరిస్థితి ఇలానే కొనసాగితే రానున్న రోజుల్లో ప్రజా ఉద్యమాలు తప్పవని రవికుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు సున్నం గంగ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రం శెట్టి వెంకట రామారావు పారేల్లి సంతోష్ కుమార్ డి సీతాలక్ష్మి 20వ వార్డు నెంబర్ ఇరప అనసూర్య పట్టణ నాయకులు కొలగాని రమేష్ నాదెండ్ల లీలావతి కుంజా శ్రీనివాస్ చాట్ల శ్రీనివాస్ కనక శ్రీ కొరడా శ్రీనివాస్ ధనకొండ రాఘవయ్య నాగరాజు గౌతమి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండ జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నాం

## రైతు సంక్షేమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం
## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో, జూన్ 10,(విజన్ ఆంధ్ర)నీటిపారుదల,రహదారులు, వ్యవసాయం ఇలా అన్ని రంగాల్లో నల్గొండ జిల్లాను అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.రైతు సంక్షేమం ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం రైతుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు.బుధవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయం ఇందిరా భవన్‌లో జిల్లా అధికారులతో సాగునీటి ప్రాజెక్టులు,రహదారులు,ధాన్యం సేకరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.**సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి.**నల్గొండ జిల్లా అంతటికి సాగునీరు అందించి జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.అందుకోనవే ఏఎంఆర్పీ కాలువల లైనింగ్,బ్రాహ్మణవెల్లెముల,ఎస్ఎల్‌బీసీ సొరంగం వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు.బ్రాహ్మణవెల్లెముల ప్రాజెక్టు కింద పెండింగ్‌లో ఉన్న మైనర్లు,సబ్ మైనర్లపై ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.నార్కెట్‌పల్లి మండలం కొండపాకోని గూడెంలో ఒక రైతు పొలంలో 40 మీటర్ల మేర కాలువ పనులు ఆగిపోయిన విషయం అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా,జిల్లా కలెక్టర్ నిధుల నుంచి రైతుకు నష్టపరిహారం మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని మంత్రి అక్కడికక్కడే ఆదేశించారు.కొండపాకోని గూడెం చెరువు నిండితే దోమలపల్లి చెరువు నిండుతుందని,దీంతో ఇతర చెరువులు నింపుకునేందుకు అవకాశం ఉంటుందని,మండలంలోని అన్ని గ్రామాలకు సాగునీరు అందుతుందని అన్నారు.ధాన్యం సేకరణలో నల్గొండ నంబర్ వన్...ధాన్యం సేకరణలో నల్గొండ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడం పట్ల మంత్రి జిల్లా కలెక్టర్‌ను అభినందించారు. జిల్లాలో గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో ధాన్యం పండిందని తెలిపారు.అయితే ప్రతి సీజన్‌లో రైతులు వరినే పండించకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.పంట మార్పిడిపై అధికారులతో పాటు మహిళా సంఘాలు కూడా అవగాహన కల్పించాలని సూచించారు.రహదారులపై తక్షణ చర్యలు...ఆర్అండ్‌బీ రహదారులపై సమీక్ష సందర్భంగా నార్కెట్‌పల్లి వద్ద ఆర్వోబీ పనులు చేపట్టేందుకు తక్షణమే చర్యలు సుకోవాలని ఆదేశించారు. మిగిలిపోయిన భూసేకరణకు సంబంధించి చెల్లింపులు చేసి పీఎన్ జారీ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు.పనులు వేగవంతం చేసేందుకు కలెక్టర్ వద్ద ఉన్న నిధులను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి,పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్ రెడ్డి,ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పిచ్చయ్య,పౌర సరఫరాల డీఎం రామ్‌పతి నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## దేశ చరిత్రలో మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం కొత్త దిశ నిర్దేశించింది - మంత్రి పొన్నం ప్రభాకర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధిజూన్ 10:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా, వారిని ఆర్టీసీ బస్సుల యజమానులుగా తీర్చిదిద్దిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని మంత్రి పేర్కొన్నారు. మహిళా శక్తి పథకం కింద మండల మహిళా సమాఖ్యలు తమ సొంత నిధులైన రూ.199.08 కోట్ల పెట్టుబడితో 553 ఎ+టూ=ఇజ బస్సులను కొనుగోలు చేసి సంస్థకు అద్దెకు ఇవ్వడం మహిళల ఆర్థిక స్వావలంబనకు, సమిష్టి శక్తికి ప్రతీకగా నిలిచిందన్నారు.ఒకప్పుడు రుణాల కోసం ఎదురుచూసిన స్వయం సహాయక సంఘాల మహిళలు నేడు ఆస్తుల యజమానులుగా, పెట్టుబడిదారులుగా ఎదగడం తెలంగాణ ప్రభుత్వ మహిళా సాధికారత విధానాలకు నిదర్శనమని మంత్రి తెలిపారు. ఒక్కో బస్సుకు నెలకు రూ.69,468 అద్దె లభిస్తుండగా, మొత్తం 553 బస్సుల ద్వారా ప్రతి నెల రూ.3.84 కోట్ల ఆదాయం మహిళా సమాఖ్యలకు అందుతోందన్నారు. ఇప్పటివరకు రూ.20.34 కోట్ల అద్దె ఆదాయం మహిళా సంఘాలకు చేరడం ఈ పథకం విజయాన్ని స్పష్టంగా చాటుతోందని చెప్పారు.ఈ కార్యక్రమం ద్వారా మహిళలు కేవలం లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములు, ఆస్తుల యజమానులు, ఆదాయ సృష్టికర్తలుగా మారుతున్నారని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కూడా ఈ పథకం ఎంతో దోహదపడుతోందన్నారు.అదేవిధంగా మహాలక్ష్మి పథకం విజయవంతమైన అమలులో ఈ బస్సులు కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఇప్పటివరకు 315 కోట్లకు పైగా మహిళా ప్రయాణికులు లబ్ధి పొందారని చెప్పారు. ఈ పథకం ద్వారా మహిళలు సుమారు రూ.10,950 కోట్ల ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకోగలిగారని పేర్కొన్నారు.మహిళలు ఆదా చేసుకున్న ఈ మొత్తాన్ని కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, ఆరోగ్యం, స్వయం ఉపాధి మరియు చిన్న వ్యాపారాల కోసం వినియోగిస్తున్నారని మంత్రి వివరించారు. మహిళల చేతిలో మిగిలే ప్రతి రూపాయి కుటుంబ అభివృద్ధికి, సమాజ పురోగతికిదోహదపడుతుందని అన్నారు.ఉమ్మడి మెదక్ జిల్లాలోని మహిళా సమాఖ్యలకు మొత్తం 61 బస్సులు కేటాయించబడినట్లు మంత్రి తెలిపారు. ఇందులో మెదక్ జిల్లాకు 20, సిద్దిపేట జిల్లాకు 23, సంగారెడ్డి జిల్లాకు 25 బస్సులు కేటాయించామని చెప్పారు. దీంతో ఆయా జిల్లాల్లో బస్సుల కొరత తగ్గి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందడంతో పాటు మహిళా సంఘాలు స్థిరమైన ఆదాయ వనరును పొందనున్నాయని మంత్రి పేర్కొన్నారు.మహిళలను లబ్ధిదారుల నుంచి యజమానులుగా, భాగస్వాములుగా తీర్చిదిద్దడం తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం. మహిళా శక్తి పథకం ఆ దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే విప్లవాత్మక కార్యక్రమం అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

## కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కర్కపట్ల అవగాహన సదస్సు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి 10 జూన్ తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టాత్మక కార్యక్రమం “ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు“ ను పురస్కరించుకొని, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాలోని ములుగు మండలం కరకపట్ల ఇండస్ట్రియల్ ఏరియాలో 21 ఇండస్ట్రీస్ రిప్రజెంటేట్స్ మరియు ఎంటర్ప్రెన్యూస్ లతో ఎన్విరాన్మెంటల్ అవేర్నెస్ మరియు ప్లాస్టిక్ ఫ్రీ కంపేస్ ఇంటరాక్షన్ విత్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్స్ కామర్స్ మరియు ఇండస్ట్రీస్ సింగిల్ యూస్ ప్లాస్టిక్ ఉపయోగించడం వలన దాని అనర్థాలు మరియు ఆల్టర్నేటివ్ ఎన్విరాన్మెంటల్ ఐటమ్స్ గూర్చి వర్క్ షాప్ జరిపించడం జరిగిఈ వర్క్ షాప్ లో కాలుష్య నియంత్రణ మండలి సహాయ పర్యావరణ శాస్త్రవేత్త పి.రవీందర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా వెలిగి భావితరాలకు మంచి గాలి నీరు నేలని పర్యావరణాన్ని అందించాలని ప్లాస్టిక్ ఫ్రీ పర్యావరణాన్ని భావితరాలకు అందించాలని తెలియజేశారు. అలాగే సింగిల్ ఈజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను క్లుప్తంగా వివరించారు ఇండస్ట్రీ అసోసియే రిప్రజెంటేషన్ కూడా మాట్లాడుతూ తాముపర్యావరణహితమైన కార్యక్రమాలు పద్ధతుల ఒలంపిస్తామని తెలియజేస్తూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా ప్లాస్టిక్ బ్యాగులకు బదులు నార సంచులు, బట్ట సంచులు మరియు క్లే పాత్రలు, గ్లాసెస్, వుడెన్, స్పూన్స్ ఉపయోగిస్తామని తద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడతామని తెలియజేశారు.

# సి సి కెమెరాల ద్వారా ప్రమాదాలు, నేరాల నియంత్రణ

## రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 10,(విజన్ ఆంధ్ర)సి సి కెమెరాల ఏర్పాటు ద్వారా ప్రమాదాలు, నేరాలను నియంత్రించవచ్చని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని భీమారం మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సి సి కెమెరాలను రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, డి సి పి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జైపూర్ ఎ సి పి వెంకటేశ్వర్లు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ఒక సి సి కెమెరా 100 పోలీసులతో సమానంగా విషయాలను గ్రహిస్తుందని, ప్రతి అంశాన్ని భద్రపరుస్తుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో, నేరాల నియంత్రణలో సి సి కెమెరాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, హెల్మెట్/ సీట్ బెల్ట్ ధరించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవడమే కాకుండా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. రహదారి ప్రమాదాల నియంత్రణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, స్వచ్ఛందంగా నిబంధనలు పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని, రక్షణ సూత్రాలు పాటించాలని తెలిపారు. భీమారంలో మాత్రమే కాకుండా చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో సి సి కెమెరాల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంతకుముందు పోలీస్ స్టేషన్ ఆవరణలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా మొక్కలు నాటారు. మొక్కలు నాటి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలని, మాదకద్రవ్యాల విక్రయం, రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుని యువత భవిష్యత్తును కాపాడేందుకు అందరూ ముందుకు రావాలని తెలిపారు.అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ సభ కార్యక్రమానికి రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, డి సి పి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, గ్రామ సర్పంచ్ విజయలక్ష్మిలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని, మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి దిశగా ప్రభుత్వం వివిధ వ్యాపార రంగాలలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం జరుగుతుందని, ఈ క్రమంలో మహిళా సమాఖ్య సభ్యులకు మండలానికి ఒకటి చొప్పున ఆర్ టి సి బస్సులు అందజేయడం జరిగిందని తెలిపారు. వ్యాపార అభివృద్ధి కొరకు వడ్డీ లేని రుణాలు, బ్యాంకు లింకేజీ రుణాలు అందించి తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళను ఇంటి పెద్దగా గుర్తిస్తూ ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరుగుతుందని, మొదటి విడతలో చెన్నూర్ నియోజకవర్గానికి 3 వేల 500 ఇండ్లు కేటాయించడం జరిగిందని, 2వ విడతలో 2వేల ఇండ్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డుల ద్వారా ప్రతి ఒక్కరికి సన్న బియ్యం, అర్హులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల మందికి పెన్షన్లు అందించేందుకు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా యువతకు వివిధ వృత్తి విద్య కోర్సులలో నైపుణ్యాలు పెంపొందించి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజల సంక్షేమం దిశగా చర్యలు తీసుకుంటున్నామని, ఈ క్రమంలో చెన్నూర్ లో 100 పడకల ఆసుపత్రి త్వరలో ప్రారంభించబోతున్నామని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా చెన్నూర్ నియోజకవర్గంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో త్వరలో స్టేడియం, నర్సింగ్ కాలేజ్ మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని,, ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని, సి సి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి ఒక్కరు జాగ్రత్తగా వ్యవహరించాలని, పోలీసు శాఖ వారికి సహకరించాలని తెలిపారు. అనంతరం రోడ్డు భద్రత నియమాలపై కార్యక్రమానికి హాజరైన ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు.రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని, మైనర్లు వాహనాల నడపకూడదని తెలిపారు.జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పారిశుధ్య కార్యక్రమాలలో ప్రజలు భాగస్వాములై పారిశుధ్య నిర్వహణకు సహకరించాలని తెలిపారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తుందని, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు, సన్న బియ్యం, మహిళా సంఘాలకు ఆర్ టి సి బస్సులు అందించడంతో పాటు రైతుల సంక్షేమంలో భాగంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగంగా చేపట్టడం జరిగిందని తెలిపారు.అనంతరం మండలానికి చెందిన 28 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలం వరదలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



నిర్మల్ జిల్లా,జూన్ 10,(విజన్ ఆంధ్ర); నిర్మల్ పట్టణంలో వర్షాకాలం భారీ వర్షాలు కురిసినప్పుడు రోడ్లపై నీరు నిలువ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పట్టణంలో గతంలో వర్షాలు కురిసి నీటిమయమైన శివాజీ చౌక్ మంచిర్యాల చౌరస్తా, విశ్వనాథ్ పేట్, సిద్దాపూర్ వాగు ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ వర్షాకాలంలో పట్టణంలో ఎక్కడ కూడా రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండరాదని పేర్కొన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అధికారులు వర్షాకాలం పూర్తయ్యేంతవరకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పట్టణ ప్రజలకు వరద నీటి వల్ల ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. డ్రైనేజీలు, నాళాలు పరిశీలించారు. ఎప్పటికప్పుడు పూడికలు తీసివేస్తూ నీటి ప్రవాహానికి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మహిళల స్వయం ఉపాధి కోర్సుల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం..

**- ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ విజయ్ కుమార్**



మక్తల్, జూన్ 10 ( విజన్ ఆంధ్ర ) మఖ్తల్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న సెట్విన్ - సాంకేతిక శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధి కోసం వివిధ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఆసక్తి ఉన్న యువతులు, మహిళలు సెట్విన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ విజయ్ కుమార్ సూచించారు. సెట్విన్ లో టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్ జర్దోసి, కంప్యూటర్ ట్రైనింగ్ విభాగాల్లో శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. టెన్త్ క్లాస్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో ఆఫీసుకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరోవైపు ఇప్పటికే తొలి బ్యాచ్ శిక్షణ పూర్తి కావచ్చిందని, పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్ లను మంత్రి వాకిటి శ్రీహరి గారి చేతుల మీదుగా అందిస్తామని చెప్పారు. కంప్యూటర్ ట్రైనర్ గా తిమ్మప్ప, బ్యూటీషియన్ ట్రైనర్ గా స్వప్న, టైలరింగ్ ట్రైనర్ గా ఫర్జానా, మగ్గం వర్క్ జర్దోసి ట్రైనర్ గా వీరమ్మ శిక్షణ అందిస్తారని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అక్రిడిటేషన్ కార్డుల పేరుతో వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా,జూన్ 10,(విజన్ ఆంధ్ర); జిల్లాలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందని, ఈ కార్డుల పేరుతో ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రిడిటేషన్ కార్డులు ఇప్పిస్తామంటూ కొందరు వ్యక్తులు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇది తీవ్రమైన అంశమని పేర్కొంటూ, ప్రభుత్వం ఉచితంగా జారీ చేసే అక్రిడిటేషన్ కార్డుల కోసం ఎవరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే సంబంధిత జిల్లా పౌరసంబంధాల అధికారి (డీపీఆర్వో)కి లేదా నేరుగా తమకు సమాచారం అందించాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, అక్రమాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు అందజేస్తామని, దళారులను నమ్మి మోసపోవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## ఎస్ఐఆర్-2002 ఓటర్ల మ్యాపింగ్‌ను విజయవంతం చేయాలి

**- లిజిల్లా కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 10,( విజన్ ఆంధ్ర) ఎస్ఐఆర్–2002 ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో జిల్లా ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. తాను కూడా తన ఓటును ఎస్ఐఆర్–2002 ఎలక్టోరల్ రోల్‌కు విజయవంతంగా మ్యాపింగ్ చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2002లో నిర్వహించిన ప్రత్యేక సర్వే (ఎస్ఐఆర్) సమయంలో తనకు ఓటు హక్కు లేకపోవడంతో, అప్పట్లో బీహార్‌లో నమోదైన తన తండ్రి ఓటరు వివరాలను కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోని 'సెర్చ్ బై ఎలెక్టర్ నేమ్' సదుపాయం ద్వారా కేవలం ఐదు ప్రాథమిక వివరాలు నమోదు చేసి సులభంగా గుర్తించానన్నారు. అనంతరం బీఎల్ఓ యాప్ ద్వారా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసినట్లు వివరించారు. ఈ ప్రక్రియ చాలా సులభమని, తెలంగాణలో పాత ఓటరు నమోదు ఉన్నవారు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్ ద్వారా కూడా ఎస్ఐఆర్–2002 వివరాలను తెలుసుకోవచ్చని సూచించారు. ముఖ్యంగా ఆదిలాబాద్ పట్టణం, మావల ప్రాంతాల ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటర్ల మ్యాపింగ్‌కు ఈ నెల 24 వరకు గడువు ఉందని, అనంతరం జూన్ 25 నుంచి బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసే ప్రక్రియ చేపడతారని తెలిపారు. గడువులోపు అర్హులైన ప్రతి ఓటరు తన వివరాలను మ్యాపింగ్ చేసుకొని ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## డీజీపీ సి. వి .ఆనంద్ ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే పాయల్ శంకర్



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 10, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్ ని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీజీపీ సి.వి. ఆనంద్ కి హృదయపూర్వక అభినందనలు తెలియజేసి, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా శాంతి భద్రతల పరిరక్షణ, పోలీసు శాఖ అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. అలాగే ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై డీజీపీ తో ఎమ్మెల్యే సంక్షిప్తంగా చర్చించారు. జిల్లా ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలకు తమ పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాల కొరకు లక్కీడ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక



నిర్మల్ జిల్లా,జూన్ 10,(విజన్ ఆంధ్ర); జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ కార్యక్రమంలో భాగంగా ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య ప్రవేశాల కొరకు విద్యార్థులను బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అధికారులతో కలిసి లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వెనకబడిన కులాల విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ లో ఉచిత ప్రవేశ సౌకర్యాన్ని కల్పించిందని అన్నారు. లక్కీ డ్రా లో ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని చక్కగా చదువుకొని, ఉన్నతంగా నిలవాలని ఆకాంక్షించారు. లక్కీ డ్రా లో ఎంపిక కాని వారు నిరాశ చెందవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఓ భోజన్న, సహాయ జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి డి. లత, పోషకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బడి బస్సుల భద్రతపై రవాణా శాఖ అధికారుల కొరడా...!

- ఫిట్నెస్ లేని 13 బస్సులు సీజ్ చేసిన అధికారులు
- ఈ నెల 15 వరకు స్పెషల్ డ్రైవ్...
- పిల్లల భవిష్యత్తుతో ఆటలాడితే ఉపేక్షించేది లేదు..!
- జిల్లా రవాణా శాఖ అధికారి గోపి కృష్ణ

### బడి బస్సుల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక కథనం...




మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 10 (విజన్ ఆంధ్ర ) : మరో వారం రోజుల్లో బడులు తెరుచుకొనున్నాయి, ఇప్పటికే ఆయా బడుల యాజమాన్యాలు విద్యార్థులను పేరెంట్స్ ను ఆకట్టుకునేందుకు బడులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. బడులకు వెళ్లే విద్యార్థుల భవిష్యత్తు ఎంత ముఖ్యమో ఆయా బడుల బస్సుల భద్రత కూడా అంతే ముఖ్యం. బడికి వెళ్లే పిల్లలను బడులకు తరలించే బస్సులు అన్నివిధాల ఫిట్ గా ఉంటేనే, సురక్షితంగా బడులకు వెళ్లొస్తుంటారు. కానీ, జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల బస్సులు ఎంతమేర భద్రంగా ఉన్నాయనేదే అందరికి ప్రశ్నార్థకంగానే మిగిలిందని చెప్పాలి. ఎందుకంటే గతంలో జరిగిన ప్రమాదాలే అందుకు నిదర్శనమని చెప్పకనే చెప్పాలి. అయినా అనేక బడులు బస్సుల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తూనే ఉన్నాయనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. రవాణ శాఖ అధికారులు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించినా, పెద్దగా ఫలితం ఉండటం లేదనే విమర్శలు వస్తున్నాయి. బడులు ప్రారంభ నేపథ్యంలో రవాణా శాఖ అధికారుల సామర్థ్య పరీక్షలు ఎలా ఉన్నాయి? ఫిట్‌నెస్ లేని బస్సులపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోనున్నారు. తదితర అంశాలు తెలుసుకుందాం..

బస్సులు భద్రంగా ఉంటేనే పిల్లలు క్షేమంగా బడికి వెళ్లి తిరిగి ఇంటికి చేరుతారు. కానీ, బస్సుల భద్రతపై ఎప్పుడూ సందేహమే. ప్రతి ఏడాది బడుల ప్రారంభ సమయంలో ఇదో పెద్ద సమస్య గా మరిందనే చెప్పాలి. రవాణాశాఖ అధికారులు సైతం బడుల ప్రారంభ సమయంలోనే జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, బస్సుల సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో బస్సుల ఫిట్‌నెస్ అంశాలను పరిశీలిస్తే జిల్లా వ్యాప్తంగా 375 ప్రవేటు బడుల బస్సులు ఉన్నాయి. వీటిలో ఇప్పటివరకు సుమారు 285 బస్సులకు మాత్రమే సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో పూర్తిగా పనికి రాని 13 డొక్కు బస్సులు ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలు పొందనేలేదని చెప్పాలి.

#### పూర్తికాని బస్సులకు ఫిట్‌నెస్ తనిఖీలు..

ఇంకా సుమారు 90 కి పైగ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయాల్సి ఉంది. ఒక వాహనం జీవితకాలం 15 సంవత్సరాలు. ఆ తర్వాత తుక్కుగా మార్చాలి. కానీ, పలు బడుల యాజమాన్యాలు కాలం చెల్లిన డొక్కు బస్సులకు తాత్కాలిక మరమ్మత్తులు చేయించి వాటిని నడిపిస్తూ పిల్లల భద్రతతో చెలగాటం ఆడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వాటికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని అధికారులు చెబుతున్నారు. కానీ, వాటిని రోడ్లపై తిరగకుండా ఆపేందుకు కఠిన చర్యలు తీసుకోవడం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సామర్థ్య పరీక్షలకు బడుల యాజమాన్యాలు తమ బస్సుల్ని రవాణాశాఖ



కార్యాలయాలకు పంపిస్తున్నాయి. వచ్చిన బస్సులకు రవాణాశాఖ అధికారులు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. కొన్నింట్లో భూతద్దం పెట్టి వెతికినా ప్రథమ చికిత్స కిట్లు కనిపించవు, సామర్థ్య పరీక్షలో పాసైనట్లు అధికారులు ధ్రువీకరిస్తున్న 90 శాతం బస్సుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కొత్తగా కొనుగోలు చేసిన వాటిలో మాత్రమే ప్రథమ చికిత్సకిట్లు ఉంటున్నాయి. జిల్లాలోనే 15 ఏళ్లు దాటిన డొక్కు బస్సులు 13 ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

#### యాజమాన్యాలకు నోటీసులు...

రవాణాశాఖ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాల్లో డొక్కు బస్సులు తిరుగుతున్నట్లు తెలుస్తుంది. జిల్లాలో 375 విద్యాసంస్థల బస్సులు ఉంటే ధ్రువీకరణ పత్రం పొందినవి ఇప్పటికి 285 బస్సులు మాత్రమే.మరి కొన్ని బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ నిరాకరిస్తూ యాజమాన్యాలకు రవాణా శాఖ అధికారులు నోటీసులిచ్చారు. మిగిలిన బస్సులకు వారం రోజుల్లో పరీక్షలు పూర్తిచేయాలి. కాగా విద్యాసంస్థల బస్సులకు ఈనెల 10 తేదీ నుంచి ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని నిర్ణయించినట్లు రవాణాశాఖ అధికారులు తెలిపారు. ఫిట్‌నెస్ లేకుండా రోడ్డు ఎక్కే వాటిని తనిఖీ చేసి భారీ మొత్తంలో జరిమానా విధిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే ఏటా బడుల ప్రారంభంలో మాత్రమే బడి బస్సుల ఫిట్‌నెస్‌లపై అధికారులు హడావుడి చేస్తున్నారు. ఆ తర్వాత వదిలేస్తున్నారు. మరి ఈసారి రవాణాశాఖ అధికారులు నిబంధనలు ఏవిధంగా అమలుచేస్తారో వేచిచూడాల్సిందే.

#### ఈనెల 15 వరకు ప్రత్యేక డ్రైవ్, బడుల యాజమాన్యాలు సహకరించాలి



జిల్లాలో ఆయా బడుల యాజమా న్యాలు బడి బస్సుల ఫిట్నెస్ తప్పని సరిగా చేయిం చాలని, ఫిట్నెస్ లేని బస్సులు రోడ్డెక్కితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాము. ఈనెల 15 లోపు బస్సుల ఫిట్నెస్ కు యాజమాన్యాలు సహకరించాలి. అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ లచే ప్రత్యేక తనిఖీలు చేపట్టానున్నాం. పై పై మెరుగులు దిద్దినా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి, క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ధ్రువీకరణ పత్రం అందజేస్తాం. ఫిట్నెస్ లేని బస్సులను రోడ్డెక్కనివ్వం. అంతే కాకుండా బడుల యాజమాన్యాలు విద్యార్థులను ఆటోల్లో, టాటా ఎస్ వాహనాల్లో తరలించడం, బస్సుల్లో సమర్థ్యం కంటే ఎక్కువ మందిని తరలించిన చర్యలు తప్పవు.

**-: జిల్లా రవాణా శాఖ అధికారి గోపి వెల్ది**

# ప్రజలకు చేరువగా పోలీసింగ్ ఉండాలి

**- డీజీపీ సి.వి. ఆనంద్**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 10, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా లిరాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్‌లి జిల్లా ఏఆర్ హెడ్ క్వార్టర్స్ సమావేశంలో జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు శాఖ పనితీరు, ఆస్తి సంబంధిత నేరాలు, నేరాల నివారణ చర్యలు, సైబర్ నేరాల నియంత్రణ, పెట్రోలింగ్ వ్యవస్థ, రోడ్డు ప్రమాదాల నివారణ, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల నియంత్రణ వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, భవిష్యత్తు తరాలను రక్షించేందుకు పాఠశాలలు, కళాశాలలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు, యువతలో అవగాహన పెంచేందుకు యాంటీ నార్కోటిక్స్ అండ్ సేఫ్టీ క్లబ్‌లను ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలో గంజాయి సాగు మరియు నిల్వలను గుర్తించేందుకు డ్రోన్లను వినియోగించాలని, నార్కోటిక్ జాగిలాలతో తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పిస్తూ సైబర్ మోసాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. పోలీసు వ్యవస్థ 24 గంటలు అప్రమత్తంగా, ప్రజలకు అందుబాటులో ఉండే వ్యవస్థ అని పేర్కొన్న డీజీపీ, ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు ఎలాంటి ఇతర కార్యక్రమాలు నిర్వహించకుండా అధికారులు తమ కార్యాలయాలలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆ సమయంలో ప్రజలు మరియు పోలీసు సిబ్బంది వినతులు, సమస్యలను స్వీకరించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా నేరాల ఛేదనలో పోలీసు జాగిలాల సేవలను సమర్థవంతంగా వినియోగించాలని, నిందితుల గుర్తింపు మరియు కీలక ఆధారాల సేకరణలో వాటి పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్లలో సీసీటీఎన్ఎస్ ( క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ అండ్ సిస్టమ్స్ ) వివరాలను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. నేరాల దర్యాప్తు, నేరస్తుల గుర్తింపు, సమాచార సేకరణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. అన్ని బందోబస్తు విధుల్లో లాఠీలను తప్పనిసరిగా వినియోగించాలని, విధుల నిర్వహణలో అప్రమత్తత, క్రమశిక్షణ పాటించాలని సూచించారు. పోలీసు వ్యవస్థకు మంచి పేరు తీసుకువచ్చే విధంగా నిజాయితీతో విధులు నిర్వహించాలని, ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణ కోసం నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. పత్రికా సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా పోలీసుల పనితీరును అభినందిస్తూ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ, సీఐడీ, ఏసీబీ డీజీ చారు సిన్హా , నార్కోటిక్స్ ఇన్‌చార్జ్ సందీప్ శాండిల్య, మల్టీజోన్–1 ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ , అదనపు ఎస్పీ (అడ్మిన్) పి. మౌనిక , ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే , ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, పట్టణ సీఐ బి. సునీల్ కుమార్, ఇతర పోలీసు అధికారులు, ఎస్‌హెచ్‌వోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నిజామాబాద్ అర్బన్ బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణ శిబిరం



నిజామాబాద్ జూన్ 10:(విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలో అమ్మ వెంచర్లోని ఎస్ఆర్కే కన్వెన్షన్ నందు నిజామాబాద్ కార్పొరేషన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణ శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శిక్షణ శిబిరం శిక్షకులు మహేష్ కొనగల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నుండి బూత్ లెవెల్ ఏజెంట్లు నియమించిన ప్రతి ఒక్కరు ఈనెల 25వ తేదీ నుండి జరిగే ప్రత్యేక ఓటరు సవరణ సర్వేలో ప్రత్యేక దృష్టి పెట్టి నెల రోజులపాటు ఎక్కడ అవకతవకలు జరగకుండా చూసుకోవాలని, ఎందుకంటే బిజెపి ప్రభుత్వం ఎక్కడైతే కాంగ్రెస్ పార్టీకి అనుకూలమైన ఓట్లు ఉంటాయో సెక్యులర్ ఓట్లు ఉంటాయో వాటిని తొలగించే ప్రయత్నం చేస్తున్నారని, కేంద్ర ఎన్నికల కమిషన్ బిజెపి ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తుందని, ఇటీవల జరిగిన పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో కూడా సర్వే నిర్వహించి బిజెపి వ్యతిరేక ఓట్లను తొలగించిందని దాదాపు 90 లక్షల ఓట్లను తొలగించిందని అందుకే అక్కడ బిజెపి అధికారంలోకి రావడం జరిగిందని, అదేవిధంగా తమిళనాడు బీహార్ రాష్ట్రాలలో కూడా ఓట్లు తొలగించిందని, ఇప్పుడు బిజెపి తెలంగాణపై దృష్టి పెట్టిందని మళ్లీ వచ్చే ఎన్నికల్లో రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహేష్ కుమార్ గౌడ్ సారాధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని గమనించి తెలంగాణలో కూడా కాంగ్రెస్ అనుకూల ఓట్లను తొలగించడానికి బిజెపి ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకొని కుట్రలు చేస్తుందని ఆయన అన్నారు. కావున ప్రతి ఒక్కరూ తమ బూత్ లలో ఓట్లు అవకతవకలు జరగకుండా చూడాలని సర్వేలో భాగంగా ప్రతి బిఎల్ఓ ప్రతి ఇంటికి మూడుసార్లు సందర్శించాల్సి ఉంటుందని, కానీ వారు ఒకసారి సందర్శించి ఇంట్లో లేరు అని సాకుతో ఓటర్లు తొలగించే ప్రయత్నం చేస్తారని, కానీ మీరు బిఎల్ఓ వెంటనే ఉంటూ అన్ని గమనించాలని, సందర్శించిన ప్రతి ఇంటికి ప్రతి ఓటరుకు ఏన్యుమరేషన్ ఫామ్ నింపాల్సి ఉంటుందని, దానికి మీరు రసీదు తీసుకోవాలని ఎవరి పేరు అయినా 2002 జాబితా ప్రకారం ఓటర్ లిస్టులో లేకుంటే ఫామ్ 6 ద్వారా వారిని అందులో జత చేయాలని, ఒకవేళ ఎవరైనా చనిపోతే డూప్లికేట్ ఉంటే ఫార్మ్ 7 ద్వారా అందులో నుంచి తొలగించాలని చేయాలని, ఏదైనా ఇంటి నెంబర్ గానీ ఇంటిపేరు గాని మార్పు ఉంటే ఫార్మ్ 8 ద్వారా సవరణ చేయాలని ఆయన తెలిపారు. సర్వేలో దీూా పాత్ర కీలకమైనదని మీరు అశ్రద్ధగా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం, మీ కార్పొరేటర్, మీ ఎమ్మెల్యే ఓడిపోయే అవకాశాలు ఉంటాయని, కావున ప్రతి బిఎల్ఏ తమకు ఇచ్చిన బాధ్యతను నిబద్ధతతో చేయాలని మహేష్ అన్నారు. ఈ సందర్భంగా దీూా లకు సర్వేలో చేయాల్సిన పనుల గురించి, సర్వే ఏవిధంగా కొనసాగుతుందో అని దానిపై పూర్తిగా వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నగేష్ రెడ్డి,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్, మేయర్ ఉమారాణి, రాష్ట్ర రైతు కమిషన్ మెంబెర్ గడుగు గంగాధర్, రాష్ట్ర కళ్ళు గీతా కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, నూడా చైర్మన్ కేశ వేణు,రాష్ట్ర మహిళా సంక్షేమ చైర్మన్ కవిత రెడ్డి, సీనియర్ నాయకులు రత్నాకర్, జావీద్ అక్రమ్, ఏఐసీసీ కో ఆర్డినేటర్ గన్ రాజ్,మాజీ టీపీకోకార్యదర్శి సుమన్,జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్ ,డిసిసి కార్పొరేషన్ కోశాధికారి శివ ప్రసాద్, ఉపాధ్యక్షులు అంతరెడ్డి విజపాల్ రెడ్డి, సలీం,కో ఆప్షన్ మెంబెర్ నరేంద్ర సింగ్, కార్పొరేటర్లు మనోహర్, ప్రవీణ్ యాదవ్, నరేందర్, అన్వార్, ఎర్రం గంగాధర్ మరియు డివిజన్ ఇంచార్జ్ లు, కార్యవర్గ సభ్యులు, బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## ములుగు బస్టాండ్‌లో ప్రయాణికుల అవస్థలు



ములుగు, జూన్ 10, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఎండలు భగభగ మండుతుండగా ములుగు జిల్లా బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్టాండ్‌లో నీడ లేకపోవడం, తాగునీటి సదుపాయం లేకపోవడంతో జనం ఎండకు విలవిలలాడుతున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రంగా ఉంటోంది. ఈ సమయంలో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు చెట్ల కింద, గోడల నీడ పట్టుకుని నిలబడాల్సి వస్తోంది. వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలు ఎండ వేడికి సొమ్మసిల్లి పడిపోతున్నారు. నిలబడటమే కష్టంగా మారింది. తాగునీటి మంచి నీటి సదుపాయం లేక ఉండటంతో చల్లని నీటి కోసం ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు. రోజూ వేలాది మంది ప్రయాణికులు హైదరాబాద్, వరంగల్, భద్రాద్రి, మహబూబాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ములుగు బస్టాండ్‌ను వినియోగిస్తున్నారు. ఎండాకాలం మొదలై నెల రోజులు దాటినా అధికారులు స్పందించకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "బస్టాండ్‌లో ఒక్క మంచి షెడ్ లేదు, నీళ్లు లేవు. ఎండకు తట్టుకోలేక బస్సు రాగానే ఎక్కేస్తున్నాం" అని ఓ ప్రయాణికురాలు వాపోయింది. తక్షణమే తాగునీటి ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు జిల్లా అధికారులను కోరుతున్నారు.

## ములుగు శివాలయంలో మోడీకి ప్రత్యేక పూజలు

**- 12 ఏళ్ల పాలనకు అభినందనలు తెలిపిన బీజేపీ శ్రేణులు**




ములుగు, జూన్ 10;విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రధాని నరేంద్ర మోడీ 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ములుగు కేంద్ర శివాలయంలో మండల అధ్యక్షులు లిరాయంచు నాగరాజులి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోడీ జీ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని శివుడికి అర్చన చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని కూడా ప్రార్థించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అల్లె శోభన్ మాట్లాడుతూ... మోడీ జీ గుజరాత్‌ను మోడల్ రాష్ట్రంగా, భారత్ ను ప్రపంచంలో గొప్ప స్థానంలో నిలబెట్టారని అన్నారు. కరోనా సమయంలో టీకాలు వేయించి ప్రజలను కాపాడారని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో డబల్ ఇంజన్ సర్కారు కోసం కార్యకర్తలు కష్టపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి గంగిశెట్టి రాజ్‌కుమార్, కార్యాలయ కార్యదర్శి సూర్యదేవర విశ్వనాథ్, జిల్లా నాయకులు ఎల్కతుర్తి శ్రీహరి, దొంతి రెడ్డి రవి రెడ్డి, కన్నోజు సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## చేప ప్రసాదం పంపిణీలో జన సేవా సంఘ్ సేవా శిబిరం

హైదరాబాద్, జూన్ 10 (విజన్ ఆంధ్ర) : మృగశిర కార్తె సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి వచ్చిన భక్తుల కోసం జన సేవా సంఘ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా శిబిరం ఏర్పాటు చేశారు. జూన్ 8, 9 తేదీల్లో నిర్వహించిన ఈ శిబిరంలో పౌష్టికాహారం, పండ్లు, ఖిచిడీ, స్వచ్ఛమైన తాగునీటిని పంపిణీ చేయడంతో పాటు చేప ప్రసాదంపై అవగాహన కరపత్రాలను అందజేశారు. సంఘం కోశాధికారి సుశీల్ శ్రీవాస్తవ మాట్లాడుతూ మెడికల్ కమిటీ కన్వీనర్ సీతారామ్ ఠాకూర్ నేతృత్వంలో నిర్వహించిన ఈ శిబిరం ద్వారా పెద్ద సంఖ్యలో ప్రజలు లబ్ధి పొందారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీ(జైళ్లు) మహమ్మద్ అహసాన్ రెజా ప్రారంభించగా, వందలాది మంది కార్యకర్తలు సేవా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు.

## అద్భుతంగా అలరించిన “సాంప్రదాయ చెక్క బొమ్మలాట“ ప్రదర్శన



హైదరాబాద్ జూన్ 2026 విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : విజయవంతంగా రవీంద్రభారతి ప్రాంగణం పాల్కురికి సోమన్న మూల వేదికపై నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక కళా రూపాల ప్రదర్శనలలో భాగంగా 69 వ రోజున నిర్వహించిన “చెక్క బొమ్మలాట ప్రదర్శన“ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సోమవారం నాడు ములుగు జిల్లా మోతె శంకర్ బృందం అద్భుతంగా ప్రదర్శించిన “సాంప్రదాయ చెక్క బొమ్మలాట“ ప్రదర్శన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్. ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ, అంతరించిపోతున్న ప్రాచీన జానపద కళలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో సాంస్కృతిక శాఖ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఈ సంధర్భంగా అద్భుతంగా ప్రదర్శించిన చెక్క బొమ్మలాట మోతె శంకర్ బృందం కళాకారులని సాంస్కృతిక శాఖ సిబ్బందితో కలసి ఘనంగా సత్కరించి అభినందించారు. ప్రధాన కార్యక్రమానికి ముందుగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు జానపద, సామాజిక చైతన్య గీతాలతో ప్రేక్షకులను ఉత్సాహ పరిచారు. కార్యక్రమానికి శ్రీనివాస్ రాజు, విద్యానందాచారి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

## శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీని కలిసిన జర్నలిస్టులు

**- జర్నలిస్టుల ఇళ్ల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినందుకు కృతజ్ఞత**



శేరిలింగంపల్లి.జూన్ 10 : (విజన్ ఆంధ్ర) తెలంగాణ పిఎసి చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని బుధవారం శేరిలింగంపల్లి జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిశారు. శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు వివేకానందనగర్ లోని ఎమ్మెల్యే నివాసంలో అరెకపూడి గాంధీని కలిశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినందుకు ఎమ్మెల్యే గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. మియాపూర్ లో జరిగిన బహిరంగ సభలో శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ల సమస్యలను తన ప్రసంగం ద్వారా వినిపించడంతోపాటు భూ కేటాయింపు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రం సమర్పించడంపై జర్నలిస్టు నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. దీంతోపాటు శేరిలింగంపల్లిలో జర్నలిస్టుల సంఖ్య అధికంగా ఉన్న కారణంగా చందానగర్ లో కేటాయించిన ఒక ఎకరా స్థలం పక్కనే ఖాళీగా ఉన్న మరో ఎకరా ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు ఎమ్మెల్యే గాంధీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ విషయమై మరో ఎకరా కేటాయింపు కోసం ప్రభుత్వంతో మరోసారి చర్చించాలని ఎమ్మెల్యే గాంధీని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ జర్నలిస్టుల సొంతింటి కలను సహకారం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. చందానగర్ లో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన ఒక ఎకరం స్థలానికి సర్వే నిర్వహించాలని తహసీల్దార్ కు ఫోన్ చేసి సూచించారు. ఈ భూమి పక్కనే ఉన్న మరో ఎకరా స్థలాన్ని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. గతంలో సబ్ స్టేషన్ కోసం కేటాయించిన సదరు స్థలాన్ని జర్నలిస్టుల ఇళ్ల స్థలాన్ని దృష్టిలో ఉంచుకొని సబ్ స్టేషన్ ను మరో ప్రాంతానికి బదిలీ చేయించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే గాంధీని కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు పైళ్ల విట్టల్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్, ఉపాధ్యక్షుడు గంట్ల రాజిరెడ్డి, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్టు జగన్ రెడ్డి, జర్నలిస్టు నాయకులు శ్రీనివాస్ గౌడ్, అశోక్ యాదవ్,అమృత్ గౌడ్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్, టెంజు అధ్యక్షుడు పి.సాగర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కె.కిషోర్ కుమార్, జర్నలిస్టులు దేవేందర్ తదితరులు ఉన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలి - కాంగ్రెస్



అల్వాల్, జూన్ 10, (విజన్ ఆంధ్ర): పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ అల్వాల్ ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు వీనస్ మేరీ డిమాండ్ చేశారు. పెరుగుతున్న గ్యాస్ పెట్రోల్ మరియు డీజిల్ ధరలకు వ్యతిరేకంగా గురువారం తెలంగాణప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీకి అల్వాల్ లోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నుండి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు వీనస్ మేరి మాట్లాడుతూ..ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వం లోని కేంద్ర ప్రభుత్వం నిత్య వసర వస్తువుల ధరలను పెంచుతూరోజు రోజుకు ప్రజలపై పెనుభారాలు వేస్తుందని విమర్శించారు. ముఖ్యంగా పదే పదే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి పేద ప్రజల నడ్డివిరుస్తుందన్నారు. పెరుగుతున్న ఈ ధరలతో నిత్యవసర సరుకుల ధరలు పెద్ద ఎత్తున పెరిగి ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితుల్లో ఉన్నారని వాపోయారు. ఇకనైనా పెంచిన ధరలను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మేడ్చల్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షు రాలు రాజనోళ్ళ లక్ష్మి ఇచ్చిన పిలుపు మేరకు అల్వాల్ ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు వీనస్ మేరీ ఆధ్వర్యంలో లక్ష్మి, సరోజ, శకుంతల నాయుడు, నిర్మల, భాగ్యలక్ష్మి,సుకన్య,గాయత్రి, విజయలక్ష్మి, శశికళ, అరుణ, విజయ తదితరులు ఈ నిరసన కార్యక్రమానికి తరలి వెళ్లారు.

## భద్రతా నడుమ ఈవీఎంల గోదాం తనిఖీ

**- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 10 (విజన్ ఆంధ్ర) : జిల్లా కేంద్రంలోని ఈవీఎంలు భద్రపరిచిన గోదాము కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. బుధవారం ఆర్డీవో కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాములోని ఈవీఎం లను త్రైమాసిక తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లపై సిబ్బందిని అడిగి తెల్సుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోదాం తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే బుధవారం నాడు గోదాంలోని ఈవీఎంలను త్రైమాసిక తనిఖీ చేసినట్లు చెప్పారు. అనంతరం గోదాం వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ అధికారులు వెంకటేశ్వర్లు, సీ సెక్షన్ సిబ్బంది రాజేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి నుంచి శంకర్, కాంగ్రెస్ నుంచి వేనా చారి, సిపిఎం నుంచి పరమేశ్వర్ చారి, బీజేపీ నుంచి కొమ్ము శ్రీనివాస్, పెద్దిరాజు, బీ ఆర్ ఎస్ నుంచి జమీల్, ఎంఐఎం నుంచి అఫ్సర్, ఇతర అధికారులు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా,జూన్ 10,(విజన్ ఆంధ్ర); కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణతో మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. సిబ్బంది పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికారులు సర్ఫరాజ్, రాజశ్రీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రవణ్, మజార్, హైదర్, మహేష్ రెడ్డి, రమేష్, సుశీల్ కుమార్, నరేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పంట మార్పిడి విధానం పాటించాలి

**- రాష్ట్ర ప్రణాళిక సంఘంఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి**

**- పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి ఉన్నత చదువులు చదివించాలి**

**- ప్రతి ఒక్కరూ ఐదు చెట్లు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలి**

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా జయన్న తిరుమలాపూర్ గ్రామంలో ప్రత్యేక గ్రామ సభ నిర్వహణ**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 10 (విజన్ ఆంధ్ర) : రైతులు ఎప్పుడూ ఒకే పంట వేయకుండా పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని, ఎరువులను కూడా మోతాదుకు మించి వాడకుండా నేలలను సంరక్షించుకునే చర్యలను చేపట్టాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి పేర్కొన్నారు. బుధవారం గోపాల్ పేట మండలం జయన్న తిరుమలాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, బాల్యవివాహాల నిర్మూలన, వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, పంట మార్పిడి, ఎరువుల వాడకం, పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం, జల సంరక్షణ, పాఠశాలల్లో సౌకర్యాలు సహా తదితరాంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రణాళిక అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మొట్టమొదటి గ్రామసభ తిరుమలపురం గ్రామంలోనే నిర్వహించడం జరిగింది, చివరి గ్రామ సభను కూడా మన గ్రామంలోనే నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఇటీవల రెండు రోజులు పాలమూరు జిల్లాలో పర్యటించి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించడం జరిగిందన్నారు. నీటిని అందించడం ద్వారా గ్రామాలను సస్యశ్యామల చేయవచ్చని ఉద్దేశంతో సీఎం చేస్తున్నారన్నారు. కాబట్టి రైతులు వ్యవసాయ రంగంలో మంచి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఎప్పుడూ ఒకే పంట వేయకుండా పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని, ఎరువులను కూడా మోతాదుకు మించి వాడకుండా నేలలను సంరక్షించుకునే చర్యలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించుకోవాలన్నారు. ఎరువులు అత్యధికంగా వినియోగించడం వల్ల భూములలో సారవంతం తగ్గి భవిష్యత్తులో ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. కాబట్టి ఎరువులు మోతాదుకు మించి వినియోగించకుండా జాగ్రత్త పడాలి అన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవడం కోసం ప్రతి ఒక్కరూ 5 చెట్లు నాటాలని సూచించారు. అంతేకాకుండా చెట్లను నరికి వేయడం కూడా ఆపాలని సూచించారు. కరెంటు, నీటిని వృధా చేయకుండా జాగ్రత్త పడాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గ్రామాల్లో మద్యపాన నిషేధాన్ని అమలు పరచాలని, ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఐటిఐ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ వంటి నూతన కోర్సులను అందుబాటులోకి వచ్చిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ద్వారా పేదల సొంతింటి కల నెరవేరుస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మొట్టమొదటి గ్రామసభ తిరుమలపురం గ్రామంలోనే నిర్వహించడం జరిగింది, చివరి గ్రామ సభను కూడా గ్రామంలోనే నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధి హామీ కింద గ్రామస్థులు అందరూ తమ ఇళ్ల వద్ద పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి మంచినీటి సదుపాయాలు కలుగుతాయి అన్నారు. అదేవిధంగా గ్రామంలో గత ఐదేళ్ల వ్యవధిలో 18 ఏళ్ల నుండి 59 ఏళ్లలోపు వ్యక్తులు ఎవరైనా మరణిస్తే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా దరఖాస్తు చేసుకొని రూ. 20 వేల లబ్ధి పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం అర్హులైన ఓటర్లందరినీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తుందని ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని సూచించారు. అమ్మాయిలకు బాల్యవివాహాలు చేయకుండా ఉన్నత చదువులు చదివించాలని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మంచి ఫలితాలు వచ్చాయని కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం కూడా అందించనుందని తెలిపారు. అందరూ హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. రైతులు పంటమార్పిడి విధానాలు అవాలంభించాలని సూచించారు. సన్న రకం వరిని వేయడానికి మొగ్గు చూపించాలని సూచించారు. వ్యర్థాల నిర్వహణపైన కూడా అవగాహనా కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా తిరుమలాపూర్ గ్రామంలో రూ. 10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రారంభించారు. గ్రామసభలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమం లో సర్పంచ్ జ్యోతి గోపాల్, నాయకులు యాదయ్య, జిల్లా బీసీ సంక్షేమ అధికారి మూజహిద్, మండల స్థాయి అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించండి.. సురక్షితంగా ఇంటికి చేరుకోండి..

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపు**

**- రోడ్డు భద్రత వాహనదారుల ప్రాణాలు కాపాడటానికే తప్ప ఇబ్బంది పెట్టడానికి కాదు**

**- జిల్లా ఎస్పీ సునీత రెడ్డి**







వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 10 (విజన్ ఆంధ్ర) : ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నిబంధనలు తప్పక పాటించాలని, తన ప్రాణంతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వనపర్తి మున్సిపల్ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా బుధవారం స్థానిక కల్యాణసాయి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఆటో డ్రైవర్లు, బస్ డ్రైవర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు దేశంలో జరిగిన కొన్ని ఘోర రోడ్డు ప్రమాదాలను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. అదేవిధంగా పోలీస్, సాంస్కృతిక శాఖ కళాకారులు రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాల సేవనం ద్వారా జరిగే అనర్థాలను కళా ప్రదర్శన ద్వారా చూపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాహనం నడిపే ప్రతి డ్రైవరు నేను చాలా బాగా నడిపిస్తాను అనే ధీమాతోనే ఉంటారని కానీ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయినప్పుడు వారి కుటుంబ సభ్యులకు నిర్లక్ష్యానికి మూల్యం ఎంతటిదో తెలుస్తుందన్నారు. దేశంలో ప్రతి 4 నిమిషాలకు రోడ్డు ప్రమాదం ద్వారా ఒకరి ప్రాణం పోతుందని తెలియజేశారు. అందుకే వనపర్తి జిల్లాలో ప్రమాదాల నివారణ కొరకు వాహనదారులకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నా రు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు తప్పకుండా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెంట్ పెట్టుకోవడం, నాలుగు చక్రాల వాహనం నడిపేవారు సీటు బెల్టు వేసుకోవడం, స్పీడ్ లిమిట్ పాటించడం, మద్యం సేవించి వాహనాలు నడిపించకపోవడం, ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపించకపోవడం వంటి కనీస నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించే వారిని ఉపేక్షించేది లేదని, జరిమానాలు భారీగా వేయడం జరుగుతుందని తెలియజేశారు. జిల్లా ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ పోలీసులు రోడ్డు పై తనిఖీలు నిర్వహించినప్పుడు పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని అపోహ పడతారని, కానీ రోడ్డు భద్రత అనేది వాహనదారుల ప్రాణాలు కాపాడటానికే తప్ప ఇబ్బందులకు గురి చేయడానికి కాదనీ స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలు విపరీతంగా జరిగి ప్రతి రోజు దేశంలో కనీసం 15 మంది తమ ప్రాణాలు కోల్పోతున్నారని అందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి జనవరి, 2026 నుండి పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ట్రాన్స్పోర్ట్ తదితర శాఖల సమన్వయంతో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంద న్నారు. రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని, ఇంట్లో నుంచి బయటికి వచ్చేటప్పుడు తమ ప్రాణం తో పాటు ఇతరుల ప్రాణాలు కాపాడేవిధంగా వాహనం నడిపించాలని సూచించారు. ఇప్పుడే వస్తాను అని చెప్పి రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకానికి వెళ్లిపోతే ఆ కుటుంబంలో ఎలాంటి విషాద ఛాయలు అలుముకుంటాయో అది అనుభవించే వారికి తెలుస్తుందన్నారు. వాహనం నడిపేటప్పుడు జాగ్రత్తగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ నడిపించాలని సూచించారు. అతివేగం, మత్తు పదార్థాలు సేవించి వాహనం నడపటం, మొబైల్ మాట్లాడుతూ, ఇద్దరు కంటే ఎక్కువ మందిని కూర్చోబెట్టుకొని వాహనం నడపటం, వంటి పనులు చేయవద్దని, హెల్మెంట్, సీట్ బెల్ట్ ధరించి రోడ్డు నిబంధనలు పాటిస్తూ, పాదచారులను, ఇతర వాహనాలను దృష్టిలో పెట్టుకొని వాహనం నడపాలని సూచించారు. అనంతరం రోడ్డు భద్రత పై కళా ప్రదర్శన నిర్వహించిన తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులు, పోలీస్ కళాకారులకు హెల్మెంట్ ప్రధానం చేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా మున్సిపల్ కమిషనర్ మునావర్ అలీ, డి.ఎస్.పి గిరిధర్, బసంతి ఫౌండేషన్ నిర్వాహకులు అజయ్ నాయుడు, వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్లు, సి.ఐ లు, ఆటో డ్రైవర్లు బస్ డ్రైవర్లు మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# మొక్కలు నాటడం ద్వారానే మెరుగైన భవిష్యత్తు

**- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 10 (విజన్ ఆంధ్ర) : మొక్కలు నాటడం ద్వారా వర్షాలు సమృద్ధిగా కురిసి, తద్వారా పర్యావరణ సమతుల్యత చేకూరి రాబోయే తరాలకు మెరుగైన భవిష్యత్తు లభిస్తుందని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం పెబ్బేరు మండలం రంగాపూర్ గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామసభ, పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో వార్డు సభ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, బాల్యవివాహాల నిర్మూలన, వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, పంట మార్పిడి, ఎరువుల వాడకం, పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం, జల సంరక్షణ, పాఠశాలల్లో సౌకర్యాలు సహా తదితరాంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా వర్షాలు సమృద్ధిగా కురిసి, తద్వారా పర్యావరణ సమతుల్యత చేకూరి రాబోయే తరాలకు మెరుగైన భవిష్యత్తు లభిస్తుందని అన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి మంచినీటి సదుపాయాలు కలుగుతాయి అన్నారు. అదేవిధంగా గ్రామంలో గత ఐదేళ్ల వ్యవధిలో 18 ఏళ్ల నుండి 59 ఏళ్లలోపు వ్యక్తులు ఎవరైనా మరణిస్తే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా దరఖాస్తు చేసుకొని రూ. 20 వేల లబ్ధి పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం అర్హులైన ఓటర్లందరినీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తుందని ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని సూచించారు. ఈ గ్రామసభకు జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీఓ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, పెబ్బేరు వార్డు సభలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, మండల వ్యవసాయ అధికారి, ఎంపీఓ, ఎస్ఐ, పంచాయతీ కార్యదర్శి, ప్రజాప్రతినిధులు మరియు ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు.

## ఉపాధి, ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



ములుగు, జూన్ 10, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచి ఉపాధి అవకాశాలు కల్పించాలని, వీవో భవనాల నిర్మాణాలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ లిబోర్ఖడే హేమంత్ సహదేవరావులి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఐ=ణూ అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో లక్ష్యాలు సాధించాలని, లబ్ధిదారులకు సహకారం అందించాలని సూచించారు. వర్షాకాలం ప్లాంటేషన్ లక్ష్యాలు పూర్తి చేయడంతో పాటు మొక్కల సంరక్షణపై దృష్టి పెట్టాలన్నారు. సామాజిక భద్రతా పెన్షన్ల దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి అర్హులకు మంజూరు చేయాలని, ఇందిరా మహిళా శక్తి కేంద్రం, పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అనుమతులు త్వరితగతిన తీసుకోవాలని ఆదేశించారు. తాడ్వాయి కొండపర్తిలో మహిళా సంఘాల మిర్చి-పసుపు ప్రాసెసింగ్, ఇప్పపూల లడ్డు యూనిట్లపై ఆరా తీసిన కలెక్టర్, గిరిజన మహిళల ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి ఆదాయం పెంచాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, డి ఆర్ డి ఎ పి డి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## “ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక“: రైస్, కాటన్ మిల్లర్లతో కాలుష్యం పై వర్క్‌షాప్ నిర్వహణ.

**- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో... గ్రీన్ టెక్నాలజీకి సై.**

**- ఆతిథ్యమిచ్చిన “బాదం ప్రవీణ్“.**



ములుగు జూన్ 10, విజన్ ఆంధ్ర ప్రతినిధి : 99 రోజుల కార్యాచరణ “ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక“లో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, రైస్ మిల్లర్స్, కాటన్ మిల్లర్స్ అసోసియేషన్ సంయుక్తంగా బుధవారం వర్క్‌షాప్ నిర్వహించాయి. కాలుష్య నియంత్రణ మండలి నోడల్ అధికారి వి. అరుణ దేవి మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ నిషేధం, ఎస్ డబ్ల్యూ ఎం –2026 నిబంధనలు, సి ఏ ఆర్ & సి ఎస్ ఆర్ అమలు, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ టెక్నాలజీలపై అవగాహన కల్పించారు. సౌర శక్తి, వర్షపు నీటి సంరక్షణ, గ్రీన్ మోడలింగ్‌పై ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించగా వీరికి ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అధ్యక్షులు “బాదం ప్రవీణ్ కుమార్“ ఆతిథ్యమిచ్చారు. రైస్, కాటన్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొని చురుగ్గా చర్చించారు.

## కొల్లాపూర్ ముదిరాజ్ సంఘ భవన స్థల సాధనపై డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డికి వనపర్తి లో వినతి



కొల్లాపూర్ జూన్ 10: (విజన్ ఆంధ్ర) : కొల్లాపూర్ రాజా ప్యాలెస్ దక్షిణ భాగంలో ఉన్న ముదిరాజ్ సంఘ భవన స్థలం బ్లాక్ నెంబర్ 3గా రికార్డులో ఉన్నప్పటికీ, అధికారులు పొరపాటుతో బ్లాక్ నెంబర్ 10గా నమోదు చేయడంతో ఆ స్థలంలో మున్సిపాలిటీ అనుమతులు తీసుకొని నిర్మించిన సంఘ భవనాన్ని అక్రమంగా కూల్చివేశారని తెలియజేయబడింది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ బోర్డ్ వైస్ చైర్మన్ ఏఐసీసీ సెక్రెటరీ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ని కొల్లాపూర్ ముదిరాజ్ సంఘ పెద్దలు బుధవారం వనపర్తి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ ఇన్చార్జి అధ్యక్షులు తూర్పు కుమారస్వామి ముదిరాజ్ , సంఘ క్రియాశీల బాధ్యులు జూపల్లి నాగేంద్రము ముదిరాజ్, శ్రీనివాసులు, పాండు ,మురళీకృష్ణ , యాదగిరి మొదలగువారు పాల్గొన్నారు. ముదిరాజ్ సంఘం సభ్యులు మాట్లాడుతూ, సంఘం సార్వత్రికంగా రీజినల్ డిప్యూటీ డైరెక్టర్‌కు సర్వే రికార్డులు, పాత ఫోటోలు, సంఘ సభ్యుల సంతకాలతో కూడిన ఆధారాలు సమర్పించి, కొల్లాపూర్ ముదిరాజ్ సంఘ భవన స్థల విషయంలో న్యాయం చేయాలని చిన్నారెడ్డిని కోరారు. డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి సమస్యను సానుభూతితో విని, తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సంఘం ఇన్చార్జి అధ్యక్షులు తూర్పు కుమారస్వామి ముదిరాజ్ తెలియజేశారు.

## జిల్లా కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిననూతన డి.యం.అండ్ హెచ్. ఓ .డాక్టర్ సాధన



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 10, (విజన్ ఆంధ్ర) నూతన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణిగా డా.పి.సాధన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం కలెక్టర్ క్యాంపు ఆఫీస్ లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ, వైద్య శాఖ కార్యకలాపాలు, రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా తన వంతు కృషి చేస్తూ, సమర్థవంతంగా విధులను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి మనోహర్, డా.నరేందర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# హరిద్వార్ శాంతికుంజ్‌లో సప్తదిన గాయత్రీ మహాయజ్ఞం దిగ్విజయం

- 12 రాష్ట్రాల వేలాది భక్తుల సమాగమం, బ్రహ్మానందం పొందిన భక్తజనం.
- శ్రీశ్రీశ్రీ నిత్య నిర్మలానంద యాత్ర యోగేశ్వర స్వామి సిద్ధాంతి.





ములుగు జూన్ 10, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా మల్లంపల్లి మండలం నుంచి శ్రీ శ్రీ నిత్యనిర్మలానంద దంపతులు, వరంగల్ నుండి 160 మంది హరిద్వార్ లోని భారతీయ సంస్కృతికి ప్రతీకగా, వేద ధర్మ పరిరక్షణ కోసం హరిద్వార్ శాంతికుంజ్ పండిట్ శ్రీరామ శర్మ ఆచార్య భగవతీదేవి ఆశ్రమంలో సప్తదిన గాయత్రీ మహాయజ్ఞ క్రతువు ఘనంగా ముగిసింది.

**సప్తాహ యజ్ఞ క్రతువు వైభవం.**

స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సర అధిక జ్యేష్ఠ బహుళ తదియ తేదీ 03-06-2026 బుధవారం నుండి వారం రోజులపాటు ఈ మహా యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. గాయత్రీ మంత్ర జపం, హోమాలు, పూర్ణాహుతితో యజ్ఞం పూర్తయింది. ఆశ్రమ ముఖ్య అతిథులు సందీప్ మహారాజ్, సుబ్బారావు మహారాజ్ యజ్ఞ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ఆశీస్సులు అందించారు. వారి ప్రవచనాలు భక్తజనానికి ఆధ్యాత్మిక స్ఫూర్తిని ఇచ్చాయి. పంచాంగ కర్త దంపతులు పాల్గొన్నారు

ఈ మహాయజ్ఞంలో ములుగు జిల్లా మల్లంపల్లి వాస్తవ్యులు, 401 సంవత్సరాల చరిత్ర కలిగిన పంచాంగ కర్త శ్రీ శ్రీ శ్రీ నిత్య నిర్మలానంద యాత్ర యోగేశ్వర స్వామి సిద్ధాంతి, వారి ధర్మపత్ని ఆండాళ్ దేవి శర్మ దంపతులు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. వారు యజ్ఞ కార్యక్రమంలో కీలక పాత్ర పోషించి భక్తులకు వేదాశీస్సులు అందించారు.

**12 రాష్ట్రాల భక్తుల భక్తి సమాగమం**

దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల నుండి వేలాదిమంది భక్తులు, వేద పండితులు ఈ మహా కార్యక్రమానికి తరలివచ్చారు. వారందరూ యజ్ఞ కుండంలో ఆహుతులు వేసి, గాయత్రీ మాత అనుగ్రహం పొందారు. యజ్ఞంలో పాల్గొన్న భక్తులంతా బ్రహ్మానంద స్థితిని పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. వరంగల్ జిల్లా నుండి మాత్రమే 160 మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.

**పుణ్యక్షేత్రాల దర్శనం**

యజ్ఞ కార్యక్రమంలో భాగంగా భక్తులంతా యమునా నదిలో పుష్కర స్నానాలు ఆచరించారు. అనంతరం హరిద్వార్, ఋషికేష్ పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నారు. రామ్-లక్ష్మణ్ జ్యూల, భగవతీదేవి, చాండీదేవి, మానసాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివార్ల దర్శనభాగ్యం పొందారు. హరిద్వార్‌లోని సప్తసరోవర ఘాట్ వద్ద చేసిన గంగాస్నానం భక్తులకు మరపురాని అనుభూతిని ఇచ్చింది.

**ధార్మిక చైతన్యం**

ఈ సప్తదిన యజ్ఞంతో హరిద్వార్ ప్రాంతమంతా వైదిక మంత్రోచ్ఛారణలతో మారుమోగింది. గాయత్రీ మాత కృపతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందాలని, దేశం సుభిక్షంగా ఉండాలని భక్తులంతా సంకల్పం చేశారు. నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు క్రమశిక్షణతో నిర్వహించారు.

# మానవత్వం రూపమై... పేద కుటుంబానికి చేయూతై!!

- కన్నీటి వేళ.. కొండంత అండ
- ఆత్మహత్య చేసుకున్న శివకుమార్ కుటుంబానికి 10వేల సాయం
- అందజేసిన బీఆర్ఎస్ నేత వ్యాల్ల హరీష్ రెడ్డి




పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 10 (విజన్ ఆంధ్ర): ఆపదలో ఉన్నామన్న ఆర్తనాదం వింటే చాలు, నేనున్నానంటూ ముందుకొచ్చే కరుణామయుడు, నిస్సహాయుల కన్నీళ్లు తుడిచే ఆపద్బాంధవుడు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి అని మాతంగి కాలనీ వేదికగా మరోసారి నిరూపితమైంది. ఆర్థిక ఇబ్బందుల సుడిగుండంలో చిక్కుకుని, తట్టుకోలేక గత నెల 30న ఆత్మహత్యకు పాల్పడిన సింహరాజు శివకుమార్ కుటుంబం రోడ్డున పడిన వేళ, ఆ నిరుపేద కుటుంబానికి కొండంత అండగా నిలిచారు హరీష్ రెడ్డి. శివకుమార్ పెద్దకర్మ సందర్భంగా మాతంగి కాలనీ యువత నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఫాలోవర్స్ ను పంపించి, బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని నూరిపోస్తూ రూ. 10,000ల తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఒక సంక్షోభ సమయంలో, ఆ నిస్సహాయ కుటుంబానికి ఈ సాయం ఒక ఆశాకిరణంలా మారిందని, కష్టకాలంలో తమను ఆదుకున్న హరీష్ రెడ్డికి ఆ కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, నిత్యం ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, ఆర్తుల ఆకలి తీరుస్తూ, అర్హులకు ఆర్థిక సహాయం అందించడమే ధ్యేయంగా పెట్టుకున్న హరీష్ రెడ్డి సేవా దృక్పథం స్థానికులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆయనది కేవలం సహాయం చేసే హస్తం కాదు, సమాజాన్ని ప్రేమించే గొప్ప హృదయమని, ఇలాంటి నాయకుడు ప్రజల మధ్య ఉండటం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని స్థానికులు కొనియాడారు. ఈ మానవతా కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు కంకల దేవేందర్, బూరుగు వంశీకృష్ణ, జెట్టి చందు, రాచర్ల సాగర్, వెజ్జ సదన్ తదితరులు హాజరై, హరీష్ రెడ్డి అడుగుజాడల్లో తాము కూడా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతామని చాటిచెప్పారు.

# బీ కేర్ ఫుల్ పుట్ట మధు!!

- రాజకీయ భిక్ష పెట్టిన నాయకుడిపైనే విమర్శలా?
- శ్రీధర్ బాబుపై నిరాధార ఆరోపణలు మానుకో
- మంథని ప్రజల తీర్పు మరిచావా పుట్ట మధు..?
- టీపీసీసీ సెక్రెటరీ పెద్దెల్లి ప్రకాష్



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 10 (విజన్ ఆంధ్ర): గోదావరిఖనిలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ సెక్రెటరీ, న్యాయవాది పెద్దెల్లి ప్రకాష్ తీవ్ర స్థాయిలో స్పందించారు. తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్న నాయకుడని, అలాంటి నాయకుడిపై నిరాధార ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. మంథని అభివృద్ధికి, ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన శ్రీధర్ బాబుని విమర్శించే నైతిక హక్కు పుట్ట మధుకు లేదన్నారు. రాజకీయంగా ఎదగడానికి అవకాశం కల్పించిన నాయకుడిపైనే విమర్శలు చేయడం కృతఘ్నతకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రజలు పలుమార్లు తిరస్కరించినా పుట్ట మధు తన రాజకీయ ధోరణిని మార్చుకోలేదని, కేవలం ప్రచారం కోసమే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. గుండాయిజం, విద్వేష రాజకీయాలకు ప్రతీకగా నిలిచిన వ్యక్తి అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గోదావరిఖనిలో జరిగిన ఘటనకు మంత్రి శ్రీధర్ బాబుకు ఎలాంటి సంబంధం లేదని, చట్టం తన పని తాను చేసుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో శ్రీధర్ బాబు పాత్రను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ప్రశంసించారని గుర్తుచేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి వ్యక్తిగత విమర్శలు, అసత్య ఆరోపణలు కొనసాగిస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని పెద్దెల్లి ప్రకాష్ హెచ్చరించారు.

# అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షల షెడ్యూల్!!

- జూన్ 14 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం
- మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు
- మరింత సమాచారం కోసం 7382929655 నంబర్‌ను సంప్రదించాలి
- స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.సుబ్బారావు

పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 10 (విజన్ ఆంధ్ర) : గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం స్టడీ సెంటర్ (కోడ్ నం: 055) పరిధిలో డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షల తేదీలను ప్రకటిస్తూ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి. సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా. దీని ప్రకారం బి.ఎ, బి.కామ్, బి.ఎస్సీ కోర్సుల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు 2వ సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 4వ సెమిస్టర్, తృతీయ సంవత్సరం విద్యార్థులకు 6వ సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయి. వీటిలో 6వ సెమిస్టర్ పరీక్షలు జూన్ 14 నుండి జూన్ 19, 4వ సెమిస్టర్ పరీక్షలు జూన్ 22 నుండి జూన్ 29, 2వ సెమిస్టర్ పరీక్షలను జూలై 01 నుండి జూలై 07 వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలన్నీ కూడా మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జరుగుతాయి. విద్యార్థులు తమ హాల్ టికెట్లను ఇంటర్నెట్ సెంటర్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షల సమయాలను గమనించి హాజరుకావాలని కోరారు. మరింత సమాచారం కోసం విద్యార్థులు కళాశాల మొబైల్ నంబర్ 7382929655 నందు సంప్రదించవచ్చు అని పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు ప్రకటనలో పేర్కొన్నారు.

# బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి సహకరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్



గద్వాల జూన్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. బుధవారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించినందున రాజకీయ పార్టీల నేతలు తమ వంతుగా సహాయ, సహకారాలు అందించాలని కోరారు. మృతి చెందిన ఓటర్లను, బోగస్ ఓటర్లను జాబితా నుంచి తొలగించడమే కాక అర్హులైన ఓటర్లందరూ ఎలక్ట్రోరోల్ ఓటరు జాబితాలో ఉండేలా ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టడం జరుగుతోందన్నారు. ఎస్ఐఆర్ పై ఓటర్లకు అవగాహన కల్పిస్తూ, ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు తమ వంతుగా సహకారం అందించాలన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి జూలై 24 వరకు బూత్ లెవెల్ అధికారులు తమ పరిధిలోని ఇంటింటికి తిరిగి ఓటర్ల వివరాలను సేకరించడం జరుగుతుందన్నారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి, సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారి మంజుల, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైల్వే బ్రిడ్జి కింద గుడిసెనా..?

- గద్వాల నుంచి రాయచూరుకు పోవు రహదారిపై గుడిసె నిర్మాణం
- చూచి చూడనట్లు అధికారులు



గద్వాల జూన్ 10 (విజన్ ఆంధ్ర) : ఇక్కడకు రా అంటే ఇల్లంతా నాదే అన్నట్టుగా రూపాయి అద్దె లేకుండగా జీవనం కొనసాగిస్తున్నాడు. పర్లేదులే అని పట్టణ ప్రజలు అనుకుంటుంటే ఏకంగా రైల్వే బ్రిడ్జి కింద పండ్ల వ్యాపారి గుడిసెనే వేసుకున్నాడు.నిబంధనల ప్రకారం రైల్వే లైన్ కింద ఎలాంటి వ్యాపారాలు చేసుకోకూడదు. ఇలా కఠిన నిబంధనలు వున్నా చూసి చూడనట్టు పోతున్నారంటే గొప్ప మనస్తత్వమే అధికారులది. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీ దాటాక గద్వాల నుంచి రాయచూర్ (రహదారి పై) రైల్వే లైన్ కింద ఉదయం వచ్చి సాయంకాలం వరకు ఓ చిరు పండ్ల వ్యాపారి వ్యాపారం చేసుకుని వెళ్ళిపోతున్నాడు.అది కాస్త ఎవరూ ఏమి అనట్లేదు అనుకున్నాడో లేక ఎవరేమి చేస్తారు అనుకున్నాడో తెల్వదు కాని ఏకంగా రైల్వే లైన్ కింద గుడిసె వేసి పెట్టుకున్నాడు.వేలు పెట్టడానికి సందిస్తే కాలు పెట్టేలా తయారుచేసుకున్నాడు, ఏకంగా అంటూ గుసగుసలాడుకుంటున్నారు. అటుఇటుగా వచ్చే వెళ్లే ప్రజలంతా.రాయచూర్ రైల్వే లైన్ కింద ఏదేని సంఘటనలు జరగరానిది జరిగితే అధికారులు భాద్యులను ఎవరిని చేస్తారో చూడాలని పట్టణ ప్రజలు అనుకుంటున్నారు.

# సిటిజన్-ఫస్ట్ పాలన!!

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- "స్మార్ట్ విజన్"తో మౌలిక వసతుల కల్పన
- ప్రతి దరఖాస్తుకూ న్యాయం
- పారదర్శక పాలనకు శ్రీకారం
- దళారీలు లేని పాలన.. అర్హులకే అగ్రాసనం
- ప్రభుత్వ విప్ విజయ రమణరావు



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 10 (విజన్ ఆంధ్ర): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల సుదీర్ఘ కార్యాచరణలో భాగంగా బుధవారం సుల్తానాబాద్ పట్టణ ముఖచిత్రాన్ని మార్చేందుకు అడుగులు వేస్తూ, 1, 13, 14, 15 వార్డుల సంయుక్త సభా ప్రాంగణానికి విచ్చేసిన చింతకుంట విజయ రమణరావు స్థానిక ప్రజల కళ్లలో ఆశలను, గుండెల్లోని నమ్మకాన్ని చూసి చలించిపోతూ భావోద్వేగ భరితంగా ప్రసంగించారు. "ఈ మట్టి, ఈ వీధులు, ఇక్కడి ప్రతి ఇల్లూ నా కుటుంబమేనని, మీ కష్టసుఖాల్లో తోడుండేందుకే మీ ముందుకు వచ్చానని" ఆయన సెంటిమెంట్‌ను ఒలకబోస్తూ పలికిన మాటలు సభికుల హృదయాలను హత్తుకున్నాయి. ఒక ఆధునిక దార్శనికుడిలా ఆలోచిస్తూ కేవలం హామీలకే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో డిజిటల్ మౌలిక వసతులు, స్మార్ట్ డ్రైనేజీ వ్యవస్థలు, మెరుగైన వీధి దీపాల నిర్వహణతో ఈ వార్డులను మోడల్ కాలనీలుగా తీర్చిదిద్దుతామని టెక్-శావీ శైలిలో భరోసానిచ్చారు. గత పాలకుల అలసత్వాన్ని సున్నితంగా విమర్శిస్తూనే, "ప్రజా పాలన అంటే ఆఫీసుల్లో కూర్చోవడం కాదు, ప్రతి ఇంటా ప్రగతి వెలుగులు నింపడమే" అని సరికొత్త పంథాలో డెవలప్‌మెంట్ రోడ్‌మ్యాప్‌ను వివరించారు. ఈ 99 రోజుల యాక్షన్ ప్లాన్ అనేది సుల్తానాబాద్ పట్టణ విప్లవాత్మక మార్పునకు ఒక ఆరంభం మాత్రమేనని, ప్రతి వార్డు సమస్యను పక్కా ప్లానింగ్‌తో, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఎమోషనల్ కనెక్ట్‌తో సభను మంత్రముగ్ధులను చేస్తూనే, రేపటి తరం సుల్తానాబాద్ భవిష్యత్తు కోసం తానెప్పుడూ ఒక అడుగు ముందే ఉంటానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా పారదర్శకమైన 'సిటిజన్-ఫస్ట్' పాలనను అందిస్తానని యువ నాయకుడి మార్కుతో సవాల్ చేస్తూ ప్రసంగాన్ని ముగించారు విజయ రమణరావు.

# ఫార్మర్ రిజిస్ట్రీని వేగవంతం చేయాలి

- నకిలీ విత్తనాలు అమ్మే డీలర్లపై కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల జూన్ 09 (విజన్ ఆంధ్ర బ్యూరో) : రైతుల శ్రేయస్సుకు పెస్టిసైడ్స్ డీలర్లు కట్టుబడి ఉండాలని, వ్యవసాయశాఖ అధికారులు ఫార్మర్ రిజిస్ట్రీని వేగవంతం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లాలోని పెస్టిసైడ్ దుకాణాల డీలర్లు, సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, డీలర్లు, అధికారుల కారణంగా రైతులకు ఏ చిన్న సమస్య వచ్చినా సహించేది లేదన్నారు. ఫెయిల్ అయిన, విడిగా ఉండే, గడువు ముగిసిన విత్తనాలను విక్రయించకూడదన్నారు. ప్రతి పెస్టిసైడ్ దుకాణాల వద్ద సంబంధిత డీలర్లు స్టాక్, ధరల పట్టిక, తదితర వివరాలను విధిగా ప్రదర్శించాలన్నారు. విత్తనాలు, ఎరువులు అమ్మేందుకు కొత్తగా లైసెన్సు తీసుకునేవారు, రెన్యువల్ చేసుకోవాల్సిన డీలర్లు నిబంధనలను పాటించాలన్నారు. యూరియా కొరత, కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగినందున అన్నదాతలు నానో యూరియాపై దృష్టి సారించేలా సహకరించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు తరచూ పెస్టిసైడ్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు పాటించని సంబంధిత దుకాణాల డీలర్ల పై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. ఫార్మర్ రిజిస్ట్రీలో జోగులాంబ గద్వాల జిల్లా ప్రస్తుతం 68 శాతంతో రాష్ట్రంలో 28వ స్థానంలో ఉందని, వంద శాతం పూర్తి చేసేందుకు ఏఈవోలు నిబద్ధతతో పనిచేయాలన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారులు కూడా ప్రత్యేక చొరవ తీసుకొని ఫార్మర్ రిజిస్ట్రీ వేగవంతం అయ్యేందుకు రెండు రోజులకోసారి తమ పరిధిలోని ఏఈవో లపై పర్యవేక్షణ చేస్తుండాలన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని, వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ అన్నదాతల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. పిఎండిడికేవై కు జోగులాంబ గద్వాల జిల్లా ఎంపికవడంతో వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో రైతులు సాంకేతికతను వినియోగిస్తూ ఆర్థికంగా ఎదిగేలా చూడాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పలువురు ఏఈఓ లతో వారి క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతుల ఫార్మర్ రిజిస్ట్రీ గురించి మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, అదనపు ఎస్పీ శంకర్, ఆత్మ డిప్యూటీ పిడి జగ్గు నాయక్, ఏడిఏ సంగీతలక్ష్మి, ఆయా మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధికి జనాభా గణన దోహదపడుతుంది

- అదనపు కలెక్టర్ నర్సింగరావు



గద్వాల జూన్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జనాభా గణన దేశాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని, ఇందులో భాగంగానే ప్రస్తుతం ఇండ్ల గణన చేపట్టినట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. బుధవారం మల్దకల్ మండలం నేతివానిపల్లె గ్రామంలో జరిగిన ప్రత్యేక గ్రామ సభకు అదనపు కలెక్టర్ హాజరై ప్రసంగించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ లో భాగంగా నాలుగు రకాల వ్యర్థల విభజన గురించి వివరించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల పథకాల గురించి రైతులకు కూలంకషంగా తెలియజేశారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల సహకారం అందిస్తుందన్నారు. వర్షకాలంలో మంచినీటి నిర్వహణ గురించి వివరించి, వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంతో ఉపాధి లేని వారికి పని దినాలు కల్పించి కూలీలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జయశంకర్ బడిబాట కార్యక్రమంతో పెద్ద ఎత్తున ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు జరిగేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రకృతి వైపరీత్యలతోపాటు ఇతర అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తెలిపిన సమస్యలను పరిష్కరించడంలో తన శాయశక్తుల కృషి చేస్తానని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామసభ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి, సర్పంచ్ పద్మ, ఉప సర్పంచ్ మునినాయక్, పంచాయతీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యులు, వివిధ శాఖల నుంచి అధికారులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# వై ఎస్ ఆర్ కడప జిల్లాను హార్టికల్చర్ హబ్ గా మార్చడమే లక్ష్యం

- ఉపాధి హామీ పథకం ద్వారా 7000 ఎకరాలలో హార్టికల్చర్ ప్లాంటేషన్
- జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



కడప,జూన్10 (విజన్ ఆంధ్ర)జిల్లాను హార్టికల్చర్ హబ్ గా మార్చడమే లక్ష్యంగా,ఉపాధి హామీ పథకం ద్వారా 7000 ఎకరాలలో హార్టికల్చర్ ప్లాంటేషన్, 27 రకాల పండ్ల/పూల/కలప నిచ్చే మొక్కలు, చిన్న సన్నకారు రైతులకు 100% ఉచితంగా సాగుకు అవకాశం కలదని, రైతులు ఈ అవకాశం ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు రాయలసీమ లో కరువు జిల్లా గా పేరుగాంచిన వై. యస్. ఆర్ కడప జిల్లాను హార్టికల్చర్ హబ్ గా మార్చే ప్రయత్నంలోభాగంగా,జిల్లాలో 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ / VBG`RAM`G ద్వారా 7000 ఎకరాలను జిల్లా కు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, గ్రామీణ ప్రాంత చిన్న / సన్నకారు రైతులు ఈ అవకాశం వినియోగించుకొని తమ బీడు భూములను సైతం పచ్చని పండ్లతోటలుగా మార్చుకొని,ప్రతి సంవత్సరం ఒక సుస్థిర ఆదాయం మార్గం ఏర్పాటు చేసుకొనేలా చేయడం లక్ష్యంగా ప్లాంటేషన్ చేపట్టడంజరుగుతోందనన్నారు.. లబ్ధిపొందడానికి అవకాశం ఉన్న పండ్ల/పూల/కలపనిచ్చే మొక్కల రకాలు. మామిడి,జీడి మామిడి, చీని, సన్న నిమ్మ, జామ,థైవాన్ జామ,సపోట,కొబ్బరి, నేరేడు, చింత, సీతాఫలం, దానిమ్మ, అంజూరా,డ్రాగన్ ఫ్రూట్, జాప్రా, అవకాడో, సిల్వర్ ఓక్, పనస,ఆయిల్ పామ్, కోకో, రబ్బరు ప్లాంటేషన్, ఆపిల్ బేర్, రోజా, మల్లె, మునగ, అధిక సాంద్రతలో మునగ, వెదురు,

చేకూరే లబ్ధి:

ఆపిల్ బేర్, రోజ్, మల్లె, మునగ, వెదురు ప్లాంటేషన్ పనులకు 2 సంవత్సరాల పాటు, మిగిలిన ప్లాంటేశన్ రకాలకు 3 సంవత్సరాల పాటు నిర్వహణా చార్జీలు చల్లించడం జరుగుతుంది. అర్హత గల రైతులకు ఉచితంగా గుంత తీయుట, మొక్కల ఖర్చు చెల్లించుత, మొక్కలు నాటినందుకు, వాటికి ఎరువులు వేసినందుకు, వాటిని సంరక్షించుకొన్నందుకు ప్రతి నెల సంరక్షణా చార్జీలు ప్రభుత్వం నుండి చెల్లించడం జరుగుతుంది.నీటి వసతి లేకపోయినా ట్యాంకర్ ద్వారా నీరుపోసుకొన్నందుకు చెల్లింపులు:-అర్హతగల చిన్న / సన్నకారు రైతులు తమ భూమిలో నీటి వసతి (బోరు/ బావి) లేకపోయినప్పటికీ సమీపంలోని కుంటలు, చెరువులు,కాలువల నుండి ట్యాంకర్ ద్వారా నీరు పోసుకొని సంరక్షించు కోవడానికి ప్రభుత్వం ద్వారా లబ్ది చేకూర్చడం జరుగుతుంది.

అందుకు అర్హతలు :-

1) గ్రామీణ ప్రాంత వాసులై ఉండాలి.2) కుటుంబ మొత్తానికి 5 ఎకరాలు లేదా అంతకంటే తక్కువ భూమికలిగిన రైతులకు 100% ఉచితంగా లబ్దిపొందవచ్చు,5 ఎకరాల కంటే ఎక్కువ భూమి కలిగిన రైతులు ఉద్యాన శాఖ ద్వారా లబ్దిపొందవచ్చు.3) దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారై ఉండాలి.

అనర్హతలు :

1) మునిసిపాలిటీ పరిధి/ కార్పొరేషన్ పరిధిలో భూములు కలిగినవారు,
2) IT రిటర్న్ ఫైల్ చేస్తున్న వారు 3) దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న వారు.
4) ప్రభుత్వ ఉద్యోగులు
5) కౌలు రైతులు

ధరఖాస్తు చేసుకోవడానికి కావలసిన పత్రాలు:-

1) ఉపాది హామీ జాబ్ కార్డ్,. నకలు 2) పట్టాదారు పాసుపుస్తకం నకలు
3) మీ సేవా/సచివాలయం నుండి ఇటీవల ప్రింట్ తీసిన 1దీ ,4) రెవెన్యూ శాఖ వారు జారీ చేసిన చిన్న / సన్నకారు రైతు పత్రం ,5) పాస్ పోర్ట్ సైజు ఫోటో,

ఆసక్తిగల రైతుకు పేర్ల నమోదు తప్పనిసరి..

అర్హత,ఆసక్తి గలవారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి తమ పేర్లను జూన్ 13 వ తేదీలోపు తమ గ్రామ ఉపాధి హామీ పీల్డ్ అసిస్టెంట్/ టెక్నికల్ అసిస్టెంట్/ మండలంలో ఉపాధి హామీ ~~~ లేదా మండల పరిషత్ అభివృద్ధి అధికారి గారిని సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలి

పేర్లు నమోదు చేసుకొన్న వారు ధరఖాస్తు ఎలా :

రైతులు తమ గ్రామ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్/ టెక్నికల్ అసిస్టెంట్/ మండలంలో ఉపాధి హామీ ~~~ లేదా మండల పరిషత్ అభివృద్ధి అధికారి గారిని సంప్రదించి పై తెలిపిన పత్రాలు సమర్పించి ధరఖాస్తు చేసుకోవాలి

# శ్రమజీవుల పక్షపాతి మంత్రి వివేక్..!!



- ఏడాది పాలనలో 'చారిత్రాత్మక' మైలురాయి
- స్వేదానికి దక్కిన గౌరవం
- తెలంగాణ ప్రగతి చక్రాల్లో 'కనీస వేతన' విప్లవం
- రాష్ట్రంలోని 1.11 కోట్ల మంది శ్రమజీవుల బతుకుల్లో సరికొత్త వెలుగులకు నింపిన మంత్రి వివేక్..

**కష్టం విలువ తెలిసిన కార్మిక నేతకు అక్షర నీరాజనాలు పలుకుతూ "విజన్ ఆంధ్ర" అందిస్తున్న ప్రత్యేక కథనం..**

**హైదరాబాద్, జూన్ 10 :** పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు.. ఒంటిని నమ్ముకుని, రెక్కల కష్టాన్ని నమ్ముకుని బతికే శ్రమజీవి ముఖంలో ఆనందం కనిపిస్తే ఆ కిక్కే వేరు. ఫ్యాక్టరీలో తిరిగే చక్రాల వెనుక, ఆకాశాన్ని తాకే భవనాల పునాదుల వెనుక, సూదితో బట్టలు కుట్టే చేతుల వెనుక.. ఉన్నది కేవలం చెమట చుక్కలు మాత్రమే కాదు, వారి కుటుంబాల ఆశలు కూడా. సరిగ్గా 12 ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆ ఆశలకు, ఆకలి కేకలకు ఇప్పుడు ఒక చారిత్రాత్మక ముగింపు లభించింది. తెలంగాణ కార్మిక శాఖ మంత్రి వివేక్ నేతృత్వంలో.. ఒక సంవత్సరం విజయవంతమైన పాలన ముగిసిన సందర్భంగా, రాష్ట్రంలోని కోట్లాది మంది కార్మికుల జీవితాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది.

**12 ఏళ్ల నిరీక్షణకు తెర.. చారిత్రాత్మక కనీస వేతనాల సవరణ!!**

ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా పుష్కర కాలం పాటు కార్మికుల కనీస వేతనాలు పెరుగకుండా నిలిచిపోయాయి. పెరిగిన ధరలు, పెరిగిన కడుపు




కోతలు తప్ప ఆదాయం పెరగని పరిస్థితి. కానీ, శ్రమకు గౌరవం ఇవ్వాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇప్పుడు 1.11 కోట్ల మంది కార్మికుల ఇళ్లల్లో దీపావళి తెచ్చింది. కార్మికుల నైపుణ్యాన్ని బట్టి పెరిగిన వేతనాల వివరాలు చూస్తే.. ఏ ఒక్కరినీ ప్రభుత్వం వదిలిపెట్టలేదని స్పష్టమవుతోంది. కార్మికుల కనీస వేతనాల పెంపులో భాగంగా నైపుణ్యం లేని కార్మికుల వేతనం రూ12,750 నుంచి రూ16,000కు పెరిగి రూ.3,250 అదనంగా లభించనుంది. అర్ధనైపుణ్య కార్మికుల వేతనం రూ13,152 నుంచి రూ17,000కు పెరిగి రూ3,848 మేర పెరుగుదల నమోదైంది. నైపుణ్య కార్మికుల వేతనం రూ14,157 నుంచి రూ18,500కు పెరిగి రూ4,343 అదనంగా అందనుంది. అలాగే అత్యున్నత నైపుణ్య కార్మికుల వేతనం రూ15,184 నుంచి రూ20,000కు పెరిగి రూ4,816 మేర పెరుగుదల కలిగింది. ఈ వేతనాల పెంపు ద్వారా అన్ని వర్గాల కార్మికులకు గణనీయమైన ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది.

**నెలకు రూ4,816.. ఏడాదికి రూ57,792 అదనపు భరోసా!!**

ఈ పెంపు కేవలం నంబర్లు మాత్రమే కాదు.. ఒక తండ్రి తన బిడ్డకు కొనిచ్చే మంచి బట్టలు, ఒక తల్లి తన పిల్లల చదువుల కోసం దాచుకునే రూపాయి. గరిష్టంగా నెలకు రూ4,816 అదనపు ఆదాయం అందుతుంటే, సంవత్సరానికి అది రూ57,792 అవుతుంది. ఈ మొత్తం ఒక మధ్యతరగతి లేదా పేద కార్మిక కుటుంబానికి ఎంతటి కొండంత అండ అనేది మాటల్లో చెప్పలేము.

**శ్రమకు గౌరవం... తెలంగాణకు ప్రగతి..."**

అవును, ఏ రాష్ట్రంలో అయితే కార్మికుడు సంతోషంగా ఉంటాడో, ఆ రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతుంది. మంత్రి వివేక్ ఒక సంవత్సరం పదవీ కాలం పూర్తయిన తరుణంలో, కార్మికుల హృదయపూర్వక ఆశీస్సులు ఆయనకు అందుతున్నాయి. ఈ కనీస వేతనాల సవరణ తెలంగాణ పారిశ్రామిక, కార్మిక రంగాల్లో ఒక కొత్త శకానికి నాంది పలికింది. చెమట చిందించే చేతులకు నమ్మకాన్ని, వారి కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. కష్టం విలువ తెలిసిన కార్మిక నేతగా మంత్రి వివేక్ వెంకటస్వామి కార్మికుల నీరాజనాలు అందుకుంటున్నారు.

**- గడ్డం సంతోష్ రాజ్**
స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)

# మేడ మీద మేడలి..! అనుమతులు ఏడలి..!

- కాప్రా సర్కిల్ లో యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- మున్సిపల్ ఆదాయానికి భారీ గండి
- నోటీసులకే పరిమితం అవుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు







కాప్రా /జూన్ 10 (విజన్ ఆంధ్ర ప్రతినిధి) : ఉప్పల్ నియోజక వర్గం కాప్రా సర్కిల్లో అనుమతులు లేకుండా మేడ మీద మేడ నిర్మాణాలు వెలుస్తున్నాయి కాలనీలో అక్రమ సెల్లార్లు అంతస్తులు భవనాలు పెరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు ప్రతి అక్రమ నిర్మానం వెనుక సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధుల హస్తం ఉన్నదనే ఆరోపణలు ఉన్నాయి ఎవరైనా ఫిర్యాదు ఫిర్యాదు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుం టున్నారని అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి సర్కిల్ పరిధిలో ఓ చైన్ మెన్ హవా జోరుగా సాగుతుందని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు, కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి కాప్రా, డాక్టర్ ఏ.ఎస్. రావు నగర్, చర్లపల్లి, హౌసింగ్ బోర్డు,మల్లాపూర్, నాచారం, డివిజన్ల పరిధిలో పలు కాలనీలో అక్రమ సెల్లార్లు, బహుళ అంతస్తుల భవనాలు, అదనపు అంతస్తు నిర్మాణాలు జరుగుతున్న అధికారులు మాత్రం ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ జరిగే ప్రతి అక్రమ నిర్మాణం వెనుక మున్సిపాలిటీ సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధుల అక్రమ నిర్మానం వెనక మున్సిపల్ సిబ్బంది ప్రజా ప్రతినిధులు కొమ్ము కాస్తున్నారనే అనే విమర్శలు ఉన్నాయి నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలు కోకోలలుగా వస్తున్నా యని ఆయా డివిజన్లో ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నరు. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే నోటీసులు ఇచ్చామంటూ చేతులు దులుపుకుంటూ కాలం వెల్లడిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటున్న మున్సిపల్ అధికారుల తీరు మారడం లేదు.? అనుమతులకు మించి భారీ బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతూ మునిసిపల్ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులు కన్నెత్తి చూడడం లేదు కిందిస్థాయి సిబ్బంది కనుసన్ను ల్లోనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయంటూ విమర్శలు వినిపిస్తున్నాయి కాసులకు కక్కుర్తి పడుతున్న మున్సిపల్ సిబ్బంది అక్రమ నిర్మాణదారులకు పరోక్షంగా సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాప్రా ఏ.ఎస్. రావు. నగర్, చల్లపల్లి, హౌసింగ్ బోర్డ్, కృష్ణానగర్, వెంకటేశ్వర నగర్, అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుతున్న అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు మున్సిపల్ సిబ్బంది కనుసన్నల్లో మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపంతో అక్రమ నిర్మాణాలు అడ్డు అదుపు లేకుండా కొనసాగుతున్నాయి మున్సిపల్ సిబ్బంది అక్రమ నిర్మాణదారులకు పరోక్షంగా సహకరిస్తున్నట్లు వార పనులు వినిపిస్తున్నాయి. సర్కిల్ పరిధిలో చైన్ మెన్ హవా జోరుగా కొనసాగుతుందని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

# గ్రంథాలయ చైర్మన్ రవిచంద్రపై అసత్య ప్రచారాలు ఖండించిన సేవాల్ సేన

**ఆర్జీ టీవీ బహిరంగ క్షమాపణ చెప్పాలి: రాహుల్ నాయక్**



ములుగు, జూన్ 10, విజన్ ఆంధ్ర ప్రతినిధి : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచంద్ర పై ఆర్జీ టీవీలో వచ్చిన అసత్య ప్రచారాలను సేవాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పోరిక రాహుల్ నాయక్ తీవ్రంగా ఖండించారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడుతున్న రవి చందర్ ఎదుగుదల ఓర్వలేక వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని మండిపడ్డారు. మీడియా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని, బీఆర్ఎస్ తొత్తుగా మారి తప్పుడు వార్తలు ప్రసారం చేయడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ములుగులో 64 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. బేషరతుగా బంజారా సమాజానికి, గ్రంథాలయ చైర్మన్‌కు ఆర్జీ టీవీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని ఒక ప్రకటనలో హెచ్చరించారు.

# రోడ్డు భద్రత, ట్రాఫిక్ క్రమశిక్షణకు జిల్లా పోలీసు శాఖ వినూత్న చర్యలు

**రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్ చేతుల మీదుగా ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్, చిల్డ్రన్ పార్క్, ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం**








ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 10, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్ బుధవారం ప్రారంభించారు. మొదటగా ఆదిలాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ను ప్రారంభించారు. ఈ ఇన్స్టిట్యూట్ ద్వారా విద్యార్థులు, డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, మైనర్లు మరియు వారి తల్లిదండ్రులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా ప్రమాణాలు, ట్రాఫిక్ సైన్ బోర్డుల ప్రాముఖ్యతపై ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. శిక్షణ అనంతరం ట్రాఫిక్ పార్క్‌లో ప్రాక్టికల్ అవగాహన కల్పించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఒకేసారి సుమారు 100 మంది శిక్షణ పొందేలా ఈ కేంద్రాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమం జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు దీర్ఘకాలికంగా దోహదపడనుంది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన 30 మంది డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. అనంతరం జిల్లా పోలీసు సిబ్బందికి నూతనంగా నిర్మించిన పోలీసు క్వార్టర్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్క్ ను ప్రారంభించారు. చిన్నారుల్లో శారీరక దారుఢ్యం, క్రీడాస్ఫూర్తి పెంపొందించే లక్ష్యంతో ఈ పార్క్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తదుపరి ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం వద్ద ఏర్పాటు చేసిన కార్ హైడ్రాలిక్స్ వ్యవస్థ ను ప్రారంభించారు. పోలీసు వాహనాల నిర్వహణ, మరమ్మతులు మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అలాగే ఆదిలాబాద్ పట్టణంలోని కొమరం భీమ్ చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ ను ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ట్రాఫిక్ సిగ్నల్స్ కీలక పాత్ర పోషిస్తాయని, పట్టణ ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర డిజిపి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ , ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) బి. సురేందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, శ్రీకాంత్ రెడ్డి, మల్లెపూల నరసయ్య, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నెల్లికుదురు మండలంలో ముగిసిన గ్రామసభలు

**సమన్వయంతో గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలి**



నెల్లికుదురు. జూన్ 10, విజన్ ఆంధ్ర: మండలం లో నిర్వహిస్తున్న గ్రామసభలు బుధవారంతో ముగిశాయి. హనుమాన్ నగర్ తండా సర్పంచ్ గుగులోతు అశోక్, రాజుల కొత్తపల్లి జనార్దన్ రెడ్డి, సీతారాంపురం భాస్కర్, ఆలేరు నాయని పద్మ, పార్వతమ్మ గూడెం పూలమ్మ, బ్రాహ్మణ కొత్తపెల్లి చిర్ర ఏకాంతం గౌడ్, దుర్గ భవాని తండా వీరన్న నాయక్ లతో లైన్ డిపార్ట్మెంట్ అధికారులు హాజరయ్యారు. సభలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. డస్ట్ బిన్ కు సంబంధించిన పచ్చ, నీలం,ఎరుపు,నలుపు డబ్బాలలో ఏ ఏ చెత్త ఉంచాలో అవగాహన కల్పించారు. వైద్య,విద్య,పంచాయతీ గ్రామీణాభివృద్ధి ,రెవిన్యూ, స్త్రీ శిశు సంక్షేమ, వికలాంగులు, వయోవృద్ధులు,గిరిజన, సాంఘిక సంక్షేమం, మైనారిటీ, స్వయం సహాయక సంఘాలు,మిషన్ భగీరథ,వ్యవసాయ, ఇరిగేషన్,ఫారెస్ట్ తదితర శాఖలలో గ్రామస్తులకు చెందిన అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలన్నారు. ఎస్సై రమేష్ బాబు మాట్లాడుతూ గంజాయి తాగిన,విక్రయించిన కేసులు తప్పవు అని హెల్మెట్ ధరించి బైకు లు నడపాలని సూచించారు. ఆయా గ్రామాలలో ఉపసర్పంచ్ లు, ఐసిడిఎస్, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# హరితహారానికి గొడ్డలి పోటు..!



**తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం ద్వారా రాష్ట్రాన్ని పచ్చదనంతో నింపాలని లక్ష్యంగా పెట్టుకున్న తరుణంలో చెంగిచెర్లలో భారీ చెట్ల నరికివేత...క్రేన్‌లతో చెట్ల తొలగింపు... రెండు వాహనాల్లో కలప తరలింపు ఆరోపణలు... ఫారెస్ట్ శాఖ పాత్రపై పలు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.**



- చెంగిచెర్లలో చెట్ల మాఫియా హల్‌చల్..?
- ఫారెస్ట్ అధికారులతో కుమ్మక్కై అక్రమార్కుల దందా..?
- ఫారెస్ట్ నిఘా వైఫల్యంపై పలు అనుమానాలు....?
- ఫిర్యాదులు చేసినా తూతూమంత్రంగా చలానాలేనా..?
- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారా?

**బోడుప్పల్ ,జూన్ 10( విజన్ ఆంధ్ర ప్రతినిధి) :** బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల ప్రాంతంలో వెలుగుచూసిన చెట్ల నరికివేత వ్యవహారం తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఇప్పటికే దశాబ్దాలుగా పెరిగిన భారీ వృక్షాలను నరికి తొలగిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా ఆందోళన కలిగిస్తున్నాయి.స్థానికుల ఆరోపణల ప్రకారం చెంగిచెర్లలోని పూసల గోదాం కాంపౌండ్ వాల్ లోపల పెద్ద ఎత్తున చెట్లను నరికి తొలగించారు. ఇందుకోసం భారీ క్రేన్‌ను వినియోగించడంతో పాటు, నరికిన కలపను రెండు పెద్ద వాహనాల్లో లోడ్ చేసి తరలించేందుకు సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. మరికొంత కలపను అదే ప్రాంగణంలో నిల్వ ఉంచినట్లు కూడా సమాచారం.అయితే ఈ వ్యవహారంలో మరింత అనుమానాలకు ఫారెస్ట్ శాఖ అధికారుల పాత్ర పై వినిపిస్తున్నాయి. చెట్ల నరికివేత జరుగుతున్నట్లు స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, కఠిన చర్యలకు బదులుగా కేవలం నామమాత్రపు చలానాలతో సరిపెట్టారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టం పనిచేస్తుందా లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం, మీడియా ప్రతినిధులు సంఘటన స్థలానికి చేరుకున్న సమయంలో చెట్ల తొలగింపుకు వినియోగించిన అసలు క్రేన్‌ను అక్కడి నుంచి తొలగించి, ఇతర వాహనాలను చూపించే ప్రయత్నం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే, ఘటన తీవ్రతను తగ్గించి చూపించే ప్రయత్నం జరిగిందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ మొక్కలు నాటిస్తుంటే, మరోవైపు ఇప్పటికే పెరిగిన వృక్ష సంపదను నరికి తొలగిస్తున్నారనే ఆరోపణలు ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తున్నాయి. ఒక మొక్కను పెంచడానికి సంవత్సరాలు పడుతుంటే, ఒక చెట్టును నరికి పడేయడానికి కొన్ని నిమిషాలే సరిపోతాయి. అలాంటి చెట్ల పరిరక్షణ బాధ్యత కలిగిన శాఖలే ప్రశ్నార్థకంగా మారడం పర్యావరణ ప్రేమికులను కలవరపెడుతోంది.



**ప్రజల ప్రశ్నలు... అధికారుల వద్ద జవాబులున్నాయా..?**

- పూసల గోదాం ప్రాంగణంలో నరికిన చెట్ల సంఖ్య ఎంత?
- చెట్ల తొలగింపుకు సంబంధించి అధికారిక అనుమతులు ఉన్నాయా?
- నరికిన కలపను ఎక్కడికి తరలించారు?
- క్రేన్, వాహనాల వివరాలను అధికారులు నమోదు చేశారా?
- ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఎందుకు కఠిన చర్యలు తీసుకోలేదు?
- ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు సమాచారం ఉందా?

**నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారా?**

నిబంధనలు ఉల్లంఘించి చెట్ల నరికివేతకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తారా? లేక చలానాలతోనే వ్యవహారాన్ని ముగిస్తారా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

**వాస్తవాలు వెలుగులోకి రావాలి**

హరితహారం పేరుతో మొక్కలు నాటడం ఒకవైపు... అదే సమయంలో విలువైన చెట్లు నరికివేతకు గురవుతున్నాయనే ఆరోపణలు మరోవైపు. చెంగిచెర్ల ఘటనపై వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్**

చెంగిచెర్ల పూసల గోదాం పరిసరాల్లో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న చెట్ల నరికివేత వ్యవహారంపై నిజానిజాలు నిర్ధారించి,నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వ్యక్తులు,అధికారులపై జిల్లా కలెక్టర్, అటవీ శాఖ ఉన్నతాధికారులు, విజిలెన్స్ విభాగం సంయుక్తంగా విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.

# నిఘా పక్షి సురక్షితం

- చర్ల సరిహద్దులో జీపీఎస్ ట్యాగ్‌తో కలకలం రేపిన అరుదైన రాబందు కథ సుఖాంతం
- గత రెండేళ్ల క్రితం ఇదే తరహాలో చర్ల మండలంలో రాబందు దర్శనం
- సంరక్షణ కేంద్రానికి తరలించిన అధికారులు



చర్ల, జూన్ 10 (విజన్ ఆంధ్ర): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామమైన తిప్పాపురంలో సోమవారం సాయంత్రం కనిపించిన ఓ రాబందు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది, అరుదైన జాతికి చెందిన ఈ రాబందు కాళ్లకు జీపీఎస్ (జి పి ఎస్) ట్యాగ్ ఉండటంతో గ్రామస్తులు ఆశ్చర్యానికి గురయ్యారు, తిప్పాపురం గ్రామ పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో ఈ రాబందును గమనించిన గ్రామస్తులు, దానికి అమర్చి ఉన్న జీపీఎస్ ట్యాగ్‌ను చూసి కంగారుపడ్డారు, ఇది ఏదైనా పరిశోధనలో భాగంగా వదిలింది కావచ్చునని భావించి, వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు, అడవిలో అరుదుగా కనిపించే పక్షులు, పైగా అత్యాధునిక సాంకేతికతతో కూడిన పరికరాలు ఉండటంతో స్థానికులు దీనిని ఆసక్తిగా తిలకించారు, సమాచారం అందుకున్న వెంటనే చర్ల అటవీశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని రాబందును పరిశీలించారు, వన్యప్రాణుల వలసలను, జీవనశైలిని అధ్యయనం చేసే శాస్త్రవేత్తలు లేదా అంతర్జాతీయ సంస్థలు వన్యప్రాణులకు ఇలాంటి జీపీఎస్ ట్యాగ్‌లను అమర్చుతుంటారని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు, ఈ రాబందు ఎక్కడి నుంచి వచ్చింది ? దీనిని ఏ సంస్థ పర్యవేక్షిస్తోంది ? అనే కోణంలో అధికారులు ఆరా తీసి ఫారెస్ట్ అధికారుల అదుపులోకి తీసుకున్నారు, ప్రస్తుతం రాబందును సురక్షితంగా పర్యవేక్షిస్తున్నామని, దీనిపై ఉన్న ట్యాగ్ ఆధారంగా సంబంధిత పరిశోధనా సంస్థలకు సమాచారం అందిస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతం కావడంతో, సరిహద్దు అడవుల గుండా వలస వచ్చే పక్షులపై నిఘా పెంచాల్సిన అవసరం ఉందని పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు, అయితే చర్ల మండలం ఫారెస్ట్ అధికారులు మంగళవారం సాయంత్రం పాల్వంచలోని కిన్నెరసాని వైల్డ్ లైఫ్ డివిజన్ సంరక్షణ కేంద్రం డీర్ పార్క్ లో ఈ పక్షిని అప్పగించినట్లు అటవీ శాఖ అధికారులు తెలియజేశారు, అయితే గత రెండేళ్ల క్రితం ఇదే పక్షి చర్ల మండలంలో దొరికినట్లుగా ఇదే తీరుగా జిపిఎస్ ట్యాగ్ తో ఉన్నట్లుగా దాన్ని కూడా సంరక్ష కేంద్రానికి పంపించినట్లుగా అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు, గతంలో వచ్చిన పక్ష మళ్లీ ఈ ప్రాంతంలో దర్శనం ఇవ్వటంతో అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది.

# గంజాయి నిర్మూలన, రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెరగాలి

- డీజీపీ సి.వి. ఆనంద్
- తోషం గ్రామసభలో పాల్గొన్న రాష్ట్ర డీజీపీ
- యువత మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా, రోడ్డు ప్రమాదాల నివారణకు కలిసికట్టుగా కృషి చేయాలి





ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 10, (విజన్ ఆంధ్ర) ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలోని గుడిహత్నూర్ మండలం తోషం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో లిడీజీపీ సి.వి. ఆనంద్‌లి పాల్గొన్నారు. గ్రామసభ ప్రారంభానికి ముందు ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం గ్రామ పెద్దలు, గ్రామస్తులు డీజీపీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం కొమరం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుస్సాడి కళాకారులు సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో అతిథులను ఆహ్వానిస్తూ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆదివాసీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యువత గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలు వ్యక్తిగత జీవితాలతో పాటు కుటుంబాలు, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. యువత విద్య, క్రీడలు, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా 30 మంది ఆటో డ్రైవర్లకు ప్రమాద సమయంలో ఉపయోగపడే ప్రథమ చికిత్స కిట్లను పంపిణీ చేశారు. ప్రమాదాల సమయంలో రక్తస్రావాన్ని నియంత్రించి ప్రాణాలను కాపాడడంలో ఈ కిట్లు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అదేవిధంగా తోషం, తోషం తాండా, రాగాపూర్, బోర్రమద్ది, పూనగూడ, తోయిగూడ గ్రామాలకు చెందిన ఆదివాసి యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షిస్తూ ఐదు వాలీబాల్ కిట్లను అందజేశారు. గ్రామసభలో పాల్గొన్న సుమారు 200 మంది ప్రజలకు హెల్మెట్లను పంపిణీ చేసి, హెల్మెట్ ప్రాణ రక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. అలాగే కార్లలో ప్రయాణించే సమయంలో సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబరిచిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. రోడ్డు భద్రతపై కుటుంబ సభ్యుల్లో అవగాహన కల్పించడంలో మహిళల పాత్ర కీలకమని, వాహనాలు నడిపే వారు హెల్మెట్లు ధరించేలా ప్రోత్సహించాలని సూచించారు. యువతలో డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలనే సదుద్దేశంతో నిర్వహించిన డ్రైవింగ్ లైసెన్స్ మేళాలో పాల్గొన్న 75 మంది యువతకు లర్నింగ్ లైసెన్సులను అందజేశారు. ప్రతి వాహనదారుడు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. అలాగే గతంలో లొంగిపోయిన ముగ్గురు మావోయిస్టులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్టీజోన్-1 ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి , జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ , అదనపు ఎస్పీ (అడ్మిన్) పి. మౌనిక , ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే , గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, ప్రజలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయండి

- అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి,



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూన్ 10 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి కొల్తూర్‌లోని వెంకటరమణ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా మిల్లులో కొనసాగుతున్న ధాన్యం దిగుమతి, అన్‌లోడింగ్ మరియు నిల్వ ప్రక్రియలను క్షుణ్ణంగా అదనపు కలెక్టర్ పరిశీలించారు. పరిశీలనలో భాగంగా మిల్లర్లతో సమావేశమై, కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన వాహనాలను ఎటువంటి జాప్యం లేకుండా త్వరితగతిన అన్‌లోడ్ చేయాలని ఆదేశించారు. వాహనాలు మిల్లుల వద్ద ఎక్కువ సమయం వేచి ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి అవసరమైన మేరకు హమాలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. అదేవిధంగా, మిల్లర్ అక్‌నాలెడ్జ్‌మెంట్‌లను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే జారీ చేయాల, ధాన్యం దిగుమతి ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వాహనాల నిల్వ, అన్‌లోడింగ్ మరియు రసీదు జారీ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని ఆదేశించారు. మిల్లులో ధాన్యం నిల్వ పరిస్థితులు, హమాలీల అందుబాటు మరియు వాహనాల కదలికలను అదనపు కలెక్టర్ స్వయంగా పరిశీలించి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని మిల్లర్లకు స్పష్టం చేసారు. అనంతరం అదనపు కలెక్టర్ బొమ్మరాశిపేట లోని గోడౌన్‌ను పరిశీలించారు. గోడౌన్‌కు ఇప్పటివరకు దిగుమతి అయిన ధాన్యం పరిమాణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, కొనుగోలు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన అదనపు గోడౌన్‌లను వెంటనే గుర్తించి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# జిల్లాలో టాయిలెట్ లేని ప్రభుత్వ పాఠశాల ఉండకూడదు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 10 (విజన్ ఆంధ్ర) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యం తప్పక ఉండాలని, టాయిలెట్ సౌకర్యం లేని పాఠశాలలు ఒక్కటి కూడా ఉండటానికి వీల్లేదని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, కిచెన్ షెడ్స్ సహా పలు అంశాలపై అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మరుగుదొడ్ల సౌకర్యం లేని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క పాఠశాలకు మరుగుదొడ్లు అత్యంత ముఖ్యమని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యం తప్పక ఉండాలని, టాయిలెట్ సౌకర్యం లేని పాఠశాలలు ఒక్కటి కూడా ఉండటానికి వీల్లేదని ఆదేశించారు. గతంలో విద్యాశాఖ అధికారుల నుంచి తెప్పించుకున్న నివేదిక ప్రకారం 97 పాఠశాలలకు టాయిలెట్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వాటిల్లో కొన్ని పాఠశాలల్లో నిర్మాణాలు పూర్తి కాగా, 26 పాఠశాలల్లో నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని వాటిని జూన్ చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పూర్తయిన నిర్మాణాలను సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పాఠశాలల్లో మంజూరైన కిచెన్ షెడ్యూల్ నిర్మాణాలను కూడా త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, జిల్లాలోని ఎంఈఓ లు తమ పరిధిలోని పాఠశాలల్లో అపార్ ఐడీల జనరేషన్ ప్రక్రియ పెంచాలన్నారు. దాంతో పాటుగా యూడైస్ అప్డేషన్, ఎంఈఓ ల స్కూల్ విజిట్స్ కూడా పెరగాలని ఆదేశించారు. జిల్లాలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలకు సంబంధించి మండల అధికారులు తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. జిల్లాలో అన్ని పాఠశాలలకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయడం జరిగిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి**

ఉపాధి హామీ పథకంలో భాగంగా మొత్తం యాక్టివ్ జాబ్ కార్డుల్లో 40% కూలీలకు పని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంపీడీవోలకు ఆదేశించారు. కొత్త పనులు చేపట్టి కూలీలకు పని కల్పించాలని సూచించారు. అన్ని గ్రామాల్లో సర్పంచులు, వార్డు మెంబర్లకు ఇంకుడు గుంతలను మంజూరు చేసి పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కల పెంపకం కోసం స్థలాలను గుర్తించి కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. పాఠశాలల్లో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసేందుకు చొరవ తీసుకోవాలని ఆ దిశగా ఉపాధ్యాయులను ప్రోత్సహించాలని సూచించారు. ఇక జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద లబ్ధిదారులను గుర్తించి వేగంగా వారి దరఖాస్తులను ఉన్నతాధికారులకు ఫార్వర్డ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తద్వారా లబ్ధిదారులకు 20వేల రూపాయల లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలన్నింటిలో గ్రామ కార్యదర్శులు భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా 'ఏక్ పేడ్- మాకే నామ్' అనే వాల్ పోస్టర్ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జడ్పీ సీఈవో యాదయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారిని ఉమాదేవి, గృహ నిర్మాణ శాఖ పీడి విఠోబా, పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్, ఈడబ్ల్యుఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి

- అదనపు కలెక్టర్ ఖీమ్య నాయక్



పెబ్బేరు, జూన్ 10 ( విజన్ అంధ్ర ) : మొక్కలు నాటడం ద్వారా వర్షాలు సమృద్ధిగా కురిసి, తద్వారా పర్యావరణ సమతుల్యత చేకూరి రాబోయే తరాలకు మెరుగైన భవిష్యత్తు లభిస్తుందని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం పెబ్బేరు మండలం రంగాపూర్ గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామసభ, పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో వార్డు సభ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, బాల్యవివాహాల నిర్మూలన, వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, పంట మార్పిడి, ఎరువుల వాడకం, పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం, జల సంరక్షణ, పాఠశాలల్లో సౌకర్యాలు సహా తదితరాంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా వర్షాలు సమృద్ధిగా కురిసి, తద్వారా పర్యావరణ సమతుల్యత చేకూరి రాబోయే తరాలకు మెరుగైన భవిష్యత్తు లభిస్తుందని అన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి మంచినీటి సదుపాయాలు కలుగుతాయి అన్నారు. అదేవిధంగా గ్రామంలో గత ఐదేళ్ల వ్యవధిలో 18 ఏళ్ల నుండి 59 ఏళ్లలోపు వ్యక్తులు ఎవరైనా మరణిస్తే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా దరఖాస్తు చేసుకొని రూ. 20 వేల లబ్ధి పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం అర్హులైన ఓటర్లందరినీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తుందని ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని సూచించారు. ఈ గ్రామసభకు జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీఓ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, పెబ్బేరు వార్డు సభలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, మండల వ్యవసాయ అధికారి, ఎంపీఓ, ఎస్ఐ, పంచాయతీ కార్యదర్శి, ప్రజాప్రతినిధులు మరియు ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు.

# ఇది ప్రజాపాలన కాదు నియంత పాలన

- గ్రామసభ బహిష్కరించిన 18 వ వార్డు కౌన్సిలర్ అనూష సాగర్.
- స్థానిక మంత్రికి తెలియదా? ఇది నియంత పాలన సీతక్కపై సంచలన ఆరోపణలు.
- కేసీఆర్ 100 దళిత బంధులు ఇచ్చి గౌరవించాడు, మీరు పేరు కూడా రాయలేదు.



ములుగు, జూన్ 09: అభివృద్ధి పనులకు శిలాఫలకాలు వేస్తారు, కానీ ఎన్నుకున్న ప్రజాప్రతినిధి పేరు రాయరు. ఇది గౌరవమా, అవమానమా అంటూ ములుగు జిల్లా కౌన్సిలర్ లిబైకని అనూష సాగర్‌లి ఆగ్రహంతో రగిలిపోయారు. శిలాఫలకంపై తన పేరు నమోదు చేయలేదని, కౌన్సిలర్‌గా కనీస గుర్తింపు లేదని ఆరోపిస్తూ ఆమె గ్రామసభను బహిష్కరిస్తున్నట్లు సంచలన ప్రకటన చేశారు. "అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కానీ వాటికి కనీస గౌరవం లేదు. అధికారులు వారికివారే ఒంటెద్దు పోకడతో శిలాఫలకాలు పెడుతున్నారు. ఎన్నుకున్న కౌన్సిలర్ పేరు రాయకుండా, మమ్మల్ని పూర్తిగా పక్కన పెడుతున్నారు" అని అనూష సాగర్ మండిపడ్డారు.

**స్థానిక మంత్రికి తెలియదా?**

ఈ వ్యవహారం మొత్తం స్థానిక మంత్రి లిసీతక్కలి దృష్టికి రాకుండా జరుగుతుందా? అని ఆమె ప్రశ్నించారు. "ఇంత పెద్ద జిల్లాలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనిపై స్థానిక మంత్రికి తెలియదా? తెలిసి కూడా మౌనంగా ఉంటున్నారా? లేక కావాలనే మమ్మల్ని అవమానిస్తున్నారా?" అంటూ నిలదీశారు.

**ఆడబిడ్డకు ఇదేనా గౌరవం.**

తోటి మహిళ, ఆడబిడ్డ అయిన సీతక్కపై ఆమె తీవ్రంగా స్పందించారు. "గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ మహిళలకు అత్యంత గౌరవం ఇచ్చారు. సీతక్క ఆడబిడ్డ అని గుర్తించి 100 దళిత బంధులు ఇచ్చారు. హరీష్ రావు, కేటీఆర్ నిండు అసెంబ్లీలో మా అక్క అని గౌరవంగా మాట్లాడారు. కానీ మీరు తోటి ఆడబిడ్డగా, మహిళగా కనీస గౌరవం కూడా ఇవ్వలేదు. శిలాఫలకం మీద పేరు నమోదు చేయలేదు" అని విమర్శించారు.

"ప్రజాపాలన కాదు, హిట్లర్ నియంత పాలన"

"ప్రజాపాలన ప్రభుత్వం కాదు ఇది, నియంత పాలన. రేవంత్ రెడ్డి పాలనను హిట్లర్ పాలన అంటున్నారు. ఆయన వారసురాలుగా నువ్వు ములుగు జిల్లాలో ఇదే చేస్తున్నావు. కౌన్సిలర్లకు ఇదేనా నువ్వు ఇచ్చే గౌరవం? ఇదంతా కావాలనే చేస్తున్నావా?" అని అనూష సాగర్ ఫైర్ అయ్యారు.

**గ్రామసభ బహిష్కరణ.**

కౌన్సిలర్లకు కనీస గౌరవం ఇచ్చి, శిలాఫలకాలపై పేర్లు నమోదు చేసే వరకు ఎలాంటి గ్రామసభలో పాల్గొనబోమని ఆమె తేల్చి చెప్పారు. ఈ నిర్ణయంతో గ్రామసభలో ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్ నేతలు కౌన్సిలర్‌కు మద్దతుగా నిలిచారు.

**రాజకీయ రచ్చ.**

ఎన్నికైన ప్రతినిధుల గౌరవం, శిలాఫలకాలపై పేర్ల నమోదు వివాదం ఇప్పుడు ములుగు జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. స్థానిక మంత్రి సీతక్క, జిల్లా యంత్రాంగం ఈ ఆరోపణలపై ఎలా స్పందిస్తారో అనే ఉత్కంఠ నెలకొంది.

# రైతులు పంట మార్పిడి విధానం, ఎరువుల నియంత్రణ పాటించాలి

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి



గోపాల్ పేట జూన్ 10 (విజన్ ఆంధ్ర ): రైతులు ఎప్పుడూ ఒకే పంట వేయకుండా పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని, ఎరువులను కూడా మోతాదుకు మించి వాడకుండా నేలలను సంరక్షించుకునే చర్యలను చేపట్టాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి పేర్కొన్నారు. బుధవారం గోపాల్ పేట మండలం జయన్న తిరుమలాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, బాల్యవివాహాల నిర్మూలన, వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, పంట మార్పిడి, ఎరువుల వాడకం, పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం, జల సంరక్షణ, పాఠశాలల్లో సౌకర్యాలు సహా తదితరాంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రణాళిక అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మొట్టమొదటి గ్రామసభ తిరుమలపురం గ్రామంలోనే నిర్వహించడం జరిగింది, చివరి గ్రామ సభను కూడా మన గ్రామంలోనే నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఇటీవల రెండు రోజులు పాలమూరు జిల్లాలో పర్యటించి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించడం జరిగిందన్నారు. నీటిని అందించడం ద్వారా గ్రామాలను సస్యశ్యామల చేయవచ్చని ఉద్దేశంతో సీఎం చేస్తున్నారన్నారు. కాబట్టి రైతులు వ్యవసాయ రంగంలో మంచి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఎప్పుడూ ఒకే పంట వేయకుండా పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని, ఎరువులను కూడా మోతాదుకు మించి వాడకుండా నేలలను సంరక్షించుకునే చర్యలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించుకోవాలన్నారు. ఎరువులు అత్యధికంగా వినియోగించడం వల్ల భూములలో సారవంతం తగ్గి భవిష్యత్తులో ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. కాబట్టి ఎరువులు మోతాదుకు మించి వినియోగించకుండా జాగ్రత్త పడాలి అన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవడం కోసం ప్రతి ఒక్కరూ 5 చెట్లు నాటాలని సూచించారు. అంతేకాకుండా చెట్లను నరికి వేయడం కూడా ఆపాలని సూచించారు. కరెంటు, నీటిని వృధా చేయకుండా జాగ్రత్త పడాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గ్రామాల్లో మద్యపాన నిషేధాన్ని అమలు పరచాలని, ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఐటిఐ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ వంటి నూతన కోర్సులను అందుబాటులోకి వచ్చిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ద్వారా పేదల సొంతింటి కల నెరవేరుస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మొట్టమొదటి గ్రామసభ తిరుమలపురం గ్రామంలోనే నిర్వహించడం జరిగింది, చివరి గ్రామ సభను కూడా గ్రామంలోనే నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధి హామీ కింద గ్రామస్థులు అందరూ తమ ఇళ్ల వద్ద పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి మంచినీటి సదుపాయాలు కలుగుతాయి అన్నారు. అదేవిధంగా గ్రామంలో గత ఐదేళ్ల వ్యవధిలో 18 ఏళ్ల నుండి 59 ఏళ్లలోపు వ్యక్తులు ఎవరైనా మరణిస్తే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా దరఖాస్తు చేసుకొని రూ. 20 వేల లబ్ధి పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం అర్హులైన ఓటర్లందరినీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తుందని ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని సూచించారు. అమ్మాయిలకు బాల్యవివాహాలు చేయకుండా ఉన్నత చదువులు చదివించాలని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మంచి ఫలితాలు వచ్చాయని కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం కూడా అందించనుందని తెలిపారు. అందరూ హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. రైతులు పంటమార్పిడి విధానాలు అవాలంభించాలని సూచించారు. సన్న రకం వరిని వేయడానికి మొగ్గు చూపించాలని సూచించారు. వ్యర్థాల నిర్వహణపైన కూడా అవగాహనా కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా తిరుమలాపూర్ గ్రామంలో రూ. 10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రారంభించారు. గ్రామసభలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమం లో సర్పంచ్ జ్యోతి గోపాల్, నాయకులు యాదయ్య, జిల్లా బీసీ సంక్షేమ అధికారి మూజహిద్, మండల స్థాయి అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# మేడారం పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయండి

- భక్తులకు శాశ్వత సౌకర్యాలు కల్పించాలి: మంత్రి సీతక్క



ములుగు జూన్ 10 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : మేడారం ఆలయ అభివృద్ధి పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసి, భక్తులకు శాశ్వత సౌకర్యాలు కల్పించాలని మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. బుధవారం మేడారం హరిత హోటల్‌లో కలెక్టర్ బోర్ఖడే హేమంత్ తో కలిసి అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు. జాతరతో సంబంధం లేకుండా ఏడాది పొడవునా భక్తులకు మెరుగైన సౌకర్యాలు ఉండాలని సూచించారు. ఆలయ ప్రాంగణం, జంపన్నవాగులో భద్రత, పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్‌పై దృష్టి పెట్టాలన్నారు. గోదావరి పుష్కరాల కోసం ముందస్తుగా స్నాన ఘట్టాలు, మరుగుదొడ్లు, 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం మంత్రి, కలెక్టర్ సమ్మక్క-సారలమ్మలను దర్శించుకున్నారు